

దర్శించండి - తరించండి
స్వయంభు శ్రీ వరసిద్ధి వినాయకస్వామి వారి దేవస్థానం
కాణిపాకం, ఐరాల (మం), చిత్తూరు జిల్లా.
సత్య ప్రమాణాలకు, ప్రత్యక్ష నిదర్శనం...
శ్రీ వరసిద్ధి వినాయక స్వామి దేవస్థానం శ్రీ స్వామి వారి
శాశ్వత అన్నదాన ట్రస్టులో భాగస్వామ్యం కండి. మీ విరాళాలను ఆన్‌లైన్‌లో కూడా పంపవచ్చు.
స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా, కాణిపాకం బ్రాంచ్
A/c No. 30178925930, IFSC No. SBIN0010105
మరిన్ని వివరాలకు : 08573-281112, 281747



# వార్తాప్రభ

RNI No. APTEL/2004/12176

epaper : https://varthaprabha.com

సమగ్ర వార్తా దినపత్రిక

విజయవాడ, హైదరాబాద్ నుండి ప్రచురణ



Y. Sreedevi
Proprietor
9397317951
Cell: 9515348320
GST : 36AHXPY3131E1ZX
NANDINI MEMENTOS
Corporate Gifting & Printing Services
Specialists in Medals*Gift Items*Shalls



E.mail- nandinimementos2@gmail.com
Chikkadpally, Hyderabad 500 020.



| విజయవాడ | సంపుటి : 24 | సంచిక : 156 | ది. 22-8-2025 | శుక్రవారం | పేజీలు : 8 | వెల : రూ.1/- |
|---|---|---|---|---|---|---|
| VIJAYAWADA | Vol.No : 24 | Issue No : 156 | Date : 22-8-2025 | Friday | Pages : 8 | Rs.1/- |


# ముగిసిన పార్లమెంటు వర్షాకాల సమావేశాలు

- వాడివేడి చర్చలు, నిరసనల మధ్య ముగిసిన పార్లమెంటు సమావేశాలు
- 120 గంటలు జరగాల్సిన సభ కేవలం 37 గంటలు మాత్రమే జరిగిన సమావేశాలు
- అనేక బిల్లులకు ఆమోదం



**న్యూఢిల్లీ,ఆగష్టు 21 (వార్తాప్రభ) :** పార్లమెంట్ వర్షాకాల సమావేశాలు వాడివేడి వాగ్వాదాలు, అనూహ్య పరిణామాల మధ్య గురువారంతో ముగిశాయి. ఉపరాష్ట్రపతి జగదీప్ ధన్‌ఖడ్ ఆకస్మిక రాజీనామా, 'ఆపరేషన్ సిందూర్' పై ప్రధాని నరేంద్ర మోదీ-కాంగ్రెస్ నేత రాహుల్ గాంధీ మధ్య తీవ్ర వాగ్వాదం వంటి కీలక పరిణామాలతో సభ దద్దరిల్లింది. బీహార్ ఎన్నికల నేపథ్యంలో 'స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్ (ఎస్ఐఆర్)'పై వ్యతిరేకంగా విపక్షాల ఆందోళనలతో సమావేశాలు చివరి వరకు గందరగోళంగానే సాగాయి. ఈ సమావేశాల్లో పలు ముఖ్యమైన పరిణామాలు జరిగాయి. అందులో ముఖ్యంగా ఉపరాష్ట్రపతి రాజీనామా:: ఉపరాష్ట్రపతి జగదీప్ ధన్‌ఖడ్ తన పదవికి అనూహ్యంగా రాజీనామా చేశారు. ఇంకా రెండేళ్ల పదవీకాలం మిగిలి ఉండగానే ఆరోగ్య కారణాలను చూపుతూ ఆయన ఈ నిర్ణయం తీసుకున్నారు. ఈ ఆకస్మిక పరిణామం జాతీయ రాజకీయాల్లో తీవ్ర చర్చకు దారితీసింది.

**మోదీ-రాహుల్ మధ్య మాటల యుద్ధం :** 'ఆపరేషన్ సిందూర్' అంశంపై లోక్‌సభలో ప్రధాని మోదీ, రాహుల్ గాంధీ మధ్య తీవ్రస్థాయిలో వాగ్వాదం జరిగింది. కాంగ్రెస్ పార్టీ పాకిస్తాన్ గొంతుగా వ్యవహరిస్తోందని మోదీ విమర్శించగా, ప్రభుత్వం భారత సైన్యం సామర్థ్యాన్ని తక్కువ చేసిందని, కేవలం మోదీ ప్రతిష్ఠను కాపాడేందుకే ఈ ఆపరేషన్ జరిగిందని రాహుల్ గాంధీ ఆరోపించారు.

**ఎస్ఐఆర్ పై విపక్షాల ఆందోళన:** బీహార్ ఎన్నికల ముందు చేపట్టిన ఎస్ఐఆర్ ప్రక్రియను వ్యతిరేకిస్తూ ఇండియా కూటమి పార్లమెంటు లోపల, బయట పెద్ద ఎత్తున నిరసనలు చేపట్టింది. 'ఓట్ల దొంగతనాన్ని ఆపండి' (స్టాప్ వోట్ చోరీ) అంటూ బ్యానర్లు ప్రదర్శిస్తూ ఎన్నికల సంఘంపై తీవ్ర ఆరోపణలు చేసింది.

**కీలక బిల్లులకు ఆమోదం:** ఈ సమావేశాల్లో రాజ్యసభ 'ఆన్‌లైన్ గేమింగ్ ప్రమోషన్ అండ్ రెగ్యులేషన్ బిల్లు 2025'కి ఆమోదం తెలిపింది. ఈ బిల్లు ఆన్‌లైన్‌లో డబ్బుతో ఆడే ఆటలను, వాటి ప్రకటనలను నిషేధిస్తుంది. మరోవైపు, తీవ్రమైన నేరారోపణలపై 30 రోజులు నిర్బంధంలో ఉన్న ప్రధానులు, ముఖ్యమంత్రులు, మంత్రులు రాజీనామా చేయాలని నిర్దేశిస్తూ కేంద్ర హోంమంత్రి అమిత్ షా ఓ కీలక బిల్లును ప్రవేశపెట్టారు.

**ఉపరాష్ట్రపతి ఎన్నికల్లో దక్షిణాది పోరు :** స్వాతంత్ర్యం వచ్చిన తర్వాత తొలిసారిగా ఉపరాష్ట్రపతి ఎన్నికల్లో ఎన్డీఏ, ఇండియా కూటములు రెండూ దక్షిణాది రాష్ట్రాల అభ్యర్థులనే బరిలోకి దింపాయి. ఎన్డీఏ తరఫున తమిళనాడుకు చెందిన సీపీ రాధాకృష్ణన్, ఇండియా కూటమి తరఫున తెలంగాణకు చెందిన జస్టిస్ బీ సుదర్శన్ రెడ్డి పోటీలో నిలిచారు.

**ఆరోపణలపై త్రిసభ్య కమిటీ :** జస్టిస్ యశ్వంత్ వర్మపై వచ్చిన 'క్యాష్-ఎట్-హోమ్' ఆరోపణలపై విచారణకు లోక్‌సభ స్పీకర్ ఓం బిర్లా ఒక త్రిసభ్య కమిటీని ఏర్పాటు చేశారు. ఇందులో సుప్రీంకోర్టు జడ్జి అరవింద్ కుమార్, మద్రాస్ హైకోర్టు చీఫ్ జస్టిస్ మణీంద్ర మోహన్ శ్రీవాస్తవ, సీనియర్ అడ్వొకేట్ పీవీ ఆచార్య సభ్యులుగా ఉన్నారు. సభా పనితీరుపై స్పీకర్ అసహనం :: విపక్షాల ప్రణాళిక ప్రకారమే సభా కార్యకలాపాలకు అడ్డంకులు సృష్టించాయని స్పీకర్ ఓం బిర్లా విమర్శించారు. మొత్తం 120 గంటలు జరగాల్సిన సభ కేవలం 37 గంటలు మాత్రమే పనిచేసిందని ఆయన తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేశారు. ఈ సమావేశాల్లో లోక్‌సభ 12, రాజ్యసభ 14 బిల్లులను ఆమోదించాయి.

# లాజిస్టిక్స్ హబ్ ఆఫ్ ఇండియాగా ఏపీ

- ఏపీకి సమీకృత లాజిస్టిక్స్ ప్రణాళిక
- ఏపీఎం టెర్మినల్స్ తో ఏపీ మారిటైమ్ బోర్డు ఒప్పందం
- సీఎం చంద్రబాబు సమక్షంలో కుదిరిన ఎంఓయూ



**అమరావతి, ఆగష్టు 21 (వార్తాప్రభ) :** ఆంధ్రప్రదేశ్ ను సముద్ర వాణిజ్యంలో తూర్పుతీర గేట్ వే గా మార్చేందుకు రాష్ట్ర ప్రభుత్వం చేస్తున్న ప్రయత్నాలు వాస్తవ రూపం దాలుస్తున్నాయి. అంతర్జాతీయ షిప్పింగ్ లాజిస్టిక్స్, పోర్టుల నిర్వహణ లో అగ్రశ్రేణి కంపెనీ ఏపీ మోలర్ మేర్స్క్ అనుబంధ సంస్థ ఏపీఎం టెర్మినల్స్ రాష్ట్రంలోని పోర్టుల అభివృద్ధికి ఏపీ మారి టైమ్ బోర్డుతో అవగాహనా ఒప్పందాన్ని కుదుర్చుకుంది. రూ. 9 వేల కోట్ల పెట్టుబడితో రామాయపట్నం, మచిలీపట్నం, మూలపేట పోర్టుల అభివృద్ధితో పాటు మౌలిక సదుపాయాలను ఏపీఎం టెర్మినల్స్ కల్పించనుంది. ఈమేరకు ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు సమక్షంలో ఏపీ మారిటైమ్ బోర్డు-ఏపీఎం టెర్మినల్స్ సంస్థలు ఒప్పందాన్ని చేసుకున్నాయి. ఈ పోర్టుల్లో ఆధునిక టెర్మినల్స్, కార్గో హ్యాండ్లింగ్ వ్యవస్థలను ఏర్పాటు చేసి నిర్వహణను చేపట్టనుంది. తద్వారా ప్రత్యక్షంగా 10 వేల మందికి ఉద్యోగ అవకాశాలు దక్కే అవకాశం ఉంది. మరోవైపు దేశీయంగా ఉన్న మార్కెట్ లో సరకు రవాణాకూ ఏపీఎం టెర్మినల్స్ సంస్థ సేవలు ఉపకరించాలని సీఎం స్పష్టం చేశారు. పోర్టులకు అనుబంధంగా ఆర్థిక ఎకో సిస్టంను రూపొందించాలని సీఎం సూచించారు. పోర్టులు, లాజిస్టిక్స్ తో ఏపీని ఫ్యూచర్ ఎకానమీగా తయారు చేయాలన్నదే తమ లక్ష్యమని సీఎం అన్నారు.

**లాజిస్టిక్స్ హబ్ అఫ్ ఇండియాగా ఏపీ..** ఆంధ్రప్రదేశ్ ను దేశంలో లాజిస్టిక్స్ హబ్ గా తీర్చిదిద్దేందుకు అవసరమైన ప్రణాళికను రూపొందించాలని ముఖ్యమంత్రి ఆదేశించారు. రైలు, రోడ్డు, అంతర్గత జలమార్గాలు, వాయు మార్గాల ద్వారా రవాణా అయ్యే కార్గోకు సంబంధించి సమగ్ర ప్రణాళిక రూపకల్పనలో సహకారం అందించాలని ఏపీఎం టెర్మినల్స్ సంస్థను సీఎం కోరారు. తెలంగాణా, చత్తీస్ ఘడ్ రాష్ట్రాలతో పాటు మహారాష్ట్ర, కర్నాటక, ఒడిశాలోని కొన్ని ప్రాంతాలు ఏపీలోని పోర్టులపైనే ఆధారపడుతున్నాయని.. ఈ రాష్ట్రాల నుంచి వచ్చే సరకు అతి తక్కువ వ్యయంతో రవాణా అయ్యేలా ఈ ప్రణాళిక ఉండాలని సీఎం సూచించారు. ఏపీలో 1053 కిలోమీటర్ల సుదీర్ఘ తీరప్రాంతంలో ప్రతీ 50 కిలోమీటర్లకు ఒక పోర్టు, లేదా హార్బర్ నిర్మాణం చేపట్టేలా కార్యాచరణ చేపట్టామని సీఎం స్పష్టం చేశారు. మరోవైపు ఏపీఎం టెర్మినల్స్ - ఏపీ మారిటైమ్ బోర్డు మధ్య అవగాహనా ఒప్పందం కార్యక్రమానికి మంత్రి బీసీ జనార్ధన్ రెడ్డి, మారిటైమ్ బోర్డు ఛైర్మన్ దామచర్ల సత్య, పరిశ్రమల శాఖ కార్యదర్శి యువరాజ్ సహా ఇతర ఉన్నతాధికారులు, ఏపీఎం టెర్మినల్స్ సంస్థ ప్రతినిధులు హాజరయ్యారు.

# మూసీ సుందరీకరణపై కాంగ్రెస్ ప్రభుత్వం భారీ దోపిడీకి తెరలేపింది

- రంగం సిద్ధం చేసింది, నిధులు కేటాయించింది కేసీఆర్ ప్రభుత్వమే
- మూసీ అభివృద్ధి పనులపై బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ఆగ్రహం
- ప్రజల సొమ్ము దోచుకోవడానికే కాంగ్రెస్ ప్రభుత్వం తాపత్రయం



**హైదరాబాద్, ఆగష్టు 21 (వార్తాప్రభ) :** మూసీ నది ప్రక్షాళన, సుందరీకరణ పేరుతో కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజల సొమ్మును దోచుకోవడానికి సిద్ధమవుతోందని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ మండిపడ్డారు. మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ ప్రభుత్వం మూసీ అభివృద్ధి కోసం అన్ని ఏర్పాట్లు చేసి, మాస్టర్ ప్లాన్ సిద్ధం చేస్తే, ఇప్పుడు కాంగ్రెస్ ప్రభుత్వం ఎస్టిమేట్స్ ను భారీగా పెంచి దోపిడీకి తెరలేపిందని కేటీఆర్ మండిపడ్డారు. బీఆర్ఎస్ నేతలు మాట్లాడుతూ.. కాళేశ్వరం ప్రాజెక్టు నిర్మాణం ద్వారా గోదావరి నీళ్లను హైదరాబాద్‌కు దగ్గరలోని కొండపోచమ్మ సాగర్‌కు తెచ్చింది కేసీఆర్ ప్రభుత్వమేనని స్పష్టం చేశారు. అలాగే, కొండపోచమ్మ సాగర్ నుండి గండిపేట చెరువుకు గోదావరి నీళ్లను తరలించడానికి 2022 లోనే ?1,100 కోట్లతో ప్రతిపాదనకు ఆమోదం కూడా కేసీఆర్ ప్రభుత్వమే ఇచ్చిందని గుర్తు చేశారు. మూసీ నదిలో చేరే 2000 MLD (మిలియన్ లీటర్స్ పర్ డే) మురుగు నీటిని శుద్ధి చేయడం కోసం మొత్తం 36 ఎస్టీపీల (సీవరేజ్ ట్రీట్మెంట్ ప్లాంట్) నిర్మాణాన్ని చేపట్టి పూర్తి చేసింది కేసీఆర్ ప్రభుత్వమేనని కేటీఆర్ తెలిపారు. మూసీ నదిలో 5 కిలోమీటర్ల మేర నాగోల్ ప్రాంతంలో సుందరీకరణ పనులు చేపట్టి, మూసీ నది ఒడ్డున ఉప్పల్ భగాయత్ లో శిల్పారామాన్ని ఏర్పాటు చేసింది గత ప్రభుత్వమేనని వివరించారు. మూసీ అభివృద్ధి కోసం మొత్తం రంగం సిద్ధం చేసి, ?16,000 కోట్లతో మాస్టర్ ప్లాన్, డిపిఆర్ (డిటైల్డ్ ప్రాజెక్ట్ రిపోర్ట్) తయారు చేస్తే, ఇప్పుడు అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం ఎస్టిమేట్స్ ను ?1,50,000 కోట్లకు పెంచి దోపిడీకి పాల్పడుతోందని ఆరోపించారు. ఈ ప్రజాధనం దోపిడీని ముమ్మాటికీ ఎండగడుతామని, దాన్ని ఖచ్చితంగా అడ్డుకుంటామని ఆయన హెచ్చరించారు. ఢిల్లీకి మూటలు పంపుతూ తమ పదవిని కాపాడుకోవడానికే కాంగ్రెస్ ప్రభుత్వం తాపత్రయ పడుతోందని, దానికి 'నగర అభివృద్ధి' అనే అందమైన ముసుగు వేసుకుందని బీఆర్ఎస్ నేతలు విమర్శించారు. ఇవన్నీ తెలంగాణ ప్రజలు గమనిస్తున్నారని కేటీఆర్ అన్నారు. ఒక వైపు నోరు తెరిస్తే కాళేశ్వరం ప్రాజెక్టు కూలిపోయిందని పచ్చి అబద్ధాలు చెబుతూ, మరోవైపు అదే కాళేశ్వరంలో అంతర్భాగమైన కొండపోచమ్మ సాగర్ నుండి గోదావరి నీటిని తీసుకుంటామని చెప్పడం కూడా విజ్ఞులైన తెలంగాణ ప్రజలు గమనిస్తున్నారని స్పష్టం చేశారు. ఒకవైపు కాళేశ్వరంపై అబద్ధాలు చెబుతూ, మరోవైపు అదే ప్రాజెక్ట్ నుంచి నీళ్లను వాడుకుంటామనడం కాంగ్రెస్ నాయకుల ద్వంద్వ నీతికి నిదర్శనమని పేర్కొన్నారు.

# ఏం.ఎల్. ఏ.లకు సీఎం చంద్రబాబు సీరియస్ వార్నింగ్!



**అమరావతి,ఆగష్టు 21 (వార్తాప్రభ) :** కొంతమంది ఎమ్మెల్యేల పనితీరుపై సీఎం చంద్రబాబు సీరియస్ అయ్యారు. ఏపీ క్యాబినెట్ భేటీ ముగిసిన అనంతరం తాజా రాజకీయ పరిణామాలపై మంత్రులతో సీఎం చంద్రబాబు ప్రధానంగా చర్చించారు. కొంతమంది ఎమ్మెల్యేల వ్యవహారం తలనొప్పిగా మారిందని చంద్రబాబు సీరియస్ అయ్యారు. గాడితప్పుతున్న ఎమ్మెల్యేల విషయంలో ఇన్చార్జ్ మంత్రులు బాధ్యత తీసుకోవాలని సీఎం సూచించారు. దస్త్రాల క్లియరెన్స్లో వేగం పెంచాలని సీఎం చంద్రబాబు మంత్రులకు దిశానిర్దేశం చేశారు. మరోవైపు శ్రీశైలం ఎమ్మెల్యే బుడ్డా రాజశేఖరరెడ్డి తీరుపై సీఎం చంద్రబాబు సీరియస్ అయ్యారు. అటవీశాఖ సిబ్బందితో ఎమ్మెల్యే వివాదంపై సీఎం ఆరా తీశారు. అధికారులతో మాట్లాడి వివరాలు తెలుసుకున్నారు సీఎం. ఉద్యోగులతో ఎమ్మెల్యే తీరుపై ఆగ్రహం వ్యక్తం చేశారు . తప్పు ఎవరిదైనా కేసు నమోదు చేసి దర్యాప్తు చేయాలని ముఖ్యమంత్రి చంద్రబాబు ఆదేశించారు.

# తీర ప్రాంతంలో పోర్టులకు రైల్వే లైన్ల అనుసంధానం మరింత పెంచుతాం

-ఎంపీ ఉదయ్ శ్రీనివాస్ ప్రశ్నకు కేంద్ర మంత్రి లిఖిత పూర్వక సమాధానం

**కాకినాడ,ఆగష్టు 21 (వార్తాప్రభ) :** ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో తీర ప్రాంతం వెంబడి ఉన్న ప్రధాన పోర్టులకు రైల్వే లైన్ల అనుసంధానాన్ని మరింత పెంచేందుకు చర్యలు తీసుకుంటున్నట్లు కేంద్ర రైల్వే శాఖ మంత్రి అశ్విని వైష్ణవ్ తెలిపారు. ఏపీలో రైల్వే ప్రాజెక్టుల పురోగతి, పోర్టులకు రైల్వేలైన్ కనెక్టివిటీ పెంపు పై గురువారం కాకినాడ ఎంపీ తంగెళ్ళ ఉదయ్ శ్రీనివాస్ అడిగిన ప్రశ్నకు కేంద్ర రైల్వే శాఖా మంత్రి అశ్విని వైష్ణవ్ లిఖితపూర్వక సమాధానం ఇచ్చారు. తీర ప్రాంతంలో రైల్వే లైన్ అనుసంధానం మరింత పెంచేందుకు ఇప్పటికే కోటిపల్లి-నరసాపురం ల మధ్య రూ. 2,120 కోట్లతో కొత్త రైల్వే లైన్ నిర్మాణం చేపట్టగా పనులు పురోగతిలో ఉన్నాయని తెలిపారు. అలాగే ఏపీలో తీర ప్రాంతంలో రైల్వే లైన్ అనుసంధాన్ని మరింత పెంచేందుకు ఆరు కొత్త రైల్వే లైన్ ప్రాజెక్టుల సంబంధించిన డిపిఆర్ లను ఆమోదించడం జరిగిందని తెలిపారు.

# అక్టోబర్ లో రాజకీయ ప్రకంపనలు

- దేశంలో అక్టోబర్ తర్వాత రాజకీయ మార్పులు జరగనున్నాయా..?
- జాతీయస్థాయిలో కొత్త సమీకరణలు తెరపైకి రానున్నాయా?
- ఏపీ పాలిటిక్స్ లో సైతం పెను మార్పులు తప్పవా?



**విజయవాడ,ఆగష్టు 21 (వార్తాప్రభ) :** ఇప్పుడు పొలిటికల్ సర్కిల్లో ఇదే ఆసక్తికర చర్చ. ఈ ఏడాది అక్టోబర్లో బీహార్ అసెంబ్లీ ఎన్నికలు జరగనున్నాయి. మరోసారి అధికారాన్ని నిలబెట్టుకునేందుకు నితీష్ కుమార్ నేతృత్వంలోని ఎన్డీఏ కూటమి..,అధికారంలోకి వచ్చేందుకు ఇండియా కూటమి గట్టి ప్రయత్నాలు చేస్తున్నాయి. అందులో భాగంగా ఎన్నికల సంఘం అక్కడ నిర్వహించిన ప్రత్యేక ఓటరు జాబితాల సవరణ కూడా పూర్తిగా రాజకీయ రంగు పులుముకుంది. దేశ అత్యున్నత న్యాయస్థానం జోక్యం చేసుకునే వరకు పరిస్థితి వెళ్ళింది. ఈ నేపథ్యంలో బీహార్ ఎన్నికల ఫలితాలు ఈ దేశంలో రాజకీయ మార్పుకు కారణం అవుతాయని విశ్లేషణలు మొదలయ్యాయి. ప్రస్తుతం ఎన్డీఏలో ఏపీ నుంచి తెలుగుదేశం పార్టీ, బీహార్ నుంచి జెడియు కీలకంగా ఉన్న సంగతి తెలిసిందే. ఒకవేళ బీహార్లో ఎన్డీఏ ఓడిపోతే మాత్రం ఏపీలో ప్రభావం చూపడం ఖాయం.

**ఓడిపోతే ఒత్తిడి..** ప్రస్తుతం ఏపీలో టిడిపి నేతృత్వంలోని కూటమి అధికారంలో ఉంది. ఇదే టిడిపి కేంద్రంలోని ఎన్డీఏలో కీలక భాగస్వామిగా ఉంది. అయితే బీహార్లో మరో ప్రధాన భాగస్వామ్య పక్షమైన జేడీయు ఓడిపోతే తెలుగుదేశం పార్టీపై ఒత్తిడి పెరిగే అవకాశం ఉంది. దేశవ్యాప్తంగా ఎన్డీఏ గ్రాఫ్ తగ్గుతోందన్న అంచనాలు వెలువడుతున్న క్రమంలో.. అందుకే ఈసీ ఆసాయంతో ఓటరు జాబితాలో పేర్లు తొలగించి ఎన్నికల్లో గెలిచేందుకు బిజెపి ప్రయత్నాలు చేస్తోందని కాంగ్రెస్ ఆరోపిస్తోంది. దీంతో సుప్రీంకోర్టు ఆదేశాల ప్రకారం చాలా మార్పులు చోటు చేసుకుంటున్నాయి ఇది ఎన్నికల ఫలితం పై ప్రభావం చూపుతోందన్న కామెంట్స్ వినిపిస్తున్నాయి.

**జగన్ అనుమానం అదే..** మరోవైపు జగన్మోహన్ రెడ్డిలో సైతం ఒక రకమైన అనుమానం ఉంది. తెలంగాణ సీఎం రేవంత్ రెడ్డి ద్వారా కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీకి చంద్రబాబు టచ్ లోకి వెళ్లినట్లు జగన్మోహన్ రెడ్డి అనుమానం వ్యక్తం చేశారు. అయితే రాజకీయాల్లో ఏదైనా సాధ్యమే. ఓట్ల చోరీ విషయంలో రాహుల్ గాంధీ గట్టిగానే పోరాడుతున్నారు. అధికార యాత్ర చేపట్టి ప్రజలతో మమేకం అవుతున్నారు. ఒకవేళ ప్రతిపక్షాలు గట్టిగా ప్రయత్నిస్తే బిజెపి పతనం ఖాయం. అయితే అక్టోబర్లో బీహార్ ఎన్నికల ఫలితాల్లో తేడా కొడితే మాత్రం.. ఏపీ రాజకీయాల్లో పెను మార్పులు చోటు చేసుకునే అవకాశం ఉంది. చూడాలి ఏం జరుగుతుందో...

**చంద్రబాబులో పునరాలోచన..**

ఒకవేళ బీహార్లో ఎన్డీఏ కూటమి ఓడిపోతే.. నితీష్ కుమార్ వల్లేనని బిజెపి తప్పుకునే అవకాశం ఉంది. అదే జరిగితే నితీష్ కుమార్ బిజెపిని వీడటం ఖాయం. దాంతో చంద్రబాబు సైతం ఆలోచనలో పడతారు. బిజెపికి ప్రతికూల ఫలితాలు వస్తే మాత్రం ఎన్డీఏ విషయంలో ఒకటికి రెండుసార్లు ఆలోచన చేస్తారు. అయితే ఎన్డీఏకు మాత్రం గుడ్ బై చెప్పే ఛాన్స్ లేదు. అయితే ఈ పరిస్థితిని గమనిస్తోంది వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ. అందుకే ఉపరాష్ట్రపతి ఎన్నికల్లో బిజెపి మద్దతు కోరిన వెంటనే జై కొట్టింది. బిజెపి బలపరిచిన అభ్యర్థికి మద్దతు ప్రకటించింది. భవిష్యత్ రాజకీయాలను దృష్టిలో పెట్టుకుని జగన్మోహన్ రెడ్డి అలా వ్యవహరించి ఉంటారన్న టాక్ వినిపిస్తోంది.

# ప్రాంతీయ పత్రికలకు న్యాయం చేయండి..

- నాన్ ఎం ప్యానెల్మెంట్ వాటికీ కూడా స్టేట్ హెడ్ క్వార్టర్ లో అక్రిడేషన్లు ఇవ్వండి..
- చిన్న పత్రికల మనుగడకు సహకరించండి..
- సమాచార శాఖ మంత్రి కొలుసు పార్థసారథి ని కోరిన ఆంధ్రప్రదేశ్ పత్రికా సంపాదకుల సంఘం నాయకులు
- మరోసారి పూర్తిస్థాయిలో చర్చిస్తాం.. అందరికీ న్యాయం చేస్తాం :: మంత్రి పార్థసారథి



**అమరావతి,ఆగష్టు 21 (వార్తాప్రభ) :** నూతన అక్రిడేషన్ జీవోతో చిన్న పత్రికలకు అన్యాయం జరుగుతుందని స్టేట్ హెడ్ క్వార్టర్ లో ప్రాంతీయ పత్రికలకు ప్రాధాన్యత కల్పించి, నాన్ ఎం ప్యానెల్మెంట్ పత్రికలకు అక్రిడేషన్ లు మంజూరు చేయాలని రాష్ట్ర సమాచార శాఖ మాత్యులు కొలుసు పార్థసారధిని ఆంధ్రప్రదేశ్ పత్రిక సంపాదకుల సంఘం రాష్ట్ర అధ్యక్షులు కే ప్రసాద్ బాబు, ఏపీ జే యు నాయకులు కాకుమాను వేణు వెలగపూడి లోనే సచివాలయంలో పబ్లిసిటీ సెల్ లో కలిసి వినతి పత్రం అందించారు ఈ సందర్భంగా పలు విషయాలను మంత్రి దృష్టికి తీసుకువెళ్లారు.. గత ప్రభుత్వం వల్ల ప్రాంతీయ పత్రికలు పూర్తిగా నిర్వీర్యం అయ్యే పరిస్థితికి వచ్చాయనీ, కూటమి ప్రభుత్వం వచ్చింది.. చిన్న పత్రికల సమస్యలు తీరతాయని అందరూ ఎదురు చూస్తున్న వేళ ప్రాంతీయ పత్రికలకు నిరాశే ఎదురవుతుందనీ వారు ఆవేదన వ్యక్తం చేశారు.ఎన్నో వ్యయప్రయాసలు పడి పత్రికలు నడిపిస్తూ ఇబ్బంది పడుతున్నామనీ, ప్రజలకు ప్రభుత్వానికి మధ్య వారధిగా ఉంటూ ప్రభుత్వం ప్రవేశపెడుతున్న సంక్షేమ పథకాలను ప్రజల్లోకి తీసుకువెళ్తున్నామన్నారు. ఎంతో కష్టం మీద పత్రిక నడుపుతూ కొంతమేర నిరుద్యోగ సమస్యను కూడా తీరుస్తున్నా,తమకు ప్రభుత్వం నుంచి చేయూతనివ్వాలని వారు కోరారు. యాడ్ ఎలాగో ఇవ్వడం లేదనీ, కనీసం అక్రిడిటేషన్లు అయినా పూర్తి స్థాయిలో ఇస్తారని ఆశిస్తున్నామనీ వారు మంత్రిని కోరారు.స్టేట్ హెడ్ క్వార్టర్లో నాన్ ఎంప్యానల్మెంట్ పత్రికలకు అక్రిడిటేషన్లు లేకుండా చేశారనీ,. ఇదే జరిగితే చాలా పత్రికలకు అన్యాయం జరుగుతుందన్నారు. కనీసం సీఆర్డీఏ పరిధిలో ఉన్న వాన్ ఎంప్యానల్మెంట్ పత్రికలకు స్టేట్లో 2౦2 అక్రిడిటేషన్లు ఇప్పించాల్సిందిగా కోరారు అలాగే రాష్ట్రం లోని నాన్ ఎంప్యానల్మెంట్ పత్రికలకు ఉమ్మడి జిల్లాలో కూడా ప్రాధాన్యత కల్పించాలన్నారు. ఎడిషన్ కలిగిన జిల్లాలో నియోజకవర్గానికి ఒకటి చొప్పున అక్రిడిటేషన్లు ఇవ్వాలని వారు మంత్రిని కోరారు.

## జనరల్ నోటీసు

**IN THE COURT OF THE HONORABLE XI ADDITIONAL DISTRICT JUDGE, KRISHNA AT GUDIVADA**

**G.W.O.P. No. 28 /2025**

**(IN THE MATTER OF: A Petition Under Section 25 of the Guardians and Wards Act, 1890, seeking Visitation Rights of the Minor Child, i.e., Kolavanti Beula @ Ishwaraya)**

Between:
Kolavanti Rajasekhar, S/o.Lazarus, Aged 41 years,
Occupation- Supervisor at Sam Acqua, Kanumuru,
Resident of Door No:- 3-95, Kurmapuram Village,
Pamarru Mandal, Krishna District.

...Petitioner

AND

Kolavanti Sowjanya @ Simhadri Sowjanya,
W/o. Kolavanti Rajasekhar (now divorced),
D/o. Simhadri Anjaneyulu, Aged about 27 years,
Occupation-Private Employee,
Resident of Vallurupalem Village,
Thotlavalluru Mandal, Krishna District.

...Respondent

పై నంబరు పిటిషన్లో పిటిషనర్ మరియు రెస్పాండెంట్కు కొలవంటి బ్యూలా అలియాస్ ఐశ్వర్య అనే కుమార్తె కలదు. సదరు కుమార్తె మైనర్ అయ్యి వుండగా, పై నంబరు పిటిషన్లో పిటిషనర్ మైనర్ సందర్శన హక్కుల నిమిత్తం రెస్పాండెంట్పై జి.డబ్ల్యు.ఓ.పి.ను దాఖలు చేయగా, జనరల్ నోటీసు నిమిత్తం 26-08-2025 నాటికి వాయిదా వేయబడినది. కాబట్టి పై నంబరు జి.డబ్ల్యు.ఓ.పి.లో ఎవరికైనా ఏవైనా అభ్యంతరములు ఉన్నచో, సదరు వాయిదా రోజు ఉదయం 10:30 గంటలకు పై కోర్టు ఎదుట స్వయంగా గానీ, న్యాయవాది ద్వారా గానీ హాజరై తమ ఆక్షేపణలు తెలియజేయవలెను. లేనిపక్షములో ఈ పిటిషన్ పరోక్షముగా తీర్మానించబడునని. ఇందుమూలముగా తెలియపరచడమైనది.

**వాయిదా తేదీ : 26-08-2025.**

**ఇట్లు :**
**పులి కేశవబాబు,** B.A., B.L.
**పులి నాగవర్ధనబాబు,** B.A., LL.B., LL.M.
**అడ్వకేట్లు, గుడివాడ**
**Phone No.9885588730**

# ఆదిత్య కళాశాలలో ఘనంగా వ్యవస్థాపక దినోత్సవం




**కాకినాడ,ఆగష్టు 21 (వార్తాప్రభ) :** ఆదిత్య డిగ్రీ ,పీజీ కళాశాలలో వ్యవస్థాపక దినోత్సవం ఘనంగా నిర్వహించినట్లు ఆదిత్య డిగ్రీ,పీజీ కళాశాలల అకడమిక్ డైరెక్టర్ డాక్టర్ బి ఈ వి ఎల్ నాయుడు తెలియజేశారు. ఈ సందర్భంగా డైరెక్టర్ డాక్టర్ బి ఈ వి ఎల్ నాయుడు కళాశాల పూర్వ విద్యార్థులు కొత్త సుధీర్, కపిల్, నిఖిల్ విశిష్ట అతిథులుగా హాజరై విద్యార్థులతో స్ఫూర్తిదాయక అనుభవాలను పంచుకున్నారు.వారు తమ వ్యాపారాల్లో సాధించిన విజయాలను వివరించి,కృషి, నిబద్ధత,నూతన ఆలోచనలతో ముందుకు సాగితే ప్రతి విద్యార్థి గొప్ప స్థాయికి ఎదగగలడని సందేశమిచ్చారు. కొత్త సుధీర్ విశాఖపట్నం, రాజమండ్రి, కాకినాడలో టీమ్ పార్కులు, మినీ స్టూడియోలు నిర్మించి విజయవంతమైన వ్యాపారవేత్తగా స్థిరపడ్డారు. కపిల్ తూర్పుగోదావరి జిల్లాలో అమరాన్ బ్యాటరీ డిస్ట్రిబ్యూటర్‌గా వ్యాపారాన్ని విస్తరించి వందలాది మందికి ఉపాధి కల్పిస్తున్నారు. నిఖిల్ స్థాపించిన పవిత్ర జ్యువెలర్స్ స్థానికంగా మంచి గుర్తింపు సాధించి లాభ దాయకంగా కొనసాగుతోంది. ఈ కార్యక్రమాన్ని నిర్వహించిన కామర్స్ విభాగాన్ని ఆదిత్య విద్యాసంస్థల చైర్మన్ డాక్టర్ నల్లమిల్లి శేషారెడ్డి, కళాశాలల సెక్రటరీ డాక్టర్ నల్లమిల్లి సుగుణారెడ్డి అభినందించారు. ఈ కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపాల్ సత్యనారాయణ, ఇన్చార్జి మూర్తి, కామర్స్ విభాగాధిపతి డా. సయ్యద్ అన్సర్ అలీ, అపర్ణ స్రవంతి, పి. నరసింహ రావు,ఎం. రమణి, ఎస్.గుల్షన్, విద్యార్థులు పాల్గొన్నారు

# ప్రభుత్వ నిబంధనలు పాటించి వినాయక చవితి వేడుకలు నిర్వహించాలి ఎస్సై సత్యనారాయణ



**తిరువూరు,ఆగష్టు 21 (వార్తాప్రభ) :** ఎస్సై సత్యనారాయణ మాట్లాడుతూ వినాయక చవితి పండుగ సందర్భంగా వినాయక మండపాలు ఏర్పాటు చేసుకునే మండల పట్టణ వారు ముందుగా కమిటీ ఏర్పాటు చేసుకోవాలి ప్రభుత్వం వారు విధించిన నిబంధన ప్రకారం నడుచుకోవాలి వినాయక మండపాల వద్ద తప్పనిసరిగా సీసీ కెమెరా ఏర్పాటు చేసుకోవాలి 22 23 తారీకు లోపు వినాయక మండపాలు కావలసినటువంటి అనుమతి పత్రాలు తీసుకొని వినాయక మండపాలే ఏర్పాటు చేసుకోవాలి విగ్రహం ఎత్తు ప్రభుత్వం వారు చెప్పిన విధంగా ఐదు అడుగుల ఎత్తు మించరాదు ముఖ్యంగా వినాయక మండపం ఏర్పాటు చేసే స్థలం యజమాని పర్మిషన్ తప్పనిసరిగా తీసుకోవాలి ఇతర మతాలను గౌరవించే విధంగా మండపాలు ఏర్పాటు చేసుకోవాలి వారికి ఎటువంటి అసౌకర్యం కల్పించకూడదు ఊరేగింపులకు డీజే నిషేధం మట్టి విగ్రహాలను పెట్టి పర్యావరణాన్ని కాపాడుకుందాం ఎస్ఐ సత్యనారాయణ

# మత్స్యకారులకు యంత్రాలను పంపిణీ చేసిన టిడిపి నేత గోపు సత్యనారాయణ



**మచిలీపట్నం,ఆగష్టు 21 (వార్తాప్రభ) :** మచిలీపట్నం మండలం పరిధిలో కృష్ణా జిల్లా తెలుగు రైతు అధ్యక్షులు, మార్కెట్ యార్డ్ మాజీ చైర్మన్ గోపు సత్యనారాయణ కానూరు పంచాయితీ లోని సారంగిపాలెం గ్రామంలో బోటు యజమానులకు ట్రాన్స్పాండర్లు ను పంపిణీ చేశారు. సముద్రపు వేట చేయు 40 మంది బోటు యజమానులకు ఒక్కొక దాని విలువ 35000 రూపాయలు. అవంటెల్ కంపెనీ కి చెందిన ట్రాన్స్పాండర్ లను బోటు యజమానులకు అందించారు. ఈ ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మత్స్య కారుల జీవిత భద్రతకు అత్యధిక ప్రాధాన్యతనిస్తూ ఈ కార్యక్రమాన్నీ చేపట్టాము అని అన్నారు. ఈ ట్రాన్స్పాండర్ల అమరిక వల్ల మత్స్య కారులు మరింత ధైర్యంగా సముద్రంలో చేపల వేటకు వెళ్లవచ్చు, సముద్ర ప్రమాదాలు తగ్గుతాయి అని అన్నారు.కూటమి ప్రభుత్వం అధికారం లో రాగానే మత్స్య కారుల సంక్షేమం వారికి మెరుగైన సేవలు అందించటానికి ఈ ప్రభుత్వం కట్టుబడి ఉంటుందని తెలిపారు. ఈ కార్యక్రమం లో పంచాయతీ కార్యదర్శి వెంకటేశ్వరరావు , మత్స్య శాఖ సాయకులు బండి వీరస్వామి, సాగర్ మిత్ర నవ్య బోటు యజమానులు పీత ఏడుకొండలు, పెదసింగు సుబ్రమణ్యం, కొక్కిల్లిగడ్డ గోపాల కృష్ణ, శేరు భార్గవ్, పెదసింగు ఏడుకొండలు తదితరులు పాల్గొన్నారు.

# ప్రతి భారతీయ పౌరుడు దేశ రక్షణ కొరకు పోరాడాలి



**తిరువూరు,ఆగష్టు 21 (వార్తాప్రభ) :** మేజర్ మొండి తోక సుప్రీమకర్ పలువురు ఐపీఎస్ అధికారం కలిసిన మేజర్ పుష్పగుచ్చాన్ని అందజేసిన మేజర్ దానిలో భాగంగా తిరువూరు రెవిన్యూ డివిజన్ ఆర్డిఓ కే మాధురికి మర్యాదపూర్వకంగా ఆమె చాంబర్లో కలిశారు తిరువూరు నియోజవర్గం విస్సన్నపేట మండలంలోని మారుమూల గ్రామమైన రామానగరంలో పుట్టిన సుప్రీమకర్ మొండితోక దేశం మీద మక్కువతో ఆర్మీ రంగాన్ని ఎంచుకున్నారు అందరూ సైనికుల్లా మారి దేశం కోసం, దేశ ప్రజల రక్షణ కోసం పోరాడాలని తల్లి భరతమాత రక్షణ కొరకు ఎందరో సైనికులు ప్రాణాలను లెక్కచేయకుండా దేశ రక్షణ కొరకు వారి ప్రాణాలను దేశ రక్షణలో పోగొట్టుకున్న ప్రతి వీర సైనికుడు తల్లి భరతమాత ముద్దుబిడ్డ వీర మరణం పొందిన వీరా సైనికుల పోరాట స్ఫూర్తి మనమందరం నింపుకొని ప్రతి ఒక్కరూ ఒక సైనికుడు లాగా దేశ రక్షణ కొరకు పోరాడాలి భారతదేశ ఔన్నత్యాన్ని కాపాడుకోవాల్సిన బాధ్యత భారత పౌరులుగా మన మీద ఉందని సూచించిన మేజర్ సుప్రీమకర్

# కాంగ్రెస్ తోనే బీసీల అభివృద్ధి - రాష్ట్ర ఓబీసీ చైర్మన్ శౌంరి నాగరాజు



**విజయవాడ,ఆగష్టు 21 (వార్తాప్రభ) :** విశాఖపట్నం జిల్లా ఓబీసీ కాంగ్రెస్ విస్తృత స్థాయి సమావేశం జిల్లా కాంగ్రెస్ కమిటీ అధ్యక్షులు వర్మ ఆధ్వర్యంలో గురువారం ఘనంగా జరిగింది. ఈ సమావేశంలో అన్ని నియోజకవర్గాల నుండి ఓబీసీ కాంగ్రెస్ చైర్మన్‌లు వైస్ చైర్మన్‌లు మండల చైర్మన్‌లు వైస్ చైర్మన్‌లు సమగ్రంగా పాల్గొని జిల్లా కాంగ్రెస్ బలోపేతానికి కట్టుబడి పనిచేస్తున్నారని వెల్లడించారు. ఇంకా కొన్ని నియోజకవర్గాల్లో కమిటీలు లేని కారణంగా రాబోయే రోజుల్లో వాటిని పూర్తి చేసి జిల్లా అధ్యక్షులు వర్మ ఆధ్వర్యంలో ఒక భారీ సభ ఏర్పాటు చేయాలని నిర్ణయించారు. ఈ సందర్భంగా రాష్ట్ర ఓబీసీ కాంగ్రెస్ చైర్మన్ పెదన నియోజకవర్గం కాంగ్రెస్ ఇంచార్జ్ శౌంరి నాగరాజు మాట్లాడుతూ ప్రస్తుత కూటమి ప్రభుత్వం బీసీలను కేవలం ఓటు బ్యాంకులుగా మాత్రమే వాడుకుంటూ వారికి ఇచ్చిన హామీలను నిర్లక్ష్యం చేస్తూ వస్తోందని తీవ్రంగా విమర్శించారు. బీసీలకు ఇచ్చిన హామీలు నెరవేర్చకుండా ప్రజలను మోసపూరిత విధానాలతో మభ్యపెడితే జిల్లా ఓబీసీ కాంగ్రెస్ నాయకులు ధర్నాలు, ఆందోళనలు చేపట్టక తప్పదని హెచ్చరించారు. బీసీ వర్గాలను కేవలం ఓటు బ్యాంక్‌లా వాడుకోవడం పాత పద్ధతి, బీసీల అభివృద్ధి కోసం కాంగ్రెస్ పార్టీ మాత్రమే నిజమైన కృషి చేసింది. వైఎస్ షర్మిల నాయకత్వంలో ఆంధ్రప్రదేశ్ కాంగ్రెస్ పార్టీ పునరుద్ధరణ దిశగా ముందుకు వెళ్తోంది. రాబోయే స్థానిక ఎన్నికల్లో ఓబీసీ కాంగ్రెస్ శక్తివంతంగా ప్రదర్శన చేసి పార్టీ పునరుద్ధరణకు అడ్డుగోడలా నిలుస్తుంది అని అన్నారు. అలాగే విశాఖ జిల్లా ఓబీసీ కాంగ్రెస్ నాయకులు రాబోయే రోజుల్లో కాంగ్రెస్ పార్టీ పూర్వ వైభవాన్ని తిరిగి తీసుకురావడానికి కృషి చేయాలని స్థానిక ఎన్నికల్లో కాంగ్రెస్ శక్తివంతమైన ప్రదర్శన ఇస్తుందని స్పష్టం చేశారు. ఈ సమావేశాన్ని విజయవంతం చేసిన విశాఖపట్నం డీసీసీ అధ్యక్షులు వర్మ వెంకట సూర్యనారాయ కి ధన్యవాదాలు తెలియచేశారు కార్యక్రమంలో పాల్గొన్న వాళ్లు రాష్ట్ర ఎస్ టి డిపార్ట్మెంట్ ఇంచార్జి పాచిపెంట శాంతకుమారి విజయనగరం జిల్లా ఓబీసీ కాంగ్రెస్ చైర్మన్ వెంకట రమణ అల్లూరి జిల్లా ప్రవీణ్ మాజీ హ్యూమన్ రైట్స్ చైర్మన్ గుడివాడ ఇంచార్జి మన్యం రాజశేఖర్ అలాగే నాలుగు జిల్లాల నుండి హాజరైన ఓబీసీ కాంగ్రెస్ నాయకులు కోఆర్డినేటర్లకు ప్రత్యేక ధన్యవాదాలు తెలియజేశారు.

# మనస్తాపంతో పార్టీ పదవికి రాజీనామా..



**కాకినాడ,ఆగష్టు 21 (వార్తాప్రభ) :** తెలుగుదేశం పార్టీ కాకినాడ రూరల్ నియోజకవర్గ సహ సమన్వయ కర్త( కో ఆర్డినేటర్ పిల్లి) సత్యనారాయణ మూర్తి పార్టీ పదవికి రాజీనామా చేసినట్లు ప్రకటించి ఫ్యాక్స్ ద్వారా పార్టీ అధిష్టానానికి లేఖ పంపించారు. వలసపాకల గ్రామంలో పిల్లి అనంతలక్ష్మి సత్యనారాయణ మూర్తి నివాసం వద్ద గురువారం మీడియా సమావేశం ఏర్పాటు చేశారు. అయితే ఉదయం నుండి పిల్లి సత్యనారాయణ మూర్తి అందుబాటులో లేకపోవటంతో పిఠాపురం టిడిపి ఎస్.వి.ఎస్. ఎన్ వర్మ పిల్లి సత్యనారాయణ నివాసానికి చేరుకున్నారు.ఆయన మాట్లాడుతూ రూరల్ నియోజకవర్గానికి కో ఆర్డినేటర్ గా తనను నియమించి 14 నెలలు అయిందనీ,పార్టీ కార్యకర్త లకు చిన్న చిన్న విషయాల్లో కూడా ఏమి చేయలేకపోతున్నానని ఆవేదన వ్యక్తంచేశారు. మనస్తాపంతో పార్టీ కో ఆర్డినేటర్ పదవికి రాజీనామా చేశానన్నారు.రాజీనామాపై నాలుగు రోజుల క్రితమే నిర్ణయించుకున్నామన్నారు. గ్రామ స్థాయి నుండి పార్టీ ఇబ్బంది లేకుండా ఉండాలనే ఆలోచనతో గ్రామ స్థాయి నుండి కార్యకర్తల అభీష్టం మేరకు పార్టీ పదవులు నిర్ణయించామన్నారు. బూతు కన్వీనర్ లు, క్లస్టర్ లను నియమించామన్నారు. కొన్ని కారణాలు కారణంగాబుధవారం జరిగిన మండల అధ్యక్ష ఎన్నిక రసా భాసగా మారిందని, దానికి తనను బాధ్యుడిని చేశారని ఆవేదన వ్యక్తం చేశారు.చివరి శ్వాస వరకు పార్టీకే సేవ చేస్తానని అన్నారు.కూటమి పొత్తులో భాగంగా రూరల్ నియోజకవర్గం జనసేనకు కేటాయించటంతో పంతం నానాజీ గెలుపునకు కృషి చేశామన్నారు. కూటమి విజయం సాధించిన తర్వాత ఏ కార్యక్రమం నిర్వహించిన టిడిపి పార్టీకి ప్రాధాన్యత లేకుండా వ్యవహరించటంతో ఈ కో ఆర్డినేటర్ పదవి ఇంకా ఎందుకు అని ప్రశ్నించారు.తెలుగుదేశం పార్టీకి రాజినామా చేయలేదని,కేవలం పార్టీ పదవికి రాజీనామా చేశానన్నారు. నియోజకవర్గానికి రావాల్సిన 50 పర్సెంట్ నిధులు, పదవులు టిడిపి పార్టీ వర్గీయులకు రావాలన్నారు. గ్రామ స్థాయి నుండి పార్టీ బలోపేతానికి ప్రాధాన్యత కల్పించామన్నారు. మండల అధ్యక్ష పదవికి జరిగిన 25 గ్రామ అధ్యక్షులు, కార్యదర్శులతో సమావేశం ఏర్పాటు చేస్తే, సీల్డ్ కవర్ లో ప్రకటిస్తామని చెప్పటం విడ్డూరంగా ఉందన్నారు. క్రియాశీలక పార్టీ కార్యకర్తగా కొనసాగుతానన్నారు.పార్టీ ఏ కార్యక్రమం నిర్వహించమన్నా అందుబాటులో ఉంటానన్నారు. ఒక చిన్న కుటుంబంలో పుట్టి ఇంతటి స్థానానికి అవకాశం కల్పించిన పార్టీకి ఎప్పుడూ కట్టుబడి ఉంటానన్నారు. శెట్టి బలిజ కార్పొరేషన్ చైర్మన్ కుడిపూడి సత్తిబాబును నియోజక అబ్జర్వేర్ కో కో ఆర్డినేటర్ కటకంశెట్టి బాబీ ఏకమై తనపై కుట్రలు చేస్తున్నారని ఆగ్రహం వ్యక్తంచేశారు. పార్టీ కోసం రాత్రి పగలు పని చేస్తే కనీసం కార్యకర్తల కోసం చిన్న పని కూడా చేయలేని పరిస్తితి నెలకొందన్నారు.కూటమి ప్రభుత్వం లో మా పార్టీ భాగం మాకు కేటాయించాలని డిమాండ్ చేశారు.ఇటీవల ఎమ్మెల్సీ ఎనికల్లో విజయానికి కీలక పాత్ర పోషించామన్నారు.ప్రభుత్వ కార్యక్రమాల్లో తమకు ప్రాధాన్యత ఇవ్వటం లేదన్నారు.పిఠాపురం మాజీఎమ్మెల్యే వర్మ మాట్లాడుతూ ఎన్నికల ముందు చంద్రబాబు నాయుడుతో పిల్లి అనంతలక్ష్మి సత్యనారాయణ మూర్తి దంపతులు ఒక్కటే చెప్పారు మేము పార్టీకి ఎప్పుడూ ద్రోహం చేయలేదని, కూటమి అభ్యర్థి విజయానికి కృషి చేశారన్నారు.కూటమి అన్నాక చిన్న చిన్న సమస్యలు వస్తాయి. కొంత మంది ఆత్మాభిమానం చంపుకోలేక ఇబ్బంది పడతారన్నారు.చంద్రబాబు నాయుడు ఆదేశాలతో ఇక్కడకు వచ్చానన్నారు.రాష్ట్ర పార్టీ పెద్దలు అందరూ సత్యనారాయణ మూర్తితో మాట్లాడారన్నారు.ఇబ్బందులు ఉన్న మాట వాస్తవం..నాయకుడు మాటపై కార్యకర్తలు కట్టుబడి ఉన్నారన్నారు. మండల అధ్యక్ష పదవికి రాష్ట్ర కమిటీ నుండి పెద్దలు వచ్చి నిర్వహిస్తారని తెలిపారు.కార్యకర్తలు మనోభావాలకు అనుగుణంగా నిర్ణయం ఉంటుందన్నారు. వచ్చే వారం చంద్రబాబుతో సమావేశం ఉంటుందని తెలియజేశారు. పార్టీకి రావాల్సిన ప్రాధాన్యత పార్టీకి వచ్చే విధముగా నిరయం ఉంటుందన్నారు

# మహిళలు ఆర్థికంగా స్వయం సమృద్ధి సాధించాలి

● దేశాభివృద్ధిలో మహిళల పాత్ర కీలకం ● వృత్తి నైపుణ్య శిక్షణ పూర్తి చేసుకున్న మహిళలకు సర్టిఫికెట్లు అందజేసిన సత్యం వాసంశెట్టి ఫౌండేషన్ చైర్మన్



**రామచంద్రపురం,ఆగష్టు 21 (వార్తాప్రభ) :** మహిళలు ఆర్థికంగా స్వయం సమృద్ధి సాధించాలనే లక్ష్యంతో పలు వృత్తి నైపుణ్య శిక్షణలు ఇస్తున్నామని సత్యం వాసంశెట్టి ఫౌండేషన్ చైర్మన్ వాసంశెట్టి సత్యం పేర్కొన్నారు. మహిళలకు స్వయం ఉపాధి, ఆర్థిక పరిపుష్టి కల్పించే లక్ష్యంతో రామచంద్రపురం వి.ఎస్.ఎం కళాశాలలో నాలుగు రోజులపాటు ఏర్పాటు చేసిన ఉచిత గృహపకరణాల తయారీ శిక్షణ ముగింపు కార్యక్రమంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని శిక్షణ పూర్తి చేసుకున్న మహిళలకు సర్టిఫికెట్లు ప్రధానం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మహిళా సాధికారతే లక్ష్యంగా రామచంద్రపురం నియోజవర్గంలో మంత్రి సుభాష్ గారి ఆలోచనల్లో అడుగులు వేస్తూ మహిళలను పారిశ్రామికవేత్తలుగా చేయాలని కృషి చేస్తున్నామన్నారు. మహిళా సాధికారత కోసం సీఎం చంద్రబాబు నాయుడు వినూత్న పథకాలు అమలు చేస్తున్నారని, ఆయన ఆశయం మేరకు మహిళలకు పలువృత్తి నైపుణ్య శిక్షణ కార్యక్రమాలు ఏర్పాటు చేసి వారి ఉపాధికి ఊతం ఇస్తున్నామన్నారు. ఇప్పటికే కుట్టు మిషన్ల శిక్షణ, బ్యూటీషియన్ కోర్సు, ఎంబ్రాయిడరీ, జ్యూట్ బ్యాగుల తయారీ తదితర వృత్తి నైపుణ్య శిక్షణ ఇచ్చామన్నారు. అపార అనుభవం ఉన్న శిక్షకులను తీసుకొచ్చి కోర్సు అనంతరం సర్టిఫికెట్లు అందజేస్తున్నామన్నారు. గృహ సంబంధ ఉత్పత్తుల తయారీ శిక్షణ తీసుకున్న 35 మంది మహిళలకు వాసంశెట్టి సత్యం, శిక్షణా నిపుణురాలు ప్రియాజైన్ (బెంగుళూరు) చేతుల మీదుగా సర్టిఫికెట్లు అందజేశారు. సేవా కార్యక్రమాలు నిరంతర ప్రక్రియగా కొనసాగిస్తామన్నారు. ఈ సందర్భంగా శిక్షణ తీసుకున్న మహిళలు మాట్లాడుతూ సత్యం వాసంశెట్టి ఫౌండేషన్ ద్వారా సబ్బులు, షాంపూలు లోషన్లు, టూత్ పేస్టులు, లిప్ బామ్ ల తయారీ ఉచిత శిక్షణ తమ జీవనాధారానికి ఉపయుక్తంగా ఉంటుందని మంత్రి సుభాష్ కు, ఫౌండేషన్ చైర్మన్ వాసంశెట్టి సత్యం కు కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో పలువురు కూటమి నాయకులు, మహిళలు పాల్గొన్నారు.

# మరపట్లకు మద్రాస్ యూనివర్సిటీ డాక్టరేట్



**కొవ్వూరు,ఆగష్టు 21 (వార్తాప్రభ) :** ఐ.పంగిడి గ్రామంలో వ్యవసాయక కుటుంబానికి చెందిన తాను మద్రాసు విశ్వవిద్యాలయం నుండి డాక్టరేట్ డిగ్రీ ని పొందానని మరపట్ల రాజు గురువారం విలేకరులకు తెలిపారు. బీహెచ్ ఎస్ ఆర్ అండ్ వి ఎల్ ఎం కళాశాల దేవరపల్లిలో డిగ్రీని, ఆదికవి నన్నయ విశ్వవిద్యాలయంలో ఎంఏ తెలుగు చదివి ప్రథమ శ్రేణిలో ఉత్తీర్ణులై, మద్రాసు క్రైస్తవ కళాశాల పరిశోధన కేంద్రంలో భాషల విభాగంలో నాలుగు సంవత్సరాలు పీహెచ్డీ చేసి,మద్రాసు క్రైస్తవ కళాశాల భాషా విభాగాల అధిపతి ఆచార్య శ్రీపురం యజ్ఞ శేఖర్ గారి పర్యవేక్షణలో ఉభయగోదావరి జిల్లాలలోని చారిత్రాత్మకమైన క్రైస్తవ సంఘాల స్థాపన, పాశ్చాత్యులు నిర్మించిన విద్య,వైద్యాలయాలు, వారిచే ప్రచురించిన సాహిత్యం, సమాజానికి చేసిన సేవలు, తెలుగు సాహిత్యంలో ఉన్న ప్రక్రియల్లో గేయాలు, నాటికలు,నాటకాలు, వచన కవిత్వం,పద్య కవిత్వం, నవలలు, చారిత్రక కావ్యాలు, క్రైస్తవ భక్తుల జీవిత చరిత్రలను ఇతివృత్తాలుగా తీసుకొని "ఉభయ గోదావరి జిల్లాలోని ప్రముఖ క్రైస్తవ సంఘాలు - సాహిత్య సామాజిక సేవలు"అనే శీర్షిక తో సమర్పించిన సిద్ధాంత గ్రంథానికి డాక్టరేట్ లభించిందని, ఈ పరిశోధనలో సాహిత్య పరంగా పలు సూచనలను, సలహాలను అందించి ఆర్థికంగానూ సహకరించిన గురువర్యులు నన్నయ విశ్వవిద్యాలయ తెలుగు శాఖ సహాయాచార్యులు డా.తరపట్ల సత్యనారాయణ గారికి కృతజ్ఞతలను తెలిపారు. మద్రాసు విశ్వవిద్యాలయ తెలుగు శాఖ అధిపతి అయిన ఆచార్య విస్తాలి శంకర రావు గారికి, కందుకూరి వీరేశలింగం ప్రభుత్వ కళాశాల తెలుగు శాఖాధిపతి డాక్టర్ సంజీవరావు గారికి, కన్నడ శాఖ సహాయాచార్యులు డా.ఎ. మునిరాజా గారికి మరపట్ల రాజు ధన్యవాదములను తెలియజేశారు. తనకు డాక్టరేట్ వచ్చిన సందర్భంగా మద్రాసు క్రైస్తవ కళాశాల ప్రిన్సిపల్ డా.పి.విల్సన్ గారు అభినందనలు తెలియజేసినట్లు రాజు తెలిపారు.

# ఆర్ కృష్ణయ్య ఆధ్వర్యంలోని బీసీల సత్యాగ్రహ దీక్షను విజయవంతం చేయండి

-బీసీ ఐక్యవేదిక తెలంగాణ రాష్ట్ర అధ్యక్షులు భేరి రామచందర్ యాదవ్



**హైదరాబాద్,ఆగష్టు 21 (వార్తాప్రభ) :** ఆగస్టు 25వ తేదీన హైదరాబాద్ లోని ఇందిరా పార్క్ వద్ద జాతీయ బీసీ సంఘం అధ్యక్షుడు ఆర్ కృష్ణన్న ఆధ్వర్యంలో చేపడుతున్న బీసీల సత్యాగ్రహ దీక్షను వెనుకబడిన తరగతుల ప్రజలు అత్యధికంగా హాజరై మన హక్కుల సాధన కోసం ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని బీసీ ఐక్యవేదిక అధ్యక్షులు భేరి రామచంద్ర యాదవ్ కోరారు. స్థానిక సంస్థల ఎన్నికల కంటే ముందే రాష్ట్ర ప్రభుత్వం బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు కల్పించాలని అన్నారు. బీసీలను అణగదొక్కే ప్రయత్నం చేస్తే స్థానిక ఎన్నికల్లో తగిన గుణపాఠం చెబుతామని అన్నారు. బీసీలంతా ఐక్యమని ఒక్క గళమై గర్జిస్తే మన హక్కులు మనం సాధించుకోవచ్చని అన్నారు. కావున ఆర్ కృష్ణన్న ఆధ్వర్యంలో నిర్వహించే బీసీల సత్యాగ్రహ దీక్షను విజయవంతం చేయాలని అన్నారు.ఈ కార్యక్రమంలో గ్రేటర్ హైదరాబాద్ జాతీయ బీసీ సంక్షేమ సంఘం ప్రధాన కార్యదర్శి దొంతిబోయిన శ్రీనివాస్ యాదవ్, కార్యదర్శి సర్వేష్ యాదవ్, కృష్ణ గౌడ్, రాజు ముదిరాజ్, నాయి బ్రాహ్మణ సంఘం రాజేష్, రజక సంఘం కిషోర్, ముదిరాజ్ సంఘం రాజు, మరియు బిసి నాయకులు పాల్గొన్నారు.

# ఆచార్య యార్లగడ్డ లక్ష్మీప్రసాద్‌కు అమెరికాలో అరుదైన గౌరవం



**అమరావతి,ఆగష్టు 21 (వార్తాప్రభ) :** డాలస్, టెక్సస్: రాజ్యసభ మాజీ సభ్యులు, విశ్వహిందీ పరిషత్ జాతీయ అధ్యక్షులు, కేంద్ర సాహిత్య అకాడమీ పురస్కార గ్రహీత, పద్మశ్రీ, పద్మభూషణ్ పురస్కారాల గ్రహీత, ఆచార్య యార్లగడ్డ లక్ష్మీప్రసాద్‌కు టెక్సాస్ రాష్ట్రంలో అరుదైన గౌరవం లభించింది. టెక్సస్ రాష్ట్ర ప్రభుత్వంతో సహా, డాలస్ పరిసర ప్రాంతంలోని మూడు ముఖ్య నగరాలైన ఫ్రిస్కో, గార్లండ్, లిటిల్ ఎల్మ్ నగరాల మేయర్లనుండి యార్లగడ్డ లక్ష్మీప్రసాద్ అభినందన పూర్వక అధికారిక గుర్తింపు పత్రాలు పొందడం తెలుగువారం దరికి గర్వకారణంగా నిలిచింది. గార్లాండ్ నగర మేయర్ డిలన్ హెడ్రిక్ తో జరిగిన ప్రత్యేక సమావేశంలో డా. యార్లగడ్డకు అధికారిక గుర్తింపు పత్రాన్ని మేయర్ స్వయంగా అందచేసి అభినందిం చారు. సాహిత్య రంగంలోనే గాక, సాంస్కృతిక రాయబారిగా, రచయితగా, ఉత్తర, దక్షిణ ప్రాంతాల భారతదేశ వారధిగా తన రచనలతో సౌభ్రాతృత్వం, జాతీయ ఐక్యతను పెంపొందించినదుకుగాను టెక్సాస్ రాష్ట్ర ప్రభుత్వంతో సహా టెక్సాస్ రాష్ట్రంలోని లిటిల్ ఎల్మ్, గార్లాండ్, ఫ్రిస్కో నగరాలు ఆయన్ను అభినందిస్తూ లేఖలు విడుదల చేశాయి. ఫ్రిస్కోలో స్థానిక తెలుగు వారు ఏర్పాటు చేసిన ఆత్మీయ సమావేశంలో ఆయా నగరాల అధికార ప్రతినిధులు ఆచార్య యార్లగడ్డకు అందజేశారు. ఈ సందర్భంగా స్థానిక ప్రవాసాంధ్రులు డా. యార్లగడ్డ ను ఘనంగా సత్కరించారు. టెక్సాస్ రాష్ట్ర గవర్నర్‌కు, ప్రభుత్వానికి, ప్రజలకు, ఆయా నగరాల మేయర్లకు, ప్రజలకు లక్ష్మీప్రసాద్ కృతజ్ఞతలు తెలియజేశారు. ఈ సన్మాన కార్యక్రమంలో వేణు భాగ్యనగర్, ఆత్మచరణ్ రెడ్డి, గోపాల్ పోనంగి, డా. తోటకూర ప్రసాద్, జొన్నలగడ్డ సుబ్రహ్మణ్యం, శారద సింగిరెడ్డి, అనంత్ మల్లవరపు, సమీర్, చాంద్ పర్వతనేని, సుబ్బారావు పర్వతనేని, లెనిన్ వేముల, ఉదయగిరి రాజేశ్వరి, రమణ్ రెడ్డి క్రిస్టపాటి, మాధవి లోకిరెడ్డి, డా. ఆళ్ల శ్రీనివాసరెడ్డి, డా. తుమ్మల చైతన్య, చినసత్యం వీర్నపు, కాకర్ల విజయమోహన్, అత్తలూరి విజయలక్ష్మి, ఎ. ల్ శివకుమారి, జ్యోతి వనం, మడిశెట్టి గోపాల్ తదితరులు పాల్గొన్నారు.

# కమ్మిలిసూర్యనారాయణ మూర్తి కి జాతీయ ఉత్తమ విశ్వజనని సేవారత్న అవార్డు ప్రధానం



**హనుమాన్ జంక్షన్,ఆగష్టు 21 (వార్తాప్రభ) :** విశ్వజనని ఫౌండేషన్ - నరసరావుపేట చైర్మన్ బొగ్గారపు బ్రహ్మానందం 20.8.2025 సాయంత్రం హైదరాబాద్ లోని పొట్టి శ్రీరాములు యూనివర్సిటీ - నాంపల్లి వేదికగా నిర్వహించిన కార్యక్రమంలో బ్రహ్మానందం సినీ రంగం మరియు స్వచ్ఛందంగా సేవ చేస్తున్న వారిని గుర్తించి అవార్డులు ప్రధానం చేయడం జరిగింది. విభిన్న సేవలు అందజేసి తమదైన ముద్ర వేసుకున్న హనుమాన్ జంక్షన్ కి చెందిన సూర్య మెడికల్ అధినేత కమ్మిలి వీరవెంకట సూర్యనారాయణ మూర్తి కి విశ్వజనని సేవారత్న అవార్డు సినీనటులు కిరణ్ గీత సింగ్, ఊర్వశి, జబర్దస్త్ అప్పారావు మరియు సంస్థ చైర్మన్ బొగ్గరపు బ్రహ్మానందం చేతుల మీదుగా బహూకరించడం జరిగింది.. ఈ సందర్భంగా కమ్మిలి మాట్లాడుతూ ఆకలితో ఉన్న వారికి కాస్త అన్నం, ఆపదలో ఉన్న వారికి చిన్న సాయం, బాధలో ఉన్నవారికి కొంచెం ఓదార్పు ప్రార్థించే పెదవులు కన్న సహాయం చేసే చేతులు మిన్న అని నమ్మి - సమాజ సేవ చేస్తూ... మండలంలో ఏ ఒక్కరికి కష్టం వచ్చినా మేమున్నాం అంటూ ముందుకొచ్చి సహాయమందిస్తూ - విద్య,వైద్యం, జీవనభృతి, క్రీడలు,నిత్యావసరాలు,మౌలిక వసతులు, గృహోపకరణములు, కోవిడ్,వరద బాధితుల సహాయం వంటి సేవా కార్యక్రమాల ద్వారా పేదలకు,బడుగు వర్గాలకు అందించడమే ధ్యేయంగా పలు సేవా కార్యక్రమలు చేశాను. ముఖ్యంగా మిత్రుల ప్రోత్సాహం ,ఆదరణ , కార్యక్రమాలు చేసే భాగం లోమొదట కరోనా సమయం లో దాతలు మరియు స్నేహితుల సహాయం తో 600 మందికి పైగా వ్యాధిగ్రస్తులకు కోవిడ్ కిట్స్ పంపిణీ చేయడమే గాక, సుమారు 2000 మందికి స్నేహితుల సహాయం తో మాస్కులు, శానిటైజర్లు ఉచితం గా పంపిణీ చేసాం అని అన్నారు.ఈ కార్యక్రమంలో సినీ మరియు బుల్లి తెర నటులు నటులు బాలాజీ, అశోక్ కుమార్, రాగిణి, జబర్దస్త్ అప్పారావు, రేడియో జాకి, యాంకర్ వేణు శ్రవణ్, చైర్మన్ బొగ్గారపు బ్రహ్మానందం మరియు సినీ రాజకీయ ప్రముఖులు పాల్గొన్నారు.

# పాఠశాలకు వార్తాపత్రిక ఏర్పాటుకు పూర్వ విద్యార్థి చేయూత



**హనుమాన్ జంక్షన్,ఆగష్టు 21 (వార్తాప్రభ) :** ఏలూరు జిల్లా నూజివీడు మండలం మద్దాయి కుంట జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల నందు ప్రపంచ కవితా దినోత్సవం సందర్భంగా పాఠశాల పూర్వ విద్యార్థి, ఆర్మూర్ గోవింద్ పాఠశాలకు వార్తపత్రిక ఏర్పాటుకు వార్షిక బిల్లు నగదు మొత్తాన్ని ప్రధానోపాధ్యాయులకు అందించారు. ప్రధానోపాధ్యాయులు దారపురెడ్డి భాస్కరరావు మాట్లాడుతూ విద్యార్థుల్లో మాతృభాషా పఠన నైపుణ్యాన్ని పెంపొందించడానికి, రోజు విద్యార్థులు వార్తాపత్రికలు చదవాలని సూచించారు వివిధ కవులు, వారి జీవిత విశేషాలు ఆనాటి రాజులు కవులకు ఇచ్చిన ప్రాధాన్యం ద్వారా భాషాభివృద్ధి జరిగిందని తెలిపారు. అనేక కవితలు ప్రతి మనిషికి మానసిక ఆనందాన్ని కలిగిస్తాయని అటువంటి సమాచారం వార్తాపత్రికలు అందుబాటులో ఉంటుందని విద్యార్థులందరూ తెలుసుకోవాలని భాస్కర్ రావు వివరించారు , తెలుగు ఉపాధ్యాయులు యు శివ నాగరాజు మాట్లాడుతూ తెలుగు భాషలో ప్రముఖ కవులు నన్నయా తిక్కన,ఎర్రన, పోతన, శ్రీనాథుడు, వేమన, శ్రీ శ్రీ, గుర్రం జాషువా వంటి కవులు తెలుగు భాషకు ఎంతో సేవ చేశారని విద్యార్థులు అర్థం చేసుకోవాలని తెలిపారు పాఠశాల ఎస్ఎంసి చైర్మన్ ఎర్రబాల శివరామకృష్ణ, ఉపాధ్యాయులు పాగోలు నాగేంద్ర రావు, బి జాన్సన్ లు పాఠశాలకు వార్తాపత్రిక ఏర్పాటు చేసిన గోవింద్ ను అభినందించారు.

# వయోవృద్ధులను ప్రతి ఒక్కరు గౌరవించాలి



**మల్కాజ్ గిరి ఆగస్టు 21 :(వార్తా ప్రభ ప్రతినిధి):** వయో వృద్ధులను ప్రతి ఒక్కరు గౌరవించాలని సబర్బన్ బస్ అండ్ ట్రైన్ ట్రావెలర్ అసోసియేషన్ ప్రతినిధులు పేర్కొన్నారు. సీనియర్ సిటిజన్స్ డే ను పురస్కరించుకుని గురువారం సబర్బన్ ట్రైన్ అండ్ బస్సు ట్రావెలర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో హనుమాన్ పేటకు చెందిన వయోవృద్ధుడు ఎస్ నరసింహారావును గురువారం హనుమాన్ పేట్ లో ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ వయసు పైబడిన వృద్ధులను జన్మనిచ్చిన తనయు లు జాగ్రత్తగా చూసుకోవాల్సిన అవసరం ఉందన్నారు ఈ కార్యక్రమంలో అసోసియేషన్ ప్రతినిధులు ఏ.వి. స్వామి, నూర్ అహ్మద్, శంకర్ రావు, వనజ కనకదుర్గ తోపాటు సీజన్ కో-ఆపరేటివ్ సొసైటీ బ్రాంచ్ మేనేజర్ పీరాన్ ఉన్నారు.

# చెవుటూరు జెడ్పి హైస్కూల్ లో సైబర్ నేరాలపై అవగాహన



**జి.కొండూరు ఆగస్టు 21 :(వార్తా ప్రభ ప్రతినిధి):**మండల పరిధిలోని చెమటూరు గ్రామం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో గురువారం స్థానిక ఎస్ఐ కె.సతీష్ కుమార్ సైబర్ నేరాలపై విద్యార్థులకు అవగాహన కల్పించారు.చెడు వ్యసనాలకు బానిసలు కాకుండా చదువుపై శ్రద్ధ వహించి ఉన్నత స్థాయికి చేరుకోవాలని విద్యార్థులకు సూచించారు.సైబర్ నేరాలు పట్ల జాగ్రత్త వహించాలని, రోడ్డు భద్రత చర్యలు పాటించాలని, మాదకద్రవ్యాలకు దూరంగా ఉండాలని విద్యార్థులకు అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల హెచ్ఎం కె ఎన్ జె లక్ష్మి, ఉపాధ్యాయుని, ఉపాధ్యాయులు ట్రైనీ ఎస్ఐ లు గౌతమ్ , గౌరీశ్వరి తదితరులు పాల్గొన్నారు.

# గణేష్ ఉత్సవాలలో నియమ నిబంధనలు తప్పనిసరిగా పాటించాలి

**-బంటుమిల్లి ఎస్సై గణేష్ కుమార్...**




**కృత్తివెన్ను ఆగస్టు 21 :(వార్తా ప్రభ ప్రతినిధి)** వినాయక చవితి ఉత్సవాలు నిర్వహించే కమిటీ వారు నియమ నిబంధనలను కచ్చితంగా పాటించాలని బంటుమిల్లి ఎస్ఐ గణేష్ కుమార్ గురువారం పోలీస్ స్టేషన్లో నిర్వహించిన విలేకరుల సమావేశంలో తెలియజేశారు. వినాయక విగ్రహాలను ఏర్పాటు చేసే గ్రామాలలో ముందస్తుగా కమిటీని ఏర్పాటు చేసుకోవాలన్నారు. ఏవైనా అవాంఛనీయ సంఘటనలు జరిగిన నేపథ్యంలో కమిటీ వారిదే బాధ్యత అని గుర్తించాలన్నారు. పబ్లిక్ ప్రదేశాలలో విగ్రహాలు ఏర్పాటు చేసిన పక్షంలో సంబంధిత అధికారుల నుంచి అనుమతి పత్రాలు పొందాలన్నారు. సొంత స్థలాలలో గణేష్ విగ్రహాల ఏర్పాటు చేసిన స్థల యజమాని నుంచి అనుమతి తప్పనిసరి. పోలీస్ స్టేషన్ ద్వారా డీఎస్పీ అనుమతి తీసుకుని మాత్రమే మైక్, సౌండ్ బాక్సులు ఏర్పాటు చేసుకోవాలి, డి జె బాక్సులకు ఎట్టి పరిస్థితుల్లోనూ అనుమతి లేదన్నారు. బలవంతంగా చందాలు వసూలు చేస్తే చట్ట ప్రకారం తగు చర్యలు తీసుకుంటామన్నారు. అగ్ని ప్రమాదాలు జరగకుండా ముందు జాగ్రత్తగా వాటర్ డ్రమ్ములను ఏర్పాటు చేసుకోవాలన్నారు. విగ్రహాల ఎత్తు ఐదు అడుగులు మించకుండా చూడాలన్నారు.ప్రశాంతమైన వాతావరణంలో ఘర్షణలకు అవకాశం ఇవ్వకుండా గణేష్ నవరాత్రులను ప్రజలు విజయవంతంగా భక్తిశ్రద్ధలతో నిర్వహించుకోవాలని ఎస్సై గణేష్ కుమార్ కోరారు.

# గుమ్మడి దుర్రు లో పాము కాటుతో మహిళ మృతి



**పెనుగంచిప్రోలు, ఆగస్టు 21( వార్త ప్రభ)** పెనుగంచిప్రోలు మండలం లోని గుమ్మడి దుర్రు గ్రామానికి చెందిన, రూతమ్మ(44) పాము కాటుతో మృతి చెందారు, గురువారం ఉదయం గ్రామ సమీపంలో ని పొలం లో వరినాటు వేస్తుండగా ఆమెను పాము కాటు వేసింది, వెంటనే ప్రక్కన వున్న వారు 108 అంబులెన్స్ కీ ఫోన్ చేసి ఆమెను నందిగామ ప్రభుత్వ ఆసుపత్రి కీ తరలించగా చికిత్స పొందుతూ మృతి చెందిన వైద్యులు ధ్రు వికరించారు,ఆమె మరణం తో కుటుంబసభ్యులుదుఃఖం లో మునిగి పోయారు.

# మార్వాడీ సమాజంపై రెచ్చగొట్టే చర్యల పై చర్యలు తీసుకోవాలి

## డీజీపీ ని కోరిన తెలంగాణ అగర్వాల్ సమాజ్ అధ్యక్షుడు అనిరుధ్ గుప్తా



**హైదరాబాద్ :ఆగస్టు 21 :(వార్తా ప్రభ ప్రతినిధి)** ఆమన్‌గల్‌లో మార్వాడీ సమాజంపై విద్వేష ప్రసంగాలు, రెచ్చగొట్టే చర్యలకు వ్యతిరేకంగా తక్షణమే జోక్యం చేసుకుని చర్యలు తీసుకోవాలని డీజీపీ కి తెలంగాణ అగర్వాల్ సమాజ్ అధ్యక్షుడు అనిరుధ్ గుప్తా విజ్ఞప్తి చేశారు. రాష్ట్రంలోని అగర్వాల్, మార్వాడీ సమాజానికి ప్రాతినిధ్యం వహిస్తున్న అపెక్స్ బాడీ అయిన అగర్వాల్ సమాజ్ తెలంగాణ తరపున మీకు ఈ లేఖ రాస్తున్నానని పేర్కొన్నారు. ప్రశాంత రాష్ట్రంలో సామాజిక సామరస్యాన్ని, శాంతిభద్రతలను, ఆర్థిక వ్యవస్థను దెబ్బతీసే ఒక తీవ్రమైన ఆందోళనకరమైన విషయాన్ని మీ తక్షణ దృష్టికి తీసుకు వస్తున్నట్టు చెప్పారు. ఈ మేరకు ఆయన ఒక వినతి పత్రాన్ని అందించారు. ఇటీవల తమ సమాజంలోని సభ్యులను లక్ష్యంగా చేసుకుని విద్వేషపూరిత నినాదాలు, బెదిరింపులకు పాల్పడిన కొన్ని తీవ్రమైన సంఘటనలు జరిగాయన్నారు.

**సికింద్రాబాద్ మొండా మార్కెట్ సంఘటన** కొంతమంది వ్యక్తులు మార్కెట్ ప్రాంగణంలో బహిరంగంగా "మార్వాడీ కల్చర్ గో బ్యాక్" అంటూ రెచ్చగొట్టే నినాదాలు చేశారు. ఈ బహిరంగ శత్రుత్వ ప్రదర్శన ఆ ప్రాంతంలోని వ్యాపార వర్గాలు నివాసితులలో భయం, అభద్రతా భావాన్ని సృష్టించింది.

**రంగారెడ్డి జిల్లా ఆమన్‌గల్ సంఘటన** ఇక్కడ కూడా మార్వాడీ సమాజానికి వ్యతిరేకంగా ఇలాంటి విద్వేషపూరిత సంఘటన జరిగినట్లు మా దృష్టికి వచ్చింది. మరింత ఆందోళన కలిగించే విషయం ఏమిటంటే, ఈ సంఘటనల వీడియోలను ఉద్దేశ పూర్వకంగా రికార్డ్ చేసి, విద్వేషాన్ని వ్యాప్తి చేయడానికి ప్రతిస్పందనను రేకెత్తించే దురుద్దేశంతో యూట్యూబ్‌తో సహా సోషల్ మీడియా ప్లాట్‌ఫామ్‌లలో వైరల్ చేస్తున్నారు. మార్వాడీ, అగర్వాల్ సమాజం ఒక శతాబ్దానికి పైగా తెలంగాణ సమాజంలో అంతర్భాగంగా ఉంది. మేము బయటి వ్యక్తులం కాదు, రాష్ట్ర పురోగతిలో గర్వించదగిన భాగస్వాములం. మా సమాజం ఎల్లప్పుడూ ఈ క్రింది విషయాలలో ముందంజలో ఉంది.

**ఆర్థిక వృద్ధి** : మేము వ్యవస్థాపకత, వాణిజ్యం, పరిశ్రమల ద్వారా రాష్ట్ర ఆర్థిక వ్యవస్థకు గణనీయంగా దోహదపడుతున్నాము, స్థానిక ప్రజలకు అపారమైన ఉపాధి అవకాశాలను కల్పిస్తున్నాము.

**సామాజిక సంక్షేమం** : మా సమాజానికి దాతృత్వంలో సుదీర్ఘమైన మరియు నమోదు చేయబడిన చరిత్ర ఉంది. మేము ధార్మిక ఆసుపత్రులు, విద్యా సంస్థలు, వృద్ధాశ్రమాలను నడుపుతున్నాము. ప్రకృతి వైపరీత్యాల సమయంలో ఎలాంటి వివక్ష లేకుండా సమాజంలోని అన్ని వర్గాలకు సహాయం అందిస్తున్నాము. ఉద్యోగ కల్పన: చిన్న దుకాణాల నుండి పెద్ద పరిశ్రమల వరకు, మా వ్యాపారాలు వేలాది మంది తెలంగాణ వాసులకు ఉపాధి కల్పిస్తూ, లెక్కలేనన్ని కుటుంబాల జీవనోపాధికి ప్రత్యక్షంగా దోహదపడుతున్నాయి. ఇటువంటి నీచమైన "గో బ్యాక్" ప్రచారాలు కేవలం మా సమాజంపై దాడి మాత్రమే కాదు, తెలంగాణ యొక్క సమ్మిళిత, ప్రగతిశీల స్ఫూర్తిపై ప్రత్యక్ష దాడి. ఇటువంటి శక్తులను శిక్షించకుండా వదిలేస్తే, దేశీయ, అంతర్జాతీయ పెట్టుబడిదారుల సమాజానికి ప్రతికూల సందేశం వెళ్తుంది. ఇది సురక్షితమైన, వ్యాపార అనుకూల గమ్యస్థానంగా రాష్ట్ర ప్రతిష్టను తీవ్రంగా దెబ్బతీస్తుంది, చివరికి ఆర్థిక వృద్ధిని నిలిపివేసి, తెలంగాణ ప్రజల సంక్షేమానికి హాని కలిగిస్తుంది. మీ నాయకత్వంపైన, తెలంగాణ పోలీసుల సామర్థ్యంపైనా తమకు పూర్తి విశ్వాసం ఉందన్నారు. ఈ నిర్దిష్ట సంఘటనలలో పాల్గొన్న వ్యక్తులను గుర్తించి, శత్రుత్వాన్ని ప్రోత్సహించినందుకు, హింసను ప్రేరేపించే కంటెంట్‌ను ప్రచారం చేసినందుకు ఐపీసీ, ఐటీ చట్టంలోని సంబంధిత సెక్షన్ల కింద కఠినమైన చట్టపరమైన చర్యలు తీసుకోవాలని కోరారు. ఇటువంటి రెచ్చగొట్టే వైరల్ కంటెంట్‌ను పర్యవేక్షించి, సోషల్ మీడియా ప్లాట్‌ఫామ్‌ల నుండి తక్షణమే తొలగించడానికి సైబర్ క్రైమ్ విభాగాలకు అవసరమైన ఆదేశాలు జారీ చేయాలన్నారు. ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా నిరోధించడానికి, ముఖ్యమైన వ్యాపార మార్వాడీ జనాభా ఉన్న ప్రాంతాలలో పెట్రోలింగ్‌ను పెంచి, భద్రతా భావాన్ని కల్పించాలని విజ్ఞప్తి చేశారు. మీ సమర్థవంతమైన మార్గదర్శకత్వంలో, చట్టబద్ధమైన పాలన అమలవుతుందని, రాష్ట్రంలోని సామరస్యపూర్వకమైన సామాజిక వాతావరణం రక్షించబడుతుందని విశ్వసిస్తున్నామని అగర్వాల్ సమాజ్ తెలంగాణఅధ్యక్షుడు అనిరుధ్ గుప్తా కోరారు. డీజీపీ ని కలిసిన వారిలో అంజనీ కుమార్ అగర్వాల్, రూపేష్ కుమార్ అగర్వాల్ తదితరులు ఉన్నారు.

# బంజారుల సంస్కృతికి ప్రతీక తీజ్ పండుగ!!

● సంస్కృతిని కాపాడుతూ ప్రకృతిని ఆరాధించే మొలకల పండుగ ● అడవి దేవతలకు తొమ్మిదిరోజులు నిష్టతో పూజలు ● ప్రతి ఏడాది శ్రావణమాసంలో ఉత్సవాల నిర్వహణ ● చిన్న పెద్ద తేడా లేకుండా కలిసి జరుపుకునే తీజ్ ● బామ్లా నాయక్ మాజీ సర్పంచ్ రాజు నాయక్





**పెద్దపల్లి/ పాలకుర్తి: ఆగస్టు 21 (వార్తాప్రభ ప్రతినిధి)**పాలకుర్తి మండలంలోని బామ్లా నాయక్ తండాలో గిరిజనులు తీజ్ పండుగను ఆ గ్రామపంచాయతీ మాజీ సర్పంచ్ రాజు నాయక్ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. గోధుమలను తొమ్మిది రోజులు బుట్టలో నానబెట్టి, బుట్ట వద్ద ప్రతి రోజు సాయంత్రం సంప్రదాయబద్ధంగా పూజలు నిర్వహించి సంతోషంగా నృత్యాలు చేశారు. తొమ్మిదో రోజు పూర్తయ్యే నాటికి మొలకల్లో కొన్నింటిని గిరిజన పెద్దల తలపాగాల్లో వేసి మిగిలినవాటిని సమీపంలోని చెరువులో వదిలారు. అనంతరం బుట్టలను తెచ్చిన యువతుల కాళ్లను వాళ్ల సోదరులు కడిగి ఆశీస్సులు తీసుకున్నారు. ఈ కార్యక్రమానికి బసంత నగర్ స్టేషన్ హౌస్ ఆఫీసర్ స్వామి ముఖ్య అతిథిగా పాల్గొని బంజారా ఆతిథ్యాన్ని స్వీకరించారు. బంజరులు ఎంతో ఉత్సాహంతో ఎస్ఐ స్వామికి తలపాగా చుట్టి మొలకల బుట్టలను నెత్తిపై పెట్టారు. ఈ సందర్భంగా రాజు నాయక్ మాట్లాడుతూ...... సంస్కృతిని కాపాడుతూ ప్రకృతిని ఆరాధించే మొలకల పండుగ జరుపుకోవడం శుభ పరిణామం అని అన్నారు. అడవి దేవతలకు తొమ్మిదిరోజులు నిష్టతో పూజలు చేయడం తమ ఆనవాయితీ అని తెలిపారు. ప్రతి ఏడాది శ్రావణమాసంలో ఉత్సవాల నిర్వహణ ఘనంగా నిర్వహిస్తున్నట్లు ఆనందం వ్యక్తం చేశారు. చిన్న పెద్ద తేడా లేకుండా కలిసి జరుపుకునే తీజ్ పండుగ ఎనలేని ఆనందాన్ని కలిగిస్తున్నదని సంతోషం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో తండా మహిళలు, చిన్నారులు, అధిక సంఖ్యలో గ్రామ ప్రజలు పాల్గొన్నారు.

# గాజుల రామారంలో భారీ కూల్చివేతలు..



**కుత్బుల్లాపూర్ ఆగస్టు 21 (వార్తాప్రభ)** : గాజులరామారం దేవేందర్ నగర్ సర్వే నెంబర్ 307 స్టేట్ ఫైనాన్స్ కార్పొరేషన్ సంస్థకు కేటాయించిన ప్రభుత్వ భూమిలో గురువారం 15 అక్రమ నిర్మాణాలు కూల్చి వేశారు. మండల రెవెన్యూ అధికారులు. 307 ఎస్ ఎఫ్ సి అధికారుల నిర్లక్ష్యంతో గాలి పోచమ్మ బస్తీలో కబ్జాదారులు రెచ్చిపోతున్నారు. స్టేట్ ఫైనాన్స్ కార్పొరేషన్ సంస్థ కు కేటాయించిన ప్రభుత్వ భూమిని ఇంటింటాయ్ దిగమింగుతున్నారు కబ్జా కోరులు. ప్రభుత్వ స్థలం కబ్జా అవడంతో అధికారులకు ఎన్నో ఫిర్యాదులు అందాయి. అయితే గత మంగళవారం కూల్చివేతలకు వెళ్ళిన రెవెన్యూ అధికారులను కబ్జాదారుడు అడ్డుకోవడంతో వారు వెను తిరిగారు. గురువారం పోలీస్ ప్రొటెక్షన్‌తో వెళ్ళి సిఫార్సుల ఫోన్ కాల్స్‌కి తలొగ్గకుండా, తహశీల్దార్ ఆదేశాలతో ఆర్ఐ ఆధ్వర్యంలో జేసిబితో అధికారులు కూల్చి వేశారు.

# సీనియర్ సిటిజెన్స్ కోసం స్టార్ హాస్పిటల్స్ స్టార్ సమ్మాన్ ప్రారంభం




**హైదరాబాద్ : ఆగస్టు 21 :(వార్తా ప్రభ ప్రతినిధి)**ఆగస్టు 21న జరుపుకునే ప్రపంచ సీనియర్ సిటిజెన్స్ డే సందర్భంగా, స్టార్ హాస్పిటల్స్ స్టార్ సమ్మాన్ %-% సీనియర్ సిటిజెన్స్ హెల్త్ ప్రివిలేజెస్ అనే ప్రత్యేక కార్యక్రమాన్ని ప్రకటించింది. ఈ కార్యక్రమం ద్వారా వృద్ధులకు గౌరవప్రదమైన, ఆప్యాయమైన, తక్కువ ఖర్చుతో కూడిన వైద్య సేవలు అందించడంతో పాటు, ముందస్తు జాగ్రత్తలు, ప్రారంభ దశలో వ్యాధులను గుర్తించే అవకాశాలను కల్పించడం లక్ష్యంగా పెట్టుకుంది. ఈ సందర్భంగా స్టార్ హాస్పిటల్స్ గ్రూప్ జాయింట్ మేనేజింగ్ డైరెక్టర్ డా. రమేశ్ గూడపాటి మాట్లాడుతూ మన సంస్కృతిలో మనం ఈరోజు ఉన్న స్థాయికి రావడానికి పెద్దలే కారణం. వారిని గౌరవించడం కేవలం సంప్రదాయం మాత్రమే కాదు, అది మన కర్తవ్యమూ. స్టార్ సమ్మాన్ ద్వారా వృద్ధుల్లో ఆరోగ్య సమస్యలు రాకుండా చూసుకోవడం, అవసరమైతే సమయానికి సరైన చికిత్స అందించడం, అలాగే ప్రత్యేక రాయితీల ద్వారా వారి ఆర్థిక భారం తగ్గించడం మా ఉద్దేశ్యం. వృద్ధుల సంక్షేమం కోసం ఈ కార్యక్రమాన్ని ఎంతో శ్రద్ధతో రూపొందించాం." అన్నారు.స్టార్ హాస్పిటల్స్ గ్రూప్ సీఈఓ డా. రాహుల్ మెడక్కర్ మాట్లాడుతూ స్టార్ హాస్పిటల్స్ ప్రత్యేకత , కుటుంబ విలువల ఆధారంగా పనిచేయడం. మా సీనియర్ సిటిజెన్స్ అనేవారు రోగులు మాత్రమే కాదు, వారు తల్లిదండ్రులు, మార్గదర్శకులు, ప్రేరణల మూలం. స్టార్ సమ్మాన్ ద్వారా ప్రత్యేక హెల్ప్‌డెస్క్, హెల్ప్‌లైన్, రాయితీలు మాత్రమే కాకుండా, వృద్ధులను సలహాదారులుగా మా కమిటీలో భాగస్వాములను చేస్తాం. ఇంటి దగ్గరే చికిత్స కోరుకునేవారికి తక్కువ ఖర్చుతో హోమ్ కేర్ సదుపాయాలు కూడా అందిస్తాం. మా లక్ష్యం %-% వృద్ధులు గౌరవం పొందేలా, ఆప్యాయతతో చూసుకునేలా, ఆసుపత్రి సేవల్లో భాగస్వాములు కావాలన్న భావన కలిగేలా చూడడం." అన్నారు.

# హైదరాబాద్

## గణేష్ పూజ, నిమజ్జనంలో భక్తులు ఇబ్బంది పడకుండా తక్షణమే తగు చర్యలు తీసుకోండి

### గణేష్ ఉత్సవ కమిటీలతో అధికారుల సమావేశం




**శేరిలింగంపల్లి,ఆగస్టు 21 (వార్తాప్రభ):**శేరిలింగంపల్లి జోన్ పరిధిలో గణేష్ ఉత్సవ కమిటీ వారితో మరియు జోనల్ కి సంబంధించిన అధికారులతో మీటింగ్ నిర్వహించారు.ఈ సందర్భంగా జోనల్ కమీషనర్ సహా పలు విభాగాలకు చెందిన అధికారులతో కలిసి గణేష్ ప్రిపరేడెన్స్ మీటింగ్ నిర్వహించి మల్కం చెరువు,గోపి చెరువు,నల్లగండ్ల చెరువు,రాయసముద్రం చెరువు,సాకి చెరువు,గంగారం చెరువు,గౌతమ్ బేబీ పాండ్,కడియం కుంట,దుర్గం చెరువుతోపాటు ప్రధాన,అంతర్గత రహదారులను శుభ్రపరచాలని ఆయా విభాగాల నడుమ ఎటువంటి సమన్వయ లోపం లేకుండా ఉత్సవాలకు ఏర్పాట్లు చేయాలని,ప్రధానంగా పారిశుద్ధ్య నిర్వహణను అత్యంత పకడ్బందీగా చేపట్టాలన్నారు. వినాయక ప్రతిమల నిమజ్జనానికి బేబీ పాండ్లకు సిద్ధం చేయాలని,వాటిల్లో పేరుకుపోయిన వ్యర్థాలను ముందస్తుగా తొలగించి సంసిద్ధం చేయాలని సూచించారు.శోభాయాత్రలు జరిగే ప్రాంతాలలో రహదారులను యుద్ధ ప్రాతిపదికన మరమ్మతులు చేపట్టాలని,పాండ్ల వద్ద విద్యుత్ దీపాలు,సానిటేషన్ సహా అనుబంధ అన్ని ఏర్పాట్లు చేపట్టాలన్నారు.చెరువుల పరిరక్షణకు సెక్యూరిటీ గార్డులను ఏర్పాటు చేయాలని,డెంగ్యూ కేసులు గుర్తించ బడిన ప్రాంతాలలో నివారణ చర్యలు చేపట్టాలని ఎంటమాలజీ విభాగాన్ని ఆదేశించారు.సీఎస్ఆర్ కింద పచ్చదనం,పార్కుల నిర్వహణకు చర్యలు వేగవంతం చేయాలని తెలిపారు.ఈ కార్యక్రమంలో డీసీలు,ఇంజినీరింగ్,పారిశుద్ధ్యం,పట్టణ ప్రణాళిక,ఎంటమాలజీ విభాగాలతో పాటు ఆయా విభాగాల అధికారులు గణేష్ ఉత్సవ కమిటీ కన్వీనర్ మరియు మెంబర్లు ఉన్నారు.

## ఐడియల్ చెరువును సందర్శించిన హైడ్రా కమిషనర్ రంగనాథ్.




**కూకట్ పల్లి, ఆగస్ట్ 21(వార్తాప్రభ):**గణేష్ చతుర్థి సందర్భంగా హైడ్రా కమిషనర్ రంగనాథ్ ఐపీఎస్ గురువారం కూకట్‌పల్లి నల్లచెరువు పరిశీలన అనంతరం ఐడీఎల్ చెరువును సందర్శించి,సంబంధిత పనులను వేగవంతం చేయాలని జీహెచ్ఎంసీ, నీటిపారుదల,విద్యుత్ శాఖలకు సూచనలు ఇచ్చారు.ఈ కార్యక్రమంలో ఏసీపి రవి కిరణ్ రెడ్డి,సీఐ.సుబ్బారావు,ట్రాఫిక్ సిఐ ముత్తు యాదవ్,అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## జన్మదిన వేడుకల్లో పాల్గొన్న కొలన్ హనుమంత్ రెడ్డి



**కుత్బుల్లాపూర్ ఆగస్టు 21 (వార్తాప్రభ) :** కుత్బుల్లాపూర్ నియోజకవర్గం 130 డివిజన్ సీనియర్ కాంగ్రెస్ నాయకులు గోగికర్ కరణ్ కుమార్తె పుట్టిన రోజు సందర్భంగా గురువారం కట్టమైసమ్మ పరిధిలో నిర్వహించిన జన్మదిన వేడుకలో కుత్బుల్లాపూర్ నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జి కొలన్ హన్మంత్ రెడ్డి పాల్గొని ఆశీర్వదించారు. ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచ్ మైసిగారి శ్రీనివాస్, డివిజన్ అధ్యక్షులు సోమన్నగారి శ్రీధర్ రెడ్డి, శివ , పండరి, హరి కిరణ్ పటేల్, ద్వారంపూడి నాగి రెడ్డి, సీనియర్ కాంగ్రెస్ నాయకులు సిద్దనోళ్ల సంజీవ రెడ్డి, నర్సింగ్ రావు, తైలం శ్రీనివాస్, శ్యామ్ తదితరులు పాల్గొన్నారు.

## కాంగ్రెస్ పార్టీలో రుద్రవరం సింగిల్ విండో చైర్మన్ చేరిక

**రాజన్న సిరిసిల్ల , ఆగస్ట్ 21:(వార్తాప్రభ)**వేములవాడ అర్బన్ మండలం రుద్రవరం సింగిల్ విండో చైర్మన్ రేగులపాటి కృష్ణదేవరావు గురువారం కాంగ్రెస్ పార్టీలో చేరారు. రాజన్న సిరిసిల్ల జిల్లా కాంగ్రెస్ పార్టీ సమావేశంలో ప్రభుత్వ విప్,వేములవాడ ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్, సిరిసిల్ల నియోజకవర్గ ఇన్చార్జి కేకే మహేందర్‌రెడ్డి సమక్షంలో పార్టీలో చేరారు. ఆయనకు ఆది శ్రీనివాస్ కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. రేగులపాటి కృష్ణదేవరావు. మాట్లాడుతూ గతంలో వేములవాడ ఎమ్మెల్యేలుగా గెలిచినవారు కనీసం చూద్దామంటే కనిపించలేదని, కానీ ప్రస్తుత ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్ ప్రతిక్షణం ప్రజలకు అందుబాటులో ఉండి ప్రజా సంక్షేమం కోసం పాటుపడుతున్నారని అన్నారు.

# ఎడిటోరియల్

## పవన్ మినిస్ట్రీ.. చంద్రబాబు ఆగమేఘాలపై నిర్ణయం!

టీడీపీ అధినేత, ఏపీ సీఎం చంద్రబాబు తాజాగా కీలక నిర్ణయం తీసుకున్నారు. తమ్ముడు తన వాడే అయినా.. ధర్మం పాటించాలన్నట్టుగా.. సొంత పార్టీ ఎమ్మెల్యేనే అయినా.. ఆరోపణలు వచ్చాక ఉపేక్షించరాదన్న సూత్రాన్నే చంద్రబాబు తాజాగా పాటించా రు. శ్రీశైలం ఎమ్మెల్యే బుడ్డా రాజశేఖరరెడ్డి.. స్థానిక అటవీ సిబ్బందిపై దాడి చేసినట్టు ఆరోపణలు రావడం, ద్వితీయ శ్రేణి అటవీ అధికారి ఒకరు నేరుగా మీడియా ముందుకు వచ్చి ఎమ్మెల్యే వ్యవహారాన్ని వివరించడంతో సీఎం చంద్రబాబు హుటాహుటిన స్పందించారు. తన పార్టీనేతే అయినా.. ఉపేక్షించకుండా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. కేసు కూడా నమోదు చేయాలని పోలీసులకు గ్రీన్ సిగ్నల్ ఇచ్చారు.సాధారణంగా ఇటీవల కాలంలో టీడీపీ ఎమ్మెల్యేల తీరుపై విమర్శలు వస్తున్నాయి. ఒక్కొక్కరు ఒక్కొక్క టైపులో వివాదాలకు సెంటర్లుగా మారుతున్నారు. అయితే.. వారి విషయంలో చంద్రబాబు ఇంత స్పీడుగా రియాక్ట్ కాలేదు. సాధారణంగా ఎప్పుడూ చేసే హెచ్చరికలు, ఎప్పుడూ ఇచ్చే వార్నింగులే ఇచ్చారు. కానీ, శ్రీశైలం ఎమ్మెల్యే బుడ్డా రాజశేఖర్‌రెడ్డి విషయానికి వస్తే.. మా త్రం విభిన్నంగా రియాక్ట్ అయ్యారు. కేసు నమోదు చేయాలని.. పోలీసులను ఆదేశించడంతోపాటు.. పార్టీ రాష్ట్ర చీఫ్ పల్లా శ్రీనివా సరావు సహా.. జిల్లా స్థాయి నాయకత్వాన్ని నివేదికలు ఇవ్వాలని ఆదేశించారు. పార్టీకి నష్టం కలిగించే పనులు, ప్రభుత్వానికి మచ్చకలిగించే వ్యవహారాలు చేస్తే ఊరుకునేది లేదన్నారు.అయితే.. చంద్రబాబు ఇంత వేగంగా స్పందించడం వెనుక.. వేరే కారణం కూడా ఉందని పరిశీలకులు చెబుతున్నారు. ప్రస్తుతం అటవీ శాఖ మంత్రిగా ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ వ్యవహరిస్తున్నారు. ఈ నేపథ్యంలో ఆయన శాఖకు చెందిన ఉద్యోగులపై టీడీపీ ఎమ్మెల్యే దాడి చేయడాన్ని చంద్రబాబు సీరియస్‌గా తీసుకున్నారు. ఈ విషయంలో తాను ఉపేక్షిస్తే.. రాజకీయంగా ఇది వివాదంగా మారే అవకాశం ఉందని అంచనా వేసుకున్నారు. అదే జరిగితే.. పవన్ కల్యాణ్ సమాధానం చెప్పాల్సి వచ్చే ఛాన్స్ ఉంది. ఈ నేపథ్యంలో తానే నేరుగా జోక్యం చేసుకుంటే సమస్య వెంటనే పరిష్కారం అవుతుందన్న భావనతోనే చంద్రబాబు ఇంత స్పీడ్‌గా రియాక్టరయ్యాన్న వాదన వినిపిస్తోంది. ఇలా చేయడం ద్వారా కూటమి మిత్రపక్షాల నాయకుల్లోనూ భరోసానింపినట్టు అవుతుందని కూడా చంద్రబాబు భావించి ఉంటారని పరిశీలకులు చెబుతున్నారు. ఏదేమైనా.. ప్రస్తుతం నెలకొన్న పరిస్థితిలో.. వరుస వివాదాలు తెరమీదికి వస్తున్న క్రమంలో చంద్రబాబు తీసుకున్న నిర్ణయం.. సొంత ఎమ్మెల్యేనే అయినా.. కేసుకు ఆమోదించడం వంటివి మంచి పరిణామాలని భావిస్తున్నారు.

## స్వచ్ఛభారత్ ను సంపూర్ణంగా అమలు చేయాలి

**ఎన్టీఆర్ జిల్లా బిజేపీ అధ్యక్షుడు అడ్డూరి శ్రీరామ్**

**ఎమ్మెల్యే కార్యాలయ కార్యదర్శి ప్రత్తిపాటి శ్రీధర్**



**విజయవాడ పశ్చిమ ఆగస్టు 21 :(వార్తా ప్రభ ప్రతినిధి)**పశ్చిమ నియోజకవర్గం , సంపూర్ణ పారిశుధ్యం , స్వచ్ఛత దిశగా పయనించాలని అందుకు అనుగుణంగా ఎమ్మెల్యే సుజనా చౌదరి కృషి చేస్తున్నారని ఎన్టీఆర్ జిల్లా బీజేపీ అధ్యక్షుడు అడ్డూరి శ్రీరామ్, కార్యాలయ కార్యదర్శి ప్రత్తిపాటి శ్రీధర్ అన్నారు . గురువారం భవానిపురం ఎన్డీఏ కార్యాలయంలో ఎఎం హెచ్ ఓ అన్నపూర్ణ, 22 డివిజన్ల శానిటరీ ఇన్స్పెక్టర్లు, శానిటరీ సూపర్ వైజర్లు, సుజనా మిత్రా కోఆర్డినేటర్ల తో సమావేశం నిర్వహించారు..ఈ సందర్భంగా అడ్డూరి శ్రీరామ్ మాట్లాడుతూప్రధాని నరేంద్ర మోడీ స్వచ్ఛ భారతదేశం కోసం పిలుపునిచ్చిన తర్వాత బహిరంగ మలమూత్ర విసర్జన సమస్య దాదాపు పరిష్కారమైందన్నారు. నేటి ఆధునిక యుగంలో అన్ని వర్గాల ప్రజలకు స్వచ్ఛభారత్ పై అవగాహన కలిగి ఉన్నారన్నారు స్వచ్ఛభారత్ ను అమలు చేయాలని సంపూర్ణ పారిశుధ్యంతో ,స్వచ్ఛత దిశగా పయనించేలా ఎమ్మెల్యే సుజనా చౌదరి కృషి చేస్తున్నారని తెలిపారు. స్వచ్ఛ ఆంధ్ర కార్పొరేషన్ సహకారంతో పశ్చిమ లో పబ్లిక్ కు అవసరమైన చోట మరుగుదొడ్లను ఏర్పాటు చేయాలని ఎమ్మెల్యే సుజనా చౌదరి నిర్ణయించారన్నారు శానిటరీ ఇన్స్పెక్టర్లు, సుజనా మిత్రా కోఆర్డినేటర్ల సహకారం తో ప్రజలకు అవసరమైన చోట, అందుబాటులో మరుగుదొడ్లను ఏర్పాటు చేసేలా చర్యలు తీసుకుంటున్నామన్నారు.స్వచ్ఛతతో పాటు అవినీతిరహిత, పారదర్శక పాలన అందిస్తూ సమస్యలు లేని నియోజకవర్గంగా తీర్చిదిద్దడానికి ఎమ్మెల్యే సుజనా చౌదరి కృషి చేస్తున్నారని అడ్డూరి శ్రీరామ్ తెలిపారు.

## దృఢ సంకల్పముండాలి!




ఉంటే దృఢ సంకల్పము
అనుకున్నవన్ని సఫలము
నిరంతర సాధనతో
ఇక ఏదైనా సాధ్యము
మనసే అతి కీలకము
దృష్టి సారిస్తే సులభము
చేస్తున్న పనియందున
పెట్టుకోవాలి నియమము
పగటి కలలు కనరాదు
కష్టిస్తేనే ఫలితము
ఏది వృధా చేయరాదు
కావాలోయ్! ఉపయోగము
దేవునిపై భారము వేసి
ఉండాలి నిశ్చింతగా
సతతంబు దీక్ష పూని
సాధించాలి ఘనంగా

**గద్వాల సోమన్న,**
9966414580

# గుంటూరులో కిమ్స్ కడల్స్ సేవలు

● **మాతా శిశు సంరక్షణకు మరింత మెరుగైన సేవలు** ● **పీడియాట్రిక్ సూపర్ స్పెషాలిటీ సేవల అందుబాటు** ● **అత్యాధునిక అంబులెన్స్ సేవలు** ● **ప్రారంభించిన గుంటూరు వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ విజయలక్ష్మి (డి ఎమ్ హెచ్ ఓ)**



**గుంటూరు టౌన్ ఆగస్టు 21,(వార్తా ప్రభ ప్రతినిధి)** ఇన్నాళ్లూ హైదరాబాద్ లాంటి పెద్ద పెద్ద నగరాలకు మాత్రమే పరిమితమైన కిమ్స్ కడల్స్ ఆస్పత్రి సేవలు ఇప్పుడు మన గుంటూరు నగరానికి కూడా తరలివచ్చాయి. గుంటూరులోని కిమ్స్ శిఖర ఆస్పత్రిలో కొత్తగా అభివృద్ధి చేసిన మాత శిశువు సూపర్ స్పెషాలిటీ సేవల విభాగం అయిన కిమ్స్ కడల్స్ ఆస్పత్రిలోని అత్యధిక పరికరాలు గల అంబులెన్స్ ని గుంటూరు వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ విజయలక్ష్మి గురువారం ప్రారంభించారు. ఈ సందర్భంగ డాక్టర్ విజయలక్ష్మి మాట్లాడుతూ, "మాతా శిశు సంరక్షణలో ఇది సరికొత్త అధ్యాయం. గుంటూరు ప్రాంతవాసులకు స్త్రీలు మరియు పిల్లల సంరక్షణ విషయంలో అత్యున్నత స్థాయి వైద్యసేవలు అందించడానికి కిమ్స్ కడల్స్ ఆస్పత్రి గుంటూరు వచ్చిందన్నారు. ఇక్కడ నియోనాటల్ ఐసీయూ, పీడియాట్రిక్ కార్డియాలజీ, పీడియాట్రిక్ న్యూరాలజీ, పీడియాట్రిక్ నెఫ్రాలజీ, ప్లాస్టిక్ సర్జరీ, పీడియాట్రిక్ కార్డియోథొరాసిక్ సర్జరీలు కూడా వస్తాయి. ఇలాంటి అత్యాధునిక వైద్యసేవలు కావాలంటే ఇప్పటివరకు హైదరాబాద్, బెంగళూరు లాంటి నగరాలకు వెళ్లాల్సి వచ్చేది. ఇప్పుడు ఇక గుంటూరు లోనే ఇవన్నీ అందుబాటులోకి వస్తాయన్నారు. అత్యాదునిక వైద్య పరికరాలు కూడా ఉండటం వల్ల అన్నిరకాల వైద్య పరీక్షలు ఇక్కడే చేయించుకోవచ్చు. ఎలాంటి సంక్లిష్టమైన ప్రసవాల కేసులైనా ఇక్కడి నిపుణులైన వైద్యులు చూస్తారు" అని చెప్పారు. గుంటూరు లోని కిమ్స్ కడల్స్ ఆస్పత్రిలో 10 మందికి పైగా సీనియర్ వైద్యులు, 100 మందికి పైగా సిబ్బంది రోజుకు 24 గంటలూ ఇక్కడి మాతా శిశు సంరక్షణ విభాగంలోని తల్లులు, పిల్లలను కంటికి రెప్పలా కాపాడుకుంటారు. ఇప్పటికే ఇక్కడ నెలకు దాదాపు 60 నుంచి 70 వరకు ప్రసవాలు జరుగుతుండగా, ఇకపై తల్లులు, చంటిపిల్లల ఆరోగ్యానికి సంబంధించి ఎలాంటి సంక్లిష్టమైన సమస్యలకైన పరిష్కారం దొరుకుతుంది. ఎంఆర్ఐ, సీటీస్కాన్, ఫిజియోథెరపీ, చైల్డ్ డెవలప్‌మెంట్ యూనిట్ (సీడీయూ) లాంటి అత్యాధునిక పరికరాలు, సేవలు ఉంటాయి. అత్యంత క్లిష్టమైన ప్రసవాలు కూడా ఇక్కడ చేస్తారు. కవలలు, ముగ్గురు పిల్లలు ఉన్న కేసులు, తరచు గర్భవిచ్ఛిత్తి అవుతున్న కేసులు, మధుమేహం లేదా కాలేయ సమస్యలు ఉన్న మహిళలకు ప్రసవాలు, ఫైబ్రాయిడ్ల వల్ల ఇబ్బంది అవుతున్నా, రక్తహీనత ఉన్నా, ఒవేరియన్ సిస్టులు ఉన్నా, కిడ్నీ వ్యాధులు ఉన్నా ఐవీఎఫ్ కేసులు, కిడ్నీ మార్పిడి చేయించుకున్న మహిళలకు క్లిష్టమైన ప్రసవాల లాంటివి ఇక్కడ చేస్తారు. అలాగే చంటిపిల్లలకు సంబంధించి నెలలు నిండకముందే పుట్టే పిల్లల సంరక్షణ, గర్భస్థ శిశువులలో లోపాలు, పిల్లలకు సంబంధించి యూరాలజీ శస్త్రచికిత్సలు, అన్నిరకాల లోపాలకు సంబంధించిన చికిత్సలు లభిస్తాయి. ఈ కార్యక్రమంలో సీనియర్ గైనకాలజిస్ట్ డాక్టర్ అనిత, సీనియర్ పీడియాట్రిషన్ డాక్టర్ సాహితీ, పెడియాట్రిక్స్ ఇంటెన్సివిస్ట్ డాక్టర్ పల్నాటి బాల కృష్ణ రెడ్డి,సిఓఓ సుధాకర్, తదితరులు పాల్గొన్నారు.

# జి.కొండూరు పిహెచ్ సి లో కంటింజెంట్ వర్కర్ చిరంజీవి అదృశ్యం

● **పిహెచ్ ఎదుట టెంట్ వేసుకొని నిరసన తెలుపుతున్న కుటుంబ సభ్యులు బంధువులు** ● **యు డి సి వల్లే చిరంజీవి కనిపించకుండా పోయిందని ఆరోపిస్తున్న కుటుంబ సభ్యులు** ● **పోలీస్ స్టేషన్లో ఫిర్యాదు చేసిన మందా చిరంజీవి కుటుంబ సభ్యులు** ● **దర్యాప్తు చేపట్టిన పోలీసులు** ● **ఉదయం నుంచి సాయంత్రం వరకు ఆస్పత్రి వద్ద పోలీసులు పహార**





**జి.కొండూరు:ఆగస్టు 21 :(వార్తా ప్రభ ప్రతినిధి)**ఎన్టీఆర్ జిల్లా,జి.కొండూరు ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో కంటింజెంట్ వర్కర్ గా విధులు నిర్వహిస్తున్న మందా చిరంజీవి గురువారం ఉదయం కనిపించకుండా(అదృశ్యం)పోయింది. బుధవారం రాత్రి 8 గంటలకు డ్యూటీ కి వచ్చిన మందా చిరంజీవి గురువారం ఉదయం 8 గంటలకు ఆమె భర్త మందా యేసు కి ఫోన్ చేసి నాకు అన్యాయం జరిగింది, నన్ను ఎవరు ఎతకొద్దు అని చెప్పి స్విచ్ ఆఫ్ చేసింది.ఈ విషయాన్ని స్వయంగా ఆమె భర్త ఏసు చెప్పడం జరిగింది.విషయం తెలుసుకున్న మందా చిరంజీవి కుటుంబ సభ్యులు, బంధువులు ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ఎదుట టెంట్ వేసుకొని ఆందోళనకు వీరి ఆందోళన గురువారం రాత్రి వరకు సాగింది. ఎస్ ఐసతీష్ కుమార్ పి హెచ్ సి కి వచ్చి నిరసన తెలుపుతున్న వారికి సర్దిచెప్పారు.అయితే చిరంజీవి కుటుంబ సభ్యులు బాధితులు యుడిసి వల్లే మా అమ్మ ఎటు వెళ్లిపోయిందని కుమార్తెలు, బంధువులు ఆరోపిస్తున్నారు.నెలలు తరబడి జీతం ఇవ్వకుండా తన భార్యను ఇబ్బంది పెట్టే వారిని భర్త యేసు వాపోయాడు. నా భార్య కనిపించడం లేదని తెలిసి ముందుగానే ఆసుపత్రి వైద్యులు పోలీసులకు ఫోన్ చేసి రక్షణ కోరారని, వెంటనే పోలీసులు నాకు ఫోన్ చేసి నా దగ్గరకు రావడం జరిగిందన్నారు. తన భార్య కోసం కుటుంబ సభ్యులు బంధువులతో కలిసి వెతికామని అయినా ఎక్కడా కనిపించలేదు ఏసు తెలిపాడు.దీంతో పోలీస్ స్టేషన్లో నా భార్య చిరంజీవి కనిపించడం లేదని ఫిర్యాదు చేశామ న్నారు. మరోవైపు ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారి ప్రసన్న రాణి మా తప్పు ఏమీ లేదని, ఏం జరిగిందో కూడా మాకు తెలియదు అన్నారు. చిరంజీవికి ఇవ్వాల్సిన జీతం కూడా పెండింగ్ లేదని తెలిపారు.అయితే పూర్తి వివరాలు ఇంకా తెలియాల్సి ఉంది

# మహిళల హక్కుల కోసం పలు చట్టాలు.

***మచిలీపట్నం బార్ అసోసియేషన్ మాజీ అధ్యక్షులు లంకిశెట్టి బాలాజీ.***



**మచిలీపట్నం ఆగస్టు 21 :(వార్తా ప్రభ ప్రతినిధి)** మచిలీపట్నం లేడీ యాంప్తుల్ ప్రభుత్వ బాలికల ప్రభుత్వ కళాశాలలో మచిలీపట్నం కమ్యూనికేషన్ ప్రైవేట్ లిమిటెడ్ తరఫున 50 వేల రూపాయలు ఖరీదు చేసే స్టూడెంట్స్ గుర్తింపు కార్డులను సంస్థ మేనేజింగ్ డైరెక్టర్ కొల్లు జ్ఞాన సాయి గురువారం అందజేశారు. ఈ సందర్భంగా జ్ఞాన సాయి మాట్లాడుతూ కళాశాల మేనేజ్మెంట్ కమిటీ కార్యదర్శిగా కొల్లు శ్రీనివాసరావు గత పది సంవత్సరాలుగా అనేక రకాలుగా విద్యార్థులకు ప్రోత్సాహంగా బహుమతులు అందజేస్తూ గత ఐదు సంవత్సరాలుగా గుర్తింపు కార్డులు ఇవ్వడం జరుగుతుందని తెలియజేశారు ఆడపిల్లలు బాగా చదివి ఎదగాలని జ్ఞాన సాయి అన్నారు ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా విచ్చేసిన లంకిశెట్టి బాలాజీ మాట్లాడుతూ మహిళల హక్కుల పరిరక్షణ కోసం వాళ్ళు చట్టాలు ఉన్నాయని ఆడపిల్లలు ఆత్మస్థైర్యంతో ముందుకు వెళ్లాలని అన్నారు 18 సంవత్సరాలు లోపు ఆడపిల్లలపై ఏ విధమైన వేధింపులు పాడిచేసిన మోక్ష చట్టం కఠినంగా పనిచేస్తుందని అందులో జీవిత ఖైదు వరకు శిక్షలు ఉన్నాయని తెలియజేశారు జిల్లా జడ్జి స్థాయి గల ప్రత్యేక న్యాయమూర్తి ప్రత్యేక పబ్లిక్ ప్రాసిక్యూటర్ మోక్ష కోతులు విచారణ చేస్తున్నారని తెలియజేశారు ఆడపిల్లలు సెల్ఫోన్లకు టీవీలకి దూరంగా ఉండాలని చదువుపై దృష్టి కేంద్రీకరించాలని బాలాజీ అన్నారు అపరిచితులతో మాట్లాడడం గాని చాటింగు ఫేస్బుక్లో పరిచయాలు పెంచుకోవడం మంచిది కాదని అన్నారు భారతదేశ అత్యున్నత పదవిలో ఉన్న భారత రాష్ట్రపతి ద్రౌపది ముర్మో కృష్ణా జిల్లా జాయింట్ కలెక్టర్ గీతాంజలి శర్మ ఆదర్శం కావాలని అన్నారు ఆడపిల్లలు ఆత్మవిశ్వాసం కోల్పోకూడదు అని అన్నారు కృష్ణాజిల్లాలో ఏకైక మహిళా బాలికల జూనియర్ కళాశాల గత ఏడాది రాష్ట్రస్థాయిలో రెండవ స్థానంలో ఉందని రాబోయే రోజులలో మొదటి స్థానానికి ఎదగాలని బాలాజీ అన్నారు ఉన్నత విద్యా అర్హతలు కలిగిన అధ్యాపకులు కళాశాలలో పాఠాలు బోధించడం వలన ఎందరో ఉన్నతమైన స్థానానికి దిగారని అన్నారు భారతదేశంలో మేధావులు అందరూ ప్రభుత్వ పాఠశాల నుంచి వచ్చిన వారిని బాలాజీ అన్నారు కళాశాల ప్రిన్సిపాల్ పిఎస్జిఎన్ లక్ష్మి మాట్లాడుతూ లేడంతులు కళాశాలలో 9 కోర్సులలో విద్యను అందిస్తున్నామని ప్రభుత్వపరంగా యూనిఫారంలో మధ్యాహ్న భోజన పథకం టెస్ట్ పుస్తకాలు నోటు పుస్తకాలు ఉచితంగా అందించడం జరుగుతుందని ఎంసెట్ మెటీరియల్ కూడా ఉచితంగా అందిస్తున్నట్లు ఉన్నతమైన విద్యను అందిస్తున్నామని ప్రిన్సిపాల్ లక్ష్మి తెలియజేశారు ఈ కార్యక్రమంలో ఎన్ఎస్ఎస్ అధికారి లంకిశెట్టి అనాధ బాబు అధ్యాపకులు విజయశ్రీ సుందర్ లక్ష్మి కిరణమై సాయి దాసుల్తానా తదితరులు పాల్గొన్నారు.

# ఈ నెల 30 న సంచార జాతుల కోసం భారతీయ జనతా పార్టీ "స్ఫూర్తి" కార్యక్రమం





**విజయవాడ పశ్చిమ ఆగస్టు 21 :(వార్తా ప్రభ ప్రతినిధి)**ఆగస్ట్ 31 సంచార జాతుల విముక్త జాతుల దినోత్సవం పురస్కరించుకుని సంచార "జాతులం సదాచార వారసులం సంస్కృతుల వారధులం" అనే నినాదంతో భారతీయ జనతా పార్టీ ఈ నెల 30 తేదీన విజయవాడ వెన్యూ ఫంక్షన్ హాల్ వద్ద సంచార సమాజాన్ని స్ఫూర్తిప్రధాతలుగా తెలుపుతూ "స్ఫూర్తి" కార్యక్రమాన్ని నిర్వహిస్తుంది. బిజెపి రాష్ట్ర అధ్యక్షులు పి వి ఎన్ మాధవ్ పిలుపుతో రాష్ట్రంలో సంచార కులాల పెద్దలను బిజెపి ఆహ్వానిస్తుంది. జాతీయ నాయకులు కేంద్ర మంత్రులు అతిథులుగా పాల్గొనే ఈ కార్యక్రమం ద్వారా సంచార కులాల వృత్తులు కలలు ప్రదర్శించడం శోభయాత్ర నిర్వహించడమే కాకుండా కళాకారులకు ఉద్యమ నాయకులకు అవార్డు గ్రహీతలకు కళాకారులకు సత్కారాలు వుంటాయని బీజేపీ నాయకులు తమ ప్రచారం లో భాగంగా స్థానిక సంచార తెగల నాయకులకు వివరిస్తున్నారు. రాష్ట్రంలో ఎన్ టి,డి ఎన్ టి సంఘాలు కుల సంఘాలు నాయకులు కుల పెద్దల ఆశీస్సులు వారి సహకారంతో భారతీయ జనతా పార్టీ ఎంతో ప్రతిష్టాత్మకంగా " స్ఫూర్తి " కార్యక్రమాన్ని నిర్వహిస్తుందని సంచార సమాజం సమస్యలు దీర్ఘకాళిక అంశాలపై కూడా రూట్ మ్యాప్ ప్రకటించుకుంటామని తెలిపారు .రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న సంచార సమాజం లో వివిధ సంచార సంఘాలు మేధావులు నాయకులు కుల పెద్దలు యువత మహిళలు అందరు "స్ఫూర్తి " కార్యక్రమంలో పాల్గొని విజయవంతం చేయాలని కోరుచు ఆహ్వాన కరపత్రిక విడుదల చేశారు. అలాగే జిల్లాలో సంచార కులాలను కలసి అందరిని ఆహ్వానిస్తామని సంచార సమాజం ఆత్మగౌరవం చరిత్ర త్యాగం పోరాటపటిమ ఎదుర్కొంటున్న సమస్యలు డిమాండ్లు మిగతా సమాజానికి ప్రభుత్వాలకు మరియు అధికారులకు తెలిసే విధంగా ఒక పెద్ద పండుగలా "విముక్త జాతుల దినోత్సవాన్ని" జరుపుకునేలా స్ఫూర్తి కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు

## రెడ్డిగూడెం టిడిపి కార్యాలయంలో ముఖ్యమంత్రి సహాయ నిధి చెక్కుల పంపిణీ



**రెడ్డిగూడెం ఆగస్టు 21 :(వార్తా ప్రభ ప్రతినిధి):**ప్రజల సంక్షేమం కోసం ఎల్లప్పుడూ ముందుండే మైలవరం శాసనసభ్యులు వసంత వెంకట కృష్ణ ప్రసాద్ సహాయ సహకారంతో మంజూరైన ముఖ్యమంత్రి సహాయనిధి చెక్కులు, ఈరోజు ఉదయం 10 గంటలకు రెడ్డిగూడెం మండల తెలుగుదేశం పార్టీ కార్యాలయంలో లబ్ధిదారులకు అందజేయబడ్డాయి.ఈ కార్యక్రమంలో మండల తెలుగుదేశం పార్టీ అధ్యక్షులు శ్రీ ముప్పిడి నాగేశ్వరరెడ్డి , %రూజా% అధ్యక్షులు సుబ్బారెడ్డి ,లబ్ధిదారులకు చెక్కులను అందజేశారు. ప్రజల అవసరాల కోసం ఎప్పుడూ అండగా నిలుస్తూ, ప్రతి సమస్యకు పరిష్కారం చూపే నాయకత్వం వసంత వెంకట కృష్ణ ప్రసాద్ అనే విషయాన్ని మరోసారి ఈ కార్యక్రమం స్పష్టంచేసింది.

## అంగన్వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ సమస్యలు వెంటనే పరిష్కరించాలి





**కనిగిరి ఆగస్టు 21 వార్తా ప్రభ ప్రతినిధి** కనిగిరి నియోజకవర్గం పామూరు తాసిల్దార్ కార్యాలయం వద్ద గురువారం అంగన్వాడి వర్కర్స్ అండ్ హెల్పర్స్ నిరసన కార్యక్రమం నిర్వహించారు. ఈ నిరసన కార్యక్రమంలో సిఐటియు మాజీ జిల్లా నాయకులు కొమ్మలపాటి మాల్యాద్రి మాట్లాడుతూ 42 రోజుల సమ్మె పోరాటం చేసి న గత ప్రభుత్వం ఇచ్చిన హామీలు అమలు చేయకుండా తెలుగుదేశం కూటమి ప్రభుత్వం యాపుల భారం పెంచిందని, ఎఫ్ ఆర్ ఎస్ లను రద్దు చేయాలని పోరాటాలు చేస్తున్న పట్టించుకోవడంలేదని వెంటనే రాష్ట్ర నాయకత్వంతో చర్చలు జరిపి కనీస వేతనం పెంచాలని గ్రాడివిటీ అమలు చేయాలని సంక్షేమ పథకాలు అమలు చేయాలని ఫైవ్ జి ఫోన్స్ ను అందజేయాలని, 62 సంవత్సరాలు రిటైర్మెంట్ బెనిఫిట్స్ను అందజేయాలని ఐసిడిఎస్ ప్రాజెక్టుకు నిధులు పెంచాలని, మినీ అంగన్వాడీలను మెయిన్ సెంటర్ మార్చాలని,పెంచిన వేతనాలను వెంటనే అమలు చేయాలని డిమాండ్ చేశారు.. డిమాండ్లతో కూడిన వినతి పత్రాన్ని పాముర తాసిల్దార్ వాసుదేవరావు కు అందజేశారు పై సమస్యల పరిష్కారం కోసం పై అధికారులకు నివేదిస్తానని వాసుదేవరావు హామీ ఇచ్చారని తెలిపారు. ఈ కార్యక్రమంలో రాజ్యం లక్ష్మి, పార్వతి ,రమీజా, అమల, రజియా ,వాణి ,రామ సుబ్బులు అనిత, వై వి నారాయణ,శంకర్ తదితరులు పాల్గొన్నారు

## వీధి వ్యాపారాలు కొనసాగించేలా చర్యలు తీసుకోవాలని వినతి



**విజయవాడ పశ్చిమ ఆగస్టు 21 :(వార్తా ప్రభ ప్రతినిధి)**అనేక సంవత్సరాలుగా పశ్చిమ లోని , రైల్వే హాస్పిటల్ గోడను అనుకోని చేస్తున్న తమ చిరు వ్యాపారాలు కొనసాగించేలా చూడాలని 35 వ డివిజన్ ,రైల్వే హాస్పిటల్ ప్రాంతంలోని వీధి వ్యాపారస్తులు ఎన్డీఏ కార్యాలయంలో వినతి పత్రం అందజేశారు.గురువారం చిరు వ్యాపారస్తులు మాజీ మేయర్ తాడి శకుంతల మాజీ కార్పొరేటర్ అబ్దుల్ ఖాదర్ తో కలిసి భవానిపురం ఎన్డీఏ కార్యాలయంలో , కార్యాలయ కార్యదర్శి ప్రత్తిపాటి శ్రీధర్ ను కలిసి వినతి పత్రాన్ని అందించారు.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గత 25 ఏళ్లుగా రైల్వే హాస్పిటల్ గోడను అనుకోని 30 కుటుంబాలు చిరు వ్యాపారాలు చేసుకుంటూ జీవనోపాధి కొనసాగిస్తున్నా మన్నారు.రైల్వే పోలీస్ వారు వ్యాపారాలు చేయనివ్వకుండా తమ తోపుడు బండ్లు తొలగించారని ఆవేదన వ్యక్తం చేశారు. గత 10 రోజులుగా వ్యాపారాలు లేక అనేక ఇబ్బందులు ఎదుర్కొంటున్నామని, రైల్వే పోలీస్ వారు చిరు వ్యాపారులను అడ్డుకోవడం సరైంది కాదన్నారు. తమ వ్యాపారాలు కొనసాగించేలా చూడాలని చిరు వ్యాపారస్థులను ఆదుకోవాలని ప్రత్తిపాటి శ్రీధర్ కు వినతి పత్రం అందజేశారు.. ఈ విషయాన్ని ఎమ్మెల్యే సుజనా చౌదరి దృష్టికి తీసుకెళ్తానని కార్యాలయ కార్యదర్శి ప్రత్తిపాటి శ్రీధర్ తెలిపారు..వ్యాపారస్తులు యర్రం శెట్టి దుర్గారావు, వడ్లది మాధవరావు,ఓడూరి పద్మావతి తదితరులు పాల్గొన్నారు..



శ్రీశైలం యాదవ సత్రం స్థలం(బి బ్లాక్) గురించి శ్రీశైలం ఎమ్మెల్యే బుడ్డ రాజశేఖర్ రెడ్డి ని కలసిన అఖిల భారత శ్రీ కృష్ణ యాదవ సత్రం అధ్యక్షులు గొర్ల సత్యనారాయణ యాదవ్ తదితరులు

**వార్తా ప్రభ,శ్రీశైలం**

# దేశంలో ఉత్తమ ఐఏఎస్ అధికారిగా అవార్డు సాధించిన జిల్లా కలెక్టర్

**డీకే బాలాజీని ఘనంగా సన్మానించిన ఏపీ యోగాసభ.**

**మచిలీపట్నం ఆగస్టు 21 :(వార్తా ప్రభ ప్రతినిధి)**జిల్లా కలెక్టర్ డీకే బాలాజీ ఉత్తమ ఐఏఎస్ అవార్డు పొందడం రాష్ట్రానికి, జిల్లాకు గర్వకారణమని ఏపీ యోగాసభ మచిలీపట్నం యోగా గురువులు ఘంటసాల గురునాథ్ బాబు పేర్కొన్నారు. గత నెలలో ముస్సోరిలో ఐఏఎస్ మిడ్ క్యారియర్ శిక్షణకు వెళ్ళి నాలుగు వారాలు విజయవంతంగా శిక్షణ పూర్తి చేసుకుని జిల్లాకు విచ్చేసిన ఆయన గురువారం తెల్లవారుజామునే యధావిధిగా నగరంలోని గాంధీ నగర్ ఉదయపు నడక మిత్ర మండలి భవనంలో యోగా శిక్షణ తరగతుల్లో పాల్గొన్నారు. ఐఏఎస్ శిక్షణా కార్యక్రమాలలో అన్ని విభాగాల్లో ఓవరాల్ గా విజయం సాధించిన కృష్ణా జిల్లా కలెక్టర్ డికె బాలాజీ గారికి ఉత్తమ ఐఏఎస్ అధికారి గా అవార్డు లభించింది. ఈ సందర్భంగా యోగా గురువులు ఘంటసాల గురునాథ్ బాబు, వారి సతీమణి యోగ గురువులు మహాలక్ష్మి, మద్దాల చింతయ్య , శీలం రమేష్, వడ్డీ శ్రీనివాస్ పలువురు యోగ సభ్యులు జిల్లా కలెక్టర్ ను అభినందించి



శాలువాలు, నేతి మిఠాయిలు, పుష్పగుచ్చాలు, తలపాగా, మొక్కలతో ఘనంగా సత్కరించారు. అనంతరం జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ నిరంతర యోగ సాధన వలన ఈ అవార్డు సాధించగలిగానని తెలిపారు. తనకు ముస్సోరీలో ఇదివరకు పాల్గొన్న శిక్షణలో కంటే ఈసారి శిక్షణ తనకెంతో సులభంగా ఉందన్నారు. యోగా వలన మానసిక ప్రశాంతతతో పాటు యోగ ఆసనాలు, ప్రాణాయామాలు ఇదివరకే చేయడం వలన శిక్షణలో వాటిని తానెంతో సునాయసంగా చేయగలిగానన్నారు. కొండలను సైతం ఎలాంటి అలసట లేకుండా ఎక్కగలిగానని, ఎంత దూరమైనా నడవగలిగానని ఇదంతా యోగా ద్వారా తనకు ప్రయోజనం చేకూరిందన్నారు. రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన యోగాంధ్ర కార్యక్రమాలు విజయవంతం చేయుటలో ఏపీ యోగాసభ మచిలీపట్నం విభాగానికి ఒక ప్రత్యేక స్థానం ఉందన్నారు. ఈ కార్యక్రమంలో యోగా గురువులు మద్దాల చింతయ్య, శీలం రమేష్, వడ్డీ శ్రీనివాసు, యోగ సభ్యులు తేజస్వి కుమార్, సమాచార పౌర సంబంధాల శాఖ ఉపసంచాలకులు వెంకటేశ్వర ప్రసాద్, పశుసంవర్ధక శాఖ సంయుక్త సంచాలకులు చిన్న నరసింహులు, జిల్లా పరిషత్ ఏ ఓ మానేపల్లి శ్రీనివాస్, విశ్రాంత అగ్నిమాపక అధికారి, జగన్మోహన్రావు, ఆర్.డి. ప్రసాద్, అశోక్ మాస్టారు, రేఖ రంజిత, రాజకుమారి, మాటూరు విజయభాస్కర్ తదితరులు పాల్గొన్నారు.

## శ్రీ శక్తి పథకాన్ని అంతర్ రాష్ట్ర బస్సులకు సైతం అమలు చేయాలి.

**సిపిఎం పార్టీ డిమాండ్.**



**జగ్గయ్యపేట ఆగష్టు 21 (వార్తప్రభ)** ఇటీవల ప్రభుత్వం ప్రవేశపెట్టిన శ్రీ శక్తి పథకం అంతరాష్ట్ర బస్సులకు సైతం అమలు చేసి రాష్ట్ర సరిహద్దు ప్రాంత మహిళలకు ఉచిత బస్సు సౌకర్యం శ్రీ శక్తి పథకాన్ని అమలు చేసేలా ప్రభుత్వం తగు చర్యలు తీసుకోవాలని సిపిఎం పార్టీ జగ్గయ్యపేట మండల, పట్టణ కార్యదర్శి సోమోజు నాగమణి అన్నారు. మండలంలోని షేర్ మహమ్మద్ పేట గ్రామంలో గురువారం తెలంగాణ రాష్ట్రం కోదాడ వెళ్లే జగ్గయ్యపేట ఆర్టీసీ డిపోను సిపిఎం పార్టీ ఆధ్వర్యంలో అడ్డుకొని రోడ్డుపై బైఠాయించి నిరసన కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా నాగమణి మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం శ్రీ శక్తి పథకం ప్రవేశ పెట్టడంతో మహిళలు సంతోషించారని నిత్యం జగ్గయ్యపేట మండలం, జగ్గయ్యపేట పట్టణం నుండి వివిధ పనులపై నిత్యం తెలంగాణ రాష్ట్రానికి వెళుచుంటారని రాష్ట్ర ప్రభుత్వం శ్రీ శక్తి పథకం అమలు చేయడంతో ఈ రాష్ట్ర మహిళలు సంతోషించాలని కానీ అంతరాష్ట్ర బస్ సర్వీసులకు ఈ పథకం గుర్తించదని చెప్పటంతో మహిళలు అసహనానికి గురవుతున్నారని తక్షణమే రాష్ట్ర ప్రభుత్వం తెలంగాణ రాష్ట్రం మాదిరిగా ఆంధ్రాలో కూడా అంతర్రాష్ట్ర బస్సులకు శ్రీ శక్తి పథకాన్ని అమలు చేయాలని లేకపోతే మండలంలోని బాధ్యత గ్రామాల మహిళలను కలుపుకొని జగ్గయ్యపేట ఆర్టీసీ డిపో ముందు ధర్నా చేపడతామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో సిపిఎం పార్టీ నాయకులు కోటా కృష్ణ, పుట్టం పుల్లారావు, కోటా రవికుమార్, షేక్ గౌస్ మియా, ముల్లంగి కరుణ, పుట్టం హనుమంతరావు, షేక్ బడే మియా తదితరులు పాల్గొన్నారు.

## దివ్యాంగులను పునః పరిశీలన పేరుతో కూటమి ప్రభుత్వం అవమాన పరుస్తుంది- వట్టెం మనోహర్



**జగ్గయ్యపేటఆగష్టు 21 (వార్తప్రభ)** నియోజకవర్గ కేంద్రమైన జగ్గయ్యపేట ప్రభుత్వ ఆసుపత్రి నందు దివ్యాంగుల పునః పరిశీలన పేరుతో వైద్య పరీక్షలు నిర్వహించడం జరుగుతుంది . ఈ కార్యక్రమానికి జగ్గయ్యపేట మున్సిపల్ కౌన్సిలర్ వట్టే%శీ% మనోహర్ పరిశీలనగా వెళ్లి అక్కడ ఉన్న దివ్యాంగులు వారి కుటుంబ సభ్యులను పరామర్శించి వివరాలు అడిగి తెలుసుకుని డాక్టర్ల పర్యవేక్షణ ఉదయం 10 గంటలకు ప్రారంభం కావాల్సింది కానీ 12 గంటలకు ప్రారంభం కావడం విచారకరం ఇట్టి విషయమై డాక్టర్స్ ను సిబ్బందిని కలిసి రేపు ఎల్లుండి జరిగే రెండు రోజులకు రి వెరిఫికేషన్ స్లాట్లు దివ్యాంగులకు త్వరితగతిన పరిశీలన చేసి వారికి అన్యాయం జరగకుండా న్యాయపరంగా వారికి సర్టిఫికెట్లు ఇవ్వవలసిందిగా కోరడమైనది. ఈ సందర్భంగా అక్కడ దివ్యాంగులు వారి కుటుంబ సభ్యులకు వట్టెం మనోహర్, చౌడవరపు జగదీష్ కలిసి వ్యక్తిగతంగా అన్నదాన కార్యక్రమం నిర్వహించడం జరిగింది ఈ కార్యక్రమంలో పాల్గొన్న రిటైర్డ్ బ్యాంకు ఉద్యోగి పోనకాల ప్రసాద్ , గోగుల వెంకయ్య, దేరంగుల తిరుపతిరావు, కనపర్తి సత్యం తదితరులు పాల్గొన్నారు

## జడ్పీ హైస్కూల్లో హెచ్ఐవి పై అవగాహన

**విద్యార్థులతో ర్యాలీ నిర్వహించిన స్కీమ్ వర్కర్ ఏ. శశికళ**

**చేజర్ల ఆగస్టు 21 (వార్తాప్రభ)** చైల్డ్ ఫండ్ ఇండియా లింక్ వర్కర్ స్కీం వారు ఎస్ఎసిఎస్ వారి ఆదేశాలు మేరకు చేజర్ల మండలం జడ్పీ పి హైస్కూల్ నందు ఐఇసి కాంపరింగ్ మరియు సైకిల్ ర్యాలీ ద్వారా కార్యక్రమాన్ని నిర్వహించడం జరిగినది. ఇందులో సిఎల్ డబ్ల్యూ స్క్రీన్ వర్కర్ ఏ శశికళ పదవ తరగతి చదువుతున్న విద్యార్థులకు హెచ్ఐవి మరియు ఎయిడ్స్ పై అవగాహన కార్యక్రమం నిర్వహించడం జరిగినది. హెచ్ఐవి ఎయిడ్స్ పట్ల ప్రతి ఒక్కరు అవగాహన కలిగి ఉండాలని దానికి సంబంధించిన పలు రకాల బోధనలను వివరించడం జరిగినది. పదో తరగతి విద్యార్థులతో ర్యాలీ నిర్వహించి హెచ్ఐవి స్లొగన్స్ చేయడం జరిగినది ఈ కార్యక్రమంలో హై స్కూల్ సిబ్బంది పాల్గొన్నారు.



## ఈ నెల 22, 23 తేదీల్లో కె.బి.ఎన్ లో కోడ్ స్పార్క్ 2025

**300కు పైగా బృందాల ప్రాతినిధ్యం**
**నేషనల్ లెవల్ హ్యాకథాన్**

**విజయవాడ పశ్చిమ ఆగస్టు 21:(వార్తా ప్రభ ప్రతినిధి)**రేపటితరం ఆవిష్కర్తలైన యువతను ప్రోత్సహించటం, యువ పారిశ్రామికవేత్తలకు వెన్నుదన్నుగా నిలవటం అనే లక్ష్యాలతో తమ కళాశాలలో ఈ నెల 22, 23 తేదీల్లో నేషనల్ లెవల్ కోడింగ్ హ్యాకథాన్ నిర్వహించనున్నట్లు కె.బి.ఎన్. కళాశాల సెక్రటరీ అండ్ కరస్పాండెంట్ డాక్టర్ టి.శ్రీనివాసు చెప్పారు. గురువారం కళాశాలలో జరిగిన కార్యక్రమంలో కోడ్ స్పార్క్ 2025 పోస్టర్ ను శ్రీనివాస్ ఆవిష్కరించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ యువతలోని ఆలోచనల్ని ఆచరణలోకి తీసుకువచ్చి, వారిని పారిశ్రామికవేత్తలుగా తీర్చిదిద్దటానికి కోడ్ స్పార్క్ అండగా నిలుస్తుందన్నారు. దేశంలోని ఉన్నత ఆలోచనల్ని ఒకేవేదికమీదకు తీసుకువచ్చేందుకు ఈ కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు చెప్పారు. ప్రిన్సిపాల్ డాక్టర్ జి.కృష్ణవేణి మాట్లాడుతూ కృత్రిమ మేధస్సు, మెషిన్ లెర్నింగ్, సైబర్ సెక్యూరిటీ అండ్ ప్రైవసీ, వెబ్ అండ్ యాప్ డవలప్మెంట్, ఇంటర్నెట్ ఆఫ్ థింగ్స్ , బ్లాక్ చెయిన్ అండ్ ఫిన్ టెక్, డేటా సైన్స్ అండ్ అనలిటిక్స్, క్వాంటమ్ క్రిప్టోగ్రఫీ, ఓపెన్ ఇన్నోవేషన్ రంగాల్లో హ్యాకథాన్ నిర్వహిస్తున్నట్లు చెప్పారు. వ్యవసాయం, ఆరోగ్య రంగం, కృత్రిమ మేధస్సు, స్మార్ట్ క్యాంపస్ ఆటో మేషన్ తదితర సమస్యలకు వినూత్న పరిష్కారాలు అందించేదిశగా పోటీదారులు తమ ప్రాజెక్ట్ లను తయారుచేయాల్సి ఉంటుందన్నారు. విజేతలకు రూ. లక్ష నగదు బహుమతి, బ్రాండెడ్ ల్యాప్ ట్యాప్ లు, ట్యాబ్ లతో పాటు



సోషల్ ఇంపాక్ట్ అవార్డ్, ఉమెన్ ఇన్ టెక్ అవార్డ్, యంగ్ కోడర్స్ అవార్డులను అందిస్తామన్నారు. ఇప్పటికి దేశవ్యాప్తంగా 310 టీమ్ లు రిజిస్ట్రేషన్ చేసుకున్నాయని, 1000 మందికి పైగా ప్రతినిధులు హాజరవుతారని చెప్పారు. ప్రతినిధులందరికీ అన్ని రకాల వసతి సౌకర్యాలు ఏర్పాటుచేస్తున్నట్లు చెప్పారు. కంప్యూటర్స్ విభాగాధిపతి రవీంద్ర, వైస్ ప్రిన్సిపాల్స్ పి.ఎల్.రమేష్, డాక్టర్ ఎం.వేంకటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

## ప్రతి రైతు బజార్లో గుడ్డ సంచల కౌంటర్లను ఏర్పాటు చేయండి

***వ్యర్థాలను ప్రతిరోజు కచ్చితంగా తొలగించాలి***
***విజయవాడ నగరపాలక సంస్థ కమిషనర్ ధ్యానచంద్ర హెచ్ యం***





**విజయవాడ పశ్చిమ ఆగస్టు 21 :(వార్తా ప్రభ ప్రతినిధి)** ప్లాస్టిక్ రహిత నగరంగా విజయవాడ ను ఉంచేందుకు విజయవాడ నగరపాలక సంస్థ కమిషనర్ ధ్యానచంద్ర హెచ్ యం, ప్రతి రైతుబజార్లో గుడ్డ సంచుల కౌంటర్లను ఏర్పాటు చేయాలని అన్నారు. గురువారం ఉదయం తన పర్యటనలో భాగంగా ఏపీఐఐసీ కాలనీ రైతు బజార్, మహానాడు రోడ్డు, లోయోలా కాలేజ్ రోడ్డు, డెంటల్ కాలేజ్ రోడ్డు ప్రాంతాలన్నీ క్షేత్రస్థాయిలో పర్యటించారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ ప్లాస్టిక్ రహిత నగరంగా విజయవాడ ను ఉంచాలనే లక్ష్యంతో ప్రతి రైతు బజార్లో స్వయం సహాయక బృందాలు తయారు చేసిన గుడ్డ సంచులను అమ్మే కౌంటర్లను ఏర్పాటు చేయాలని, అలా చేయటం వల్ల ఒకవైపు ప్లాస్టిక్ రహిత పర్యావరణహితమైన వస్తువులను అమ్మటమే కాకుండా స్వయం సహాయక బృందాలను ఆర్థికంగా బలోపేతం చేసినట్టు ఉంటుందని కమిషనర్ అన్నారు. లోయోలా కాలేజ్ రోడ్డులో పేరుకుపోయిన వ్యర్థాలను గమనించి వ్యర్థాలను ఎప్పటికప్పుడు ఎందుకు తొలగించలేదని కమిషనర్ ఆగ్రహం వ్యక్తం చేశారు. వ్యర్థాలు తరలించేందుకు వాహనాలన్ని అందుబాటులో ఉంచాలని, రిపేర్ లో ఉన్న వాహనాలను మరమ్మతులు చేయించి అందుబాటులోకి తీసుకు రావాలని, ప్రతిరోజు వ్యర్థాలను కచ్చితంగా తీయాలని, ప్రధాన



రహదారుల్లో కంపాక్టర్ బిన్స్ లను పూర్తిస్థాయిలో అందుబాటులో ఉంచాలని అధికారులను ఆదేశించారు. ప్రతిరోజు ఇంటి వద్దనే వ్యర్థాల సేకరణ జరగాలని, సేకరించిన వ్యర్థాలను ఎప్పటికప్పుడు గార్బేజ్ ట్రాన్స్ఫర్ స్టేషన్ కి తరలించాలని, నగర ప్రజలకు ఎటువంటి ఇబ్బందులు కలగకుండా వ్యర్థాల నిర్వహణ జరగాలని అధికారులను ఆదేశించారు. మహానాడు రోడ్డులో ఔట్ఫాల్ డ్రైన్ ని పరిశీలించి, డ్రైన్ లో నీరు నిలిచి ఉండకూడదని నిరంతరాయంగా వెళ్లేటట్టు చర్యలు తీసుకోవాలని, అందుకు పట్టణ ప్రణాళిక వారి మార్కింగ్లను అనుసరిస్తూ, ఆక్రమణలను తొలగిస్తూ, డ్రైన్ లో నీరుపారుదల చూసుకోవాలని అధికారులను ఆదేశించారు. నగరంలో మొక్కల శాతం లో పెంచమని కమిషనర్ ఆదేశించగా, ఆదేశాలకు అనుగుణంగా డెంటల్ కాలేజ్ రోడ్డులో అమర్చిన పూల మొక్కలను పరిశీలించి, నగరంలో మొక్కల శాతను మరింత పెంచి నగర సుందరీకరణలో మొక్కలను కూడా ఉపయోగించాలని అధికారులను ఆదేశించారు. ఈ పర్యటనలో చీఫ్ ఇంజనీర్ ఆర్ శ్రీనాథ్ రెడ్డి, ప్రాజెక్ట్ ఆఫీసర్ యూ సి డి పి వెంకటనారాయణ, డిప్యూటీ డైరెక్టర్ హార్టికల్చర్ చంద్రశేఖర్, సిడిఓ ఉమామహేశ్వరి, అసిస్టెంట్ మెడికల్ హెల్త్ ఆఫీసర్ గోపాలకృష్ణ నాయక్, ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ సామ్రాజ్యం తదితరులు పాల్గొన్నారు.

## నీటి తీరువ బకాయిలను చెల్లిస్తేనే పొలాలకు రిజిస్ట్రేషన్?

- **26.93 కోట్ల బకాయి వసూళ్లకు సరికొత్త ఆలోచన.**
- **ఇబ్బంది పడుతున్న రైతులు.... తప్పదన్న జిల్లా కలెక్టర్.**



**మచిలీపట్నం ఆగస్టు 21 :(వార్తా ప్రభ ప్రతినిధి)**కృష్ణాజిల్లా కలెక్టర్ జిల్లాకు చెందిన రైతులకు పిడుగు లాంటి వార్త ప్రకటించడంతో రైతులు అల్లాడుతున్నారు. రైతులు ఎన్నో సంవత్సరాల నుండి నీటి తీరువ బకాయిలు చెల్లించకపోవడం 26.93 కోట్లు బకాయి పేరుకుపోయింది. జిల్లావ్యాప్తంగా నీటి తీరువ 41.83 కోట్లు బకాయి ఉండగా ఇప్పటికే 14.89 కోట్లు వసూలు చేశారు. ఇంకా రావాల్సిన 26.93 కోట్లు వసూలు చేయాలని లక్ష్యంగా పెట్టుకున్నారు. ఈ బకాయిలు వసూలు కాకపోవడంతో జిల్లా కలెక్టర్ దీనిపై దృష్టి సారించారు. రైతులు నీటి తీరువ బకాయిలను చెల్లించడానికి జిల్లా కలెక్టర్ సరికొత్త ఆలోచన చేశారు. ఇప్పటినుండి జిల్లాకు చెందిన రైతులు తమ పొలాలను అమ్మినా, కొనుగోలు చేసినా నీటి తీరువా బకాయిలు లేకుండా ఉంటేనే రిజిస్ట్రేషన్ చేయాలని జిల్లాలో ఉన్న అన్ని రిజిస్ట్రేషన్ కార్యాలయాలకు ఆదేశాలు జారీ చేశారు. కాగా జిల్లా కలెక్టర్ ,జిల్లా వ్యవసాయ శాఖ, జిల్లా ఉద్యాన శాఖకు చెందిన అధికారులతో పాటు అన్ని తహసీల్దార్ కార్యాలయలకు, రెవెన్యూ కార్యాలయాలు ఈ ఆదేశాలను పాటించాలని తెలియజేశారు. ఈ విషయం తెలియక గురువారం జిల్లా సబ్ రిజిస్టర్ కార్యాలయానికి రిజిస్ట్రేషన్ కోసం వచ్చిన రైతులకు రిజిస్ట్రేషన్ కార్యాలయముకు చెందిన అధికారులు రిజిస్ట్రేషన్ చెయ్యాలి అంటే పెండింగ్ లో ఉన్న నీటి తీరువ బకాయిలను చెల్లించాలని తెలియజేయడంతో వారు చేసేది ఏమీ లేక అప్పటికప్పుడు ఆన్లైన్లో నీటి తీరువ బకాయిలను చెల్లించారు. మరికొందరు విషయం తెలియక వెనుతిరిగి వెళ్లారు కావున రిజిస్ట్రేషన్ కు వచ్చే రైతులు ఈ విషయాలన్నిటిని గ్రహించాలని అధికారులు కోరారు.

## మెరుగైన వైద్యం కోసం ఎల్ ఓ సీ అందజేత



**విజయవాడ పశ్చిమ ఆగస్టు 21 :(వార్తా ప్రభ ప్రతినిధి)**ఎమ్మెల్యే సుజనా చౌదరి సౌజన్యంతో మంజూరైన ఎల్. ఓ. సీ (లెటర్ ఆఫ్ క్రెడిట్ )ను గురువారం భవానిపురం ఎన్డీఏ కార్యాలయంలో ఎన్టీఆర్ జిల్లా బీజేపీ అధ్యక్షుడు అడ్డూరి శ్రీరామ్ కార్యాలయ కార్యదర్శి ప్రత్తిపాటి శ్రీధర్ కూటమి నేతలతో కలిసి అందజేశారు. 40 వ డివిజన్, బ్యాంక్ సెంటర్ కు చెందిన ఎన్ శిరీష సిజేరియన్ ద్వారా బిడ్డకు జన్మనిచ్చింది. ఓ ప్రైవేట్ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న తనకి మరింత మెరుగైన వైద్యం అందించాలని వైద్యులు తెలపడంతో ఎల్ .ఓ. సీ కొరకు ఎన్డీఏ కార్యాలయంలో దరఖాస్తు చేశారు.. మంజూరైన రూ 1 లక్ష 74 వేల ఎల్. ఓ. సీ ను బాధితురాలు భర్త శ్రీనివాస్ కు ఎన్డీఏ కార్యాలయంలో అందజేశారు. త్వరితగతిన స్పందించి ఎల్. ఓ సీ .ను అందజేసిన ఎమ్మెల్యే సుజనా కు బాధితురాలి కుటుంబ సభ్యులు కృతజ్ఞతలు తెలిపారు.. ఈ కార్యక్రమంలో కూటమి నేతలు అబ్దుల్ ఖాదర్, మన్నం నారాయణరావు మంగళ పురి మహేష్, పసుపులేటి రాంప్రసాద్, దళ వాయి భార్గవ్ రామ్ సుజనా మిత్రా కోఆర్డినేటర్ సప్పా శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

## బుడమేరులోని నీటి పారుదల అడ్డంకులు తొలగింపు



**విజయవాడ పశ్చిమ ఆగస్టు 21 :(వార్తా ప్రభ ప్రతినిధి)** విజయవాడ నగరపాలక సంస్థ కమిషనర్ ధ్యానచంద్ర ఆదేశాల మేరకు గురువారం ఉదయం రామవరప్పాడు పంచాయతీ పరిధిలోని శ్రీరామ్ కాలనీ వద్ద బుడమేరులోని అడ్డుగా ఉన్న పైపుబ్రిడ్జిను తొలగించారు. ఇంజనీరింగ్ అధికారులు. నగరంలో బుడమేరు నీరు అంతరాయం లేకుండా ప్రవహించేందుకు విజయవాడ నగర పాలక సంస్థ కమిషనర్ ధ్యానచంద్ర హెచ్ యం బుడమేరు చిట్టచివరి వరకు ఎటువంటి అంతరాయం లేకుండా అడ్డంకులను తొలగించాలని ఆదేశించగా రామరప్పాడు పంచాయతీ పరిధిలో గల శ్రీరామ్ కాలనీ వద్ద ఉన్న పైపుబ్రిడ్జిను తొలగించి బుడమేరు నీటి ప్రవాహంలో ఎటువంటి అంతరాయం లేకుండా చర్యలు తీసుకున్నారు.

## కృష్ణానది వరద ఉధృతిని పరిశీలించిన సబ్ కలెక్టర్

**వరద పునరావాస కేంద్రాల సందర్శన**





**ఇబ్రహీంపట్నం, ఆగస్టు 21(వార్తా ప్రభ ప్రతినిధి):** ఎగువ ప్రాంతాల నుండి కృష్ణా నదికి భారీగా నీరు విడుదలవడంతో వరద పెరుగుతుంది. గురువారం నాడు ఇబ్రహీంపట్నం వద్ద కృష్ణానది వరద ఉధృతిని జిల్లా సబ్ కలెక్టర్ చైతన్య సమీక్షించారు. గజ ఈతగాళ్లు, ఎస్డిఆర్ఎఫ్ సిబ్బంది అప్రమత్తంగా ఉండాలని సూచించారు. ఎప్పటికప్పుడు వరద ఉద్ధతిని అంచనావేసి తక్షణ చర్యలు చేపట్టాలని ఎమ్మార్వో వెంకటేశ్వర్లు కు ఆదేశించారు. అనంతరం పశ్చిమ ఇబ్రహీంపట్నం ట్రాక్ టర్మినల్ వద్ద వరద బాధితులకు ఏర్పాటుచేసిన పునరావాస కేంద్రాలను పరిశీలించారు. స్థానిక అధికారులతో మాట్లాడి ఏర్పాట్లు పర్యవేక్షించారు. వరద బాధితులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా మంచినీరు, వైద్య సదుపాయం, మరుగుదొడ్లు ఏర్పాటు చేయాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో ఇబ్రహీంపట్నం ఎమ్మార్వో వెంకటేశ్వర్లు,ఇంచార్జ్ కమిషనర్ మోస్మి పాల్గొన్నారు.

## అన్నదానంనకు విరాళం



**జగ్గయ్యపేట ఆగస్టు 21 (వార్తప్రభ)**పావన కృష్ణానది తీరమున ప్రసిద్ధి చెందిన పుణ్య క్షేత్రమైన స్వయంభూ శ్రీ పంచనారసింహ క్షేత్రమై నెలకొనియున్న వేదాద్రి గ్రామం, శ్రీ యోగానంద లక్ష్మీ నరసింహ స్వామి వారి దేవస్థానము నందు ప్రతిరోజు జరుగు అన్నదానంనకు ఎన్.టి.ఆర్.జిల్లా, కొండపల్లి వాస్తవ్యులు, గిరిజన సంక్షేమ శాఖ, సీనియర్ అసిస్టెంట్ చతుర్వేదుల ఆదినారాయణ శాస్త్రి- రాజ్యలక్ష్మీ అనువారు రు. 10,000/- లు (అక్షరాల పది వేల రూపాయిలు మాత్రమే) నగదు ద్వారా విరాళము సమర్పించినారు. వారికి కార్యనిర్వహణాధికారి కానూరి సురేష్ బాబు శ్రీ స్వామి వారి శేష వస్త్రం, లడ్డు ప్రసాదం అందజేశారు. దేవస్థాన వంశపారంపర్య ధర్మకర్త డాక్టర్ వియల్. ఇందిరా దత్తు వారి తరుపున పాటిబండ్ల రామ్ ప్రసాద్ పాల్గొన్నారు.

# రక్తపాతాల కడప కాదిది రక్తదాతల కడప







మొదటి కడపోత్సవానికి కడప నగరంలో ముమ్మరంగా ఏర్పాట్లు జరుగుతున్నాయి. బ్లడ్ గ్రూపు నిర్ధారణకై ఒక స్టాలు తీసుకోమన్నారు. కూలిమనిషి తడికెలు కట్టుతున్నాడు. అక్కడనే ఉండి సూచనలిస్తున్నా. ఉన్నట్టుండి ఆటో వచ్చి ఆగింది. ఒక యువకుడు మరొక్కరు అరవై ఏండ్లున్న పెద్దమనిషి ఇద్దరూ ఆందోళనలతో ఆత్రుతతో ఉన్నారు. చూస్తూనే అనుకున్నా రక్తంకొరకు వచ్చినారని. "సార్ మా అబ్బాయికి ఆక్సిడెంట్ అయింది. రక్తం చాలా పోయింది. వెంటనే రక్తం కావాలి. ఆసుపత్రిలో మీ పేరు చెబితే మీ యింటికి పోయినాము. ఇక్కడున్నారని తెలుసుకుని వచ్చినాము. ఎబి-పాజిటివ రక్తం అర్జెంటుగా కావాలి" అని గుక్కతిప్పుకోకుండా చెప్పసాగారు ఒకరు మార్చి ఒకరు వారి బాదను నాతో పంచుకొన్నారు. రక్తం కొరకు వచ్చిన వారి పేరు, ఊరు అడిగే అలవాటు లేదు. వెంటనే రక్తదాతల లిస్టు చూడడమే. కానీ రిజిష్టర్లు అన్నీ ఇంట్లో ఉన్నాయి. కారు డ్రైవరును ఎక్కడికో పంపాను. ఏమి చెయ్యాలా అని అటూ ఇటూ చూస్తు ఆలోచిస్తున్నా. తడికెలు కట్టే కూలీ పని మానేఊసి నా మొఖం చూస్తున్నాడు. ఏదో చెప్పబోతుంటే 'ఏంటి' అన్నా. సార్ నాది ఏబి-పాజిటివ్(ం )మీరు సరే అంటే నేను రక్తమిస్తా అన్నాడు. ఒకవైపు ఆశ్చర్యం! మరోవైపు భరోసా! వెంట వెంటనే అన్ని పనులూ జరిగిపోయినాయి. సకాలంలో రక్తమందింది. సాయంత్రం వాళ్లిద్దరూ ఇంటికొచ్చారు. ఇద్దరూ తృప్తి, అసంతృప్తి, సంతోషం, అసంతోషం వెలిబుస్తూ "చిన్నయ్యగారూ ప్రాణాపాయ స్థితి నుండి మా వాడు బయటపడినాడు. కానీ మరో మూడు బాటళ్ల రక్తం కావాలని డాక్టరు చెప్పేరు. ఏం చేయాలి, మాది విశాఖపట్నం వద్ద ఊరు. మీరే కాపాడాలి" అని నా ఎదుటూ కూర్చున్నారు. ఎబి బ్లడ్ గ్రూపు వారు 5% మాత్రమే ఉంటారు. ఇప్పుడే ముగ్గురు దాతలు కావాలంటే కష్టమే. అయినా వారికేమి చెప్పకుండా లిస్ట్ చూసి ఫోన్ చేస్తే వారి అదృష్టమో దాతల అనురాగమో ఒక గృహిణి, ఒక ఇంజనీర్, ఒక విద్యార్థి వెంటనే రక్తమందిచి బాధితున్ని కాపాడినారు. అది రక్తదానంలో ఉన్న సేవాభావం. మానవతా దృక్పథం, త్యాగనిరతి. రక్తదానంలో అంతర్లీనమై ఉన్న సూత్రం - మానవత్వం, సమానత్వం మాత్రమే. నాకు రాత్రి హాయిగా నిద్రపట్టింది. స్వర్గస్థురాలైన నా భార్య పార్వతికల్లో కనిపించింది. అది నాకు మధురానుభూతి. మరుసటి రోజు తెలతెలవారుతోంది. తలుపు తీయగానే కు . నిన్నటి పెద్దాయన ప్రత్యక్షం. ఇంకా అవసరమా! అబ్బా అనుకొని లోనికి పిలిచి "కూర్చోండి అన్నా","బాండి రాత్రి మూడు బాటిల్ల రక్తం ఎక్కించినామండి. ఆపరేషన్ కూడా అయిపోయింది. వ్యాన్ లో హైదరాబాదుకు తీసుకుపోతున్నాం. మీ సాయం మరిచిపోమండి" అంటూ క్యాష్ బ్యాగ్ తెరుస్తుండగానే అర్థం చేసుకొని అదంతా ఏమీ వద్దని నివారించే లోపల కోడలు రెండు కప్పులల టీ, బిస్కట్లు తెచ్చిన ట్రే టేబుల్పై పెట్టింది. టీ తాగుతూ పూర్తి సంతోషంతో "ఇది కడపేనా" అని నాకు అనుమానమొస్తున్నది సార్!" అన్నాడు. "ఎందుకట్లా అడుగుతున్నారు?" నా ప్రశ్న "నిన్నటి నుండి చూస్తున్నా మీ కడప వాండ్ల కండ్లలోని కరుణ. కడప దగ్గర ప్రమాదం జరిగిందే ఏమిటి మా గతి అని కలవర పడిపోయినాను. మా బంధువు విశాఖలో ఒక పెద్ద కాంట్రాక్టరు. ఆయన అప్పుడప్పుడు కడపోళ్లను గురించి చెబుతుంటారు. 'కఠినాత్ములని, ఆగ్రహిస్తే ప్రాణాలు తీస్తారని, రక్తం చిందిస్తారని' కాని నిన్న, నేడు నేను గమనించింది దానికి విభిన్నం - అందుకే అనుమానమొచ్చింది - మేము కడపలో ఉన్నామా వేరే గ్రామంలో ఉన్నామా" అని అంటూ తీరిగ్గా కూర్చున్నాడు. "కడపకు పూర్వపు పేరు కృపానగరం. ఇది తిరుపతి దేవుని గడప -1 మా కడప" అంటూ మొదలుపెట్టా. "రెండు నేషనల్ హైవేలు ఈ జిల్లా గుండా పోతున్నాయి. ప్రతిరోజూ రోడ్డు ప్రమాదాలే. ప్రమాద బాధితులు పోగొట్టుకొనేది రక్తం. పోయిన రక్తం వెంటనే లభించకపోతే ప్రాణం పోతుంది. అలాంటి వారి ప్రాణాలు కాపాడేటందుకు జిల్లా నలుమూలలా రక్త సహాయ బృందాలున్నాయి. ఒకవైపు రక్త సహాయ స్వచ్ఛంధ సంస్థలు ముందుకు వస్తుండగా మీకంటే మేము ముందున్నామనే స్వచ్ఛంద రక్తదాతలు రక్త సహాయం చేయడానికి ఎదురు చూస్తున్న ధర్మస్థలమీ కడప. ఈ జిల్లాలోని యోగి, భోగి, సాయి, గోసాయి, సిపాయి, కసాయి రక్తదానం ద్వారా పరిచితుల అపరిచితుల ప్రాణాలు కాపాడుటకై తహతహలాడుతుంటారు. ఆ పనుల్ని ఆదుకోవడానికి సిద్ధమవుతున్నారు. "రక్తమవసర మొచ్చినపుడు నన్ను పిలవండి" అని రక్త సహాయ సంఘాలకు, వైద్య శాలలకు ఫోన్లు చేసేవారు ఎందరో! నదులు, వృక్షాలు, మేఘాలు లాంటి ప్రకృతిచే పాఠాలు నేర్చుకున్న వీరు గ్రహీతల నుండి ఏమి ఆశించరు. వారు చేసే దానము తృప్తి కొరకే గాని కీర్తి కొరకు కాదు. వారు పొందే అనుభూతి, దివ్యానుభూతి. ప్రమాదాలు జరిగిన చోటికి పరుగులెత్తుతున్నారు. చూచేటందుకు కాదు, అవసరమైతే రక్మఇచ్చేటందుకు ఈ రక్తదాన ప్రక్రియలో ఎంతోమంది తెలిసో తెలియకో ప్రత్యర్థుల రక్తం గ్రహించి ప్రాణాలు పొంది అటు తర్వాత పాత కక్ష్యలు మరిచిపోయి మంచి మిత్రులవుతున్నారు. పగ-ద్వేషం మానవున్ని పశువుగా మార్చే కాలం పోయింది. రక్త సహాయంతో పెంపొందించుకున్న ప్రేమ-దయ మనుషుల్ని మనీషిగా మారుస్తున్నాయిపుడు. ఒకరి రక్తం ఒకరు పంచుకున్న ప్రత్యర్థులు ఒకరినొకరు చూచుకోగానే కళ్ల వెంబడి కన్నీళ్లు బొటబొట కారుస్తారు. రెండు చేతులెత్తి అప్రయత్నంగా నమస్కారాలు చేసుకుంటారు. ఈ రక్తదానం ప్రజల్లో చైతన్యం కలిగిస్తూ శత్రుత్వాన్ని సంహరిస్తున్నది. వ్యాపరాస్తులు, ఉద్యోగులు, చిరుద్యోగులు, నిరుద్యోగులు, రైతులు, రైతుకూలీలు, అధికార్లు, వృత్తిపరులు, స్త్రీలు, పురుషులు, విద్యార్థులు, నిరక్షరాన్యులు, యువతీయువకులు, వారు వీరని లేకుండా అందరూ ఒక్క ఆరోగ్యవంతుడు తమ బాధ్యతగా ఈ సేవా కార్యక్రమానికి చేదోడు వాదోడుగా కదలివస్తున్నారు. రక్తదాన యజ్ఞానికి సమిధలందిస్తున్నారు. ఈనాడు పల్లెలు, చిన్న చిన్న పట్టణాలు రక్తదాన ఆవశ్యతని గుర్తిస్తున్నాయి. ఎక్కడ వీలైతే అక్కడ బ్లడ్ స్టోరేజ్ యూనిట్లు నెలకొల్పబడుతున్నాయి. రక్తదానం ఒక కర్తవ్యంగా ఒక సాంఘిక బాధ్యతగా భావించబడుతోంది. గుర్తింపబడుతోంది. పండుగలు, పబ్బాలు, రాష్ట్ర, జాతీయ, అంతర్జాతీయ ముఖ్య దినాల్లో ప్రత్యేక క్యాంపులు నిర్వహింపబడుతున్నాయి. వందలాది ప్రజలు ఈ కార్యక్రమాల్లో పాల్గొంటున్నారు. వాదాలు లేవు, ఏ బేధాలు లేవు. వర్గాలులేవు, వర్ణాలు లేవు. కులమత రాజకీయ ఆర్థిక ప్రసక్తి లేదు. అసమానతల పొరపొచ్చాలు లేవు. హిందువుల, ముస్లిములు, సిక్కులు, జైనులు అందరూ ఒక ఉద్వేగంతో, ఉ త్తేజంతో తామూ తమతోటి వారికి సాయం చేయాలని రక్తదానం చేయాలని సంసిద్ధత వ్యక్తం చేస్తూ వస్తున్నారు. ఇంతటి మహత్తర చైతన్యానికి, ఈ వాంఛనీయ పరిణామానికి సామాజిక ఉద్యమానికి జిల్లాఓ పలుచోట్ల వెలసి ముందుకొస్తున్న క్రింది స్వచ్ఛంద సంస్థల స్పూర్తియే

**మూలకారణం.** 1. బోగా పార్వతమ్మ రక్తదాన సేవా సమితి, కడప. 2. మహమ్మదీయ స్వచ్ఛంద రక్తదాతల సంఘం కడప, 3. పరమాత్మ సేవా సమితి, కడప. 4. వైశ్య యువ శక్తి, కడప. 5. శ్రీవాసవి రక్తవాన సేవా సమితి, రాజంపేట. 6. అమ్మ రక్త సహాయ సమితి 7. రాష్ట్ర ఉపాధ్యాయ సంఘాలు 8. బార్ అసోసియేషన్ 9. జిల్లాలోని అన్ని కాలేజీలు పై స్వచ్ఛంద సంస్థ అవిరళ కృషి, వ్యయ ప్రయాసలు, దీక్షా దక్షతలు లక్ష్యశుద్ధి ఈ సమాజిక సేవా కార్యక్రమం ఈనాడు కడప జిల్లాలో శాఖోపశాఖలుగా విస్తరించి ఆపన్నులకి ఆశలనూదుతోంది. మానవీయమైన ఒక్క ఉన్నతాశయం. వ్యష్టి, సమిష్టి స్థాయిల్లో ఈ విధంగా నవోత్తేజంతో జయప్రదంగా సాగుతోంది. ఈ ఉద్యమం. మా జిల్లాలోని కడపలోకరు ణామయులు న్నారు. సిద్ధవటంలో శిబిచక్రవర్తులున్నారు. జమ్మలమడుగులో జీమూత వాహనులున్నారు. దువ్వూరులో దధీచులున్నారు. రాజంపేటలో రంతిదేవులున్నారు. ప్రొద్దుటూరులో ప్రాణదాతలున్నారు. పరాయిబిడ్డకు పాలిచ్చి పెంచే పడతులే కాదు, రుధిరం సాయం చేసే రుద్రమ దేవుల రూపొందించుకుంటున్న నేల ఇది. "రక్తం చిందించడం మరచి రక్త మందించడం కడప వాసుల కర్తవ్యంగా భావిస్తున్నాం' కడప జిల్లా ద్వారా ప్రయాణం చేసేటపుడు నీళ్ల దొరకక్పోయినా త్యాధనుల రక్తానికి కొరత ఉండదు. ఇపుడు చెప్పండి కడపంటే మీకు.....!'మామయ్యా టిఫెన్ రడీ అయింది రండి' అని కోడలు పిలుపు. టిఫెన్ తింటున్నాడు కానీ పెద్దాయనలో అప్యాయత పొంగిపోతున్నది. కండ్లలో నీళ్లు తిరుగుతున్నాయి. ఆనందభాషాలో! అభిమాన తరంగాలో! మరలా వచ్చి కూర్చున్నాం 'లేచిపోవడానికి బుద్ధిపుట్టడం లేదండి" అంటూ అన్నమాటలివి. "మీరు.... ఆగ్రహించి ప్రాణం తీసేవాండ్లు కాదండి అనుగ్రహించి ప్రాణాలర్పించేవాండ్లు, కఠినాత్ములు కావండి, కరుణామయులు, మీ హృదయపు లోతుల్లో దయ, త్యాగం దాగి ఉన్నాయి. ఇది రక్తపాతల కడప కాదండి. రక్తదాతల కడప. నిజంగా ఇది కృపానగరమే "దేవుని గడపే"జిల్లా సేవలో తరించిన విదేశీయులు : సర్ థామస్ మన్రో కడప జిల్లా కలెక్టర్ గా పనిచేశాడు. పాలెగాళ్ళను అణచాడు. రైతువారి విధానాన్ని ప్రవేశపెట్టాడు. ఈ ప్రాంతాపు దేవాలయాల అభివృద్ధికి మడిమాన్యాలు ఇచ్చాడు. సిపి బ్రౌన్ తెలుగుభాషను సముద్ధరించాడు. మనుచరిత్ర, వసుచరిత్ర వంటి తెలుగు కావ్యాలను ముద్రించాడు. 3వేలకు పైగా వేమన పద్యాలను సేకరించాడు. వాటిని ఇంగ్లీషులోకి అనువదించి అచ్చువేయించాడు. ఇక కల్నల్ మెకంజి గ్రామాల చరిత్రను సేకరించి కైఫీయత్తుల పేరుతో భద్రపరిచాడు.

**సి. రాజారెడ్డి,**
**సీనియర్ పాత్రికేయులు, కడప.**

## డా. కొల్లూరి కి నెహ్రూ జాతీయ స్మారక పురస్కారం



**పెడన ఆగస్టు 21 :(వార్తా ప్రభ ప్రతినిధి)** పట్టణ ఆర్యవైశ్య ప్రముఖులు, అఖిల భారత ఆర్యవైశ్యుల పరిరక్షణ సమితి (ఆప్స్) వ్యవస్థాపకులు, సమాజ సేవకులు, ప్రజా సేవకులు గౌరవ డాక్టరేట్ అవార్డు గ్రహీత డా. కొల్లూరి సత్యనారాయణ (చిన్నా) పెడన పట్టణ పరిసర ప్రాంత పేద ప్రజలకు చేస్తున్న నిస్వార్థ సేవలకు అత్యున్నత గౌరవ పురస్కారం లభించింది. విశాఖపట్టణానికి చెందిన ప్రతిభ స్పోర్ట్స్ అండ్ కల్చరల్ అసోసియేషన్ 25వ వార్షికోత్సవం సందర్భంగా ఆంధ్రప్రదేశ్ తెలంగాణ ఒరిస్సా రాష్ట్రాలలో వివిధ రంగాలలో ప్రతిభావంతులను గుర్తించి అవార్డులకు ఎంపిక చేశారు. దీనిలో భాగంగా ప్రతిభ స్పోర్ట్స్ అండ్ కల్చరల్ అసోసియేషన్ వ్యవస్థాపక కార్యదర్శి అడవి రాజు సేవా రంగంలో డా. కొల్లూరి ని భారతదేశ ప్రథమ ప్రధానమంత్రి పండిట్ జవహర్ లాల్ నెహ్రూ జాతీయ స్మారక పురస్కారం ప్రతిష్టాత్మక అవార్డ్ కు ఎంపిక చేయడం జరిగింది. విశాఖపట్టణానికి చెందిన ప్రతిభ స్పోర్ట్స్ అండ్ కల్చరల్ అసోసియేషన్ సంస్థ వారు ఆగస్టు 31న విశాఖపట్నం జిల్లా పౌర గ్రంథాలయంలో నిర్వహించు అవార్డుల ప్రధానోత్సవ కార్యక్రమంలో డా. కొల్లూరి భారతదేశ ప్రథమ ప్రధానమంత్రి పండిట్ జవహర్ లాల్ నెహ్రూ జాతీయ స్మారక పురస్కారం ప్రతిష్టాత్మక అవార్డ్ అందుకోనున్నారు. ఈ సందర్భంగా ఆంధ్రప్రదేశ్ ఆర్యవైశ్య మహాసభ కృష్ణాజిల్లా ఆర్యవైశ్య సంఘం పెడన మండల ఆర్యవైశ్య సంఘం పెడన పట్టణ ఆర్యవైశ్య సంఘం ఆర్యవైశ్య యువజన సంఘం శ్రీ వాసవి మహిళా మండలి కేసిజిఎఫ్ వాసవి క్లబ్ పొట్టి శ్రీరాములు పెడన తదితర స్వచ్ఛంద సేవా ప్రతినిధులతో పాటు పట్టణ పుర ప్రముఖులు పలువురు డా. కొల్లూరి కి అభినందనలు తెలియజేశారు.

## టీబీ రహిత భారత్ కు ప్రజలందరు సహకరించాలి- వైద్యాధికారి సాయి సందీప్..



**కృతివెన్ను ఆగస్టు 21 :(వార్తా ప్రభ ప్రతినిధి)** టీబీ రహిత భారత్ ను నిర్మించడానికి ప్రజలందరూ సహకరించాలని కృత్తివెన్ను పి హెచ్ సి మెడికల్ వైద్య అధికారి సాయి సందీప్ కోరారు. టీబీ వ్యాధి రహిత భారత్ అభియాన్ వంద రోజుల కార్యక్రమం లో భాగంగా కృతివెన్ను మండలం, ప్రాథమిక ఆరోగ్య కేంద్రం పరిధి లో ఉన్న సంచార చికిత్స (104) వాహనం మెడికల్ క్యాంప్ ఉన్నా సచివాలయం పరిధి లో గురువారం టీబీ పరీక్షలను నిర్వహించారు. సూపర్వైజర్ శివకుమార్ ఆద్వర్యంలో టీబీ లక్షణాలు ఉన్నా వాళ్ళకి తేమడ శాంపుల్ బట్టి పరీక్షలు నిర్వహిస్తున్నామని, రోజుకు పది నుంచి ఇరవై శాంపిల్స్ టెస్ట్ చేయటం జరుగుతుందన్నారు. పాఠశాల ,అంగన్వాడీ లో పబ్లిక్ లో టీబీ వ్యాధి పట్ల అవగాహన కల్పించి , లక్షణాలు ఉన్న వాళ్ళని గుర్తించి పరీక్ష చేసి మందులు ఇవ్వటం జరుగుతుందని ఈ కార్యక్రమం లో వైద్యాధికారి డా.సాయి సందీప్ మాట్లాడుతూ ఎవరికైన 14 రోజులు మించి దగ్గు జ్వరం ఆకలి తగ్గటం బరువు తగ్గటం ఆయాసంవంటివి ఉన్నవాళ్ళు కచ్చితం తేమడ పరీక్ష చేయించుకో వలని, అలసత్వం వహిస్తే వ్యాధి తీవ్రత పెరుగుతుందని తెలిపారు ఎక్కువ డయాబెటిస్ ఉన్న వాళ్ళు సిగరెట్ తాగే వాళ్ళు ,బీఎంఐ 18 కంటే తక్కువ ఉన్న వాళ్ళు ,ఇమ్యూనిటి తక్కువ ఉన్న వాళ్ళకి ఎక్కువ వీచే ప్రమాదం ఉందని లక్షణాలు ఉంటే వెంటనే తేమడ పరీక్ష చేయించుకోవాలని తెలిపారు తేమడ పరీక్ష కృతివెన్ను ప్రాథమిక ఆరోగ్య కేంద్రం లో అందుబాటు లో ఉంది అని తెలిపారు ఈ కార్యక్రమం లో పిహెచ్ఎన్ పార్వతి, హెచ్ వి పద్మావతి, ఎస్ టి ఎస్ శివకుమార్, ఎం ఎల్ హెచ్ పి బి. విజయ.ఏ ఏ న్ ఎం రజనీ మల్లేశ్వరరావు హెల్త్ అసిస్టెంట్ ఆశవర్కర్స్ 104 స్టఫ్ పాల్గొన్నారు....

## గణేష్ నవరాత్రి ఉత్సవాలు జరుపుకునే ఉత్సవ కమిటీలు ముందస్తు జాగ్రత్తలు పాటించాలి- డీఎస్పీ శ్రీనివాసరావు



**హనుమాన్ జంక్షన్, ఆగస్టు 21(వార్తాప్రభ)** గణేష్ నవరాత్రి ఉత్సవాలు జరుపుకునే ఉత్సవ కమిటీలు ముందస్తు జాగ్రత్తలు పాటించాలి జిల్లా ఎస్పీ శ్రీ ఆర్. గంగాధరరావు, ఐపిఎస్., వారి ఆదేశాలు మేరకు డీఎస్పీ శ్రీనివాసరావు వీరవల్లి పోలీస్ స్టేషన్ వద్ద మీడియా సమావేశంలో మాట్లాడుతూ. పర్యావరణ రక్షణకు నిర్వాహకులు పోలీసువారికి సహకరించాలి. ప్రజారోగ్యం మరియు భద్రత దృష్ట్యా డీజే లు, బాణాసందా పూర్తిగా నిషేదం. వాహనాల రాకపోకలకు ప్రజాజీవనానికి అంతరాయం కలిగించేలా మండపాలు రోడ్లపై ఏర్పాటు చేయొద్దు. సంభందిత శాఖల నుండి ముందస్తు అనుమతులు తప్పనిసరి. గణేష్ నవరాత్రి ఉత్సవాలు నిర్వహించుకునే నిర్వాహకులు, ప్రజలకు, ఇతరులకు ఇబ్బందులు కలగకుండా జాగ్రత్తలు పాటించాలని, త్వరలో రానున్న గణేష్ నవరాత్రి ఉత్సవాల నిర్వహణకు ఉత్సవ కమిటీలు, యువత ముందస్తు ప్రణాళిక ప్రకారం ముందుకు వెళ్లాలని భద్రత పరమైన చర్యల దృష్ట్యా పోలీసు శాఖ సూచించే నియమ నిభందనలు పాటించాలని. మట్టి గణపతి ప్రతిమను ప్రతిష్టించి పర్యావరణ పరిరక్షణకు బాధ్యతగా ఉండాలని అన్నారు. పరిసరాలు ఎప్పటికప్పుడు పరిశుభ్రంగా ఉంచుకుంటూ, అధిక శబ్దాలతో కూడిన డీజే బాక్సులు వినియోగించడం వంటివి చేయరాదని, ప్రజలకు ఇబ్బంది కలిగేలా బాణసంచా కాల్చే వద్దని సూచించారు. మండపాల ఏర్పాటుకు ముందస్తుగా అన్ని శాఖల నుండి తప్పనిసరిగా అనుమతులు తీసుకోవాలని అన్నారు. ప్రయాణికులకు, సామాన్యులకు, ఇతర మతస్తులకు ఎలాంటి ఇబ్బందులూ కలగకుండా మండపాలు ఏర్పాటు చేయడం మంచిది అని తెలిపారు. మతసామరస్యాలకు ప్రతీకగా గణేష్ ఉత్సవాలు ఉండాలని అన్నారు. మండపాల వద్ద నిబంధనలు పాటించాలి. పోలీసు అనుమతులు తీసుకోవాలని కోరారు. సోదరభావంతో అందరూ కలిసి మెలిసి ఉత్సవాలను జరుపుకోవాలని సూచించారు. జిల్లాలో గణేష్ నవరాత్రి ఉత్సవాలు పటిష్టమైన పోలీసు భద్రత ఉంటుంది. ప్రశాంత వాతావరణంలో నవరాత్రులు జరుపుకోవాలని పిలుపునిచ్చారు.

**పోలీసు సూచనలు** రోడ్లు ఆక్రమించి గణేష్ మండపాలు ఏర్పాటు చేయరాదు. ట్రాఫిక్ అంతరాయం కలిగించరాదు. డీజే ల వినియోగానికి, బాణాసంచా పేల్చుటకు కు అనుమతి లేదు. డీజే నిర్వహణకు ముందస్తు నోటీసు జారీ చేస్తున్నామన్నారు. మండపాల వద్ద మరియు ఊరేగింపు సమయంలో భక్తి సంబంధిత పాటలు మాత్రమే ప్రసారం చేయాలి. మండపాలు ఏర్పాటు చేసే స్థలం పబ్లిక్ స్థలం అయితే సంబంధిత గ్రామ పంచాయితీ, మున్సిపాలిటీ అనుమతి పత్రం తీసుకోవాలి. ప్రవేట్ వ్యక్తుల స్థలం అయితే స్థల యజమాని అనుమతి పత్రం తీసుకోవాలి. ఉత్సవాలు ముగిసే వరకు ఉత్సవ కమిటీ సభ్యులు 24 గంటలు మండపాల వద్ద అందుబాటులో ఉండాలి. మండపాల వద్ద సిసి కెమెరాలు అమర్చాలి. విద్యుత్ శాఖ అనుమతి ఉండాలి. ఇతరులను రెచ్చగొట్టి విదంగా వివాదాస్పదంగా మండపాల వద్ద ప్రసంగాలు చేయరాదు. నిబంధనలు పాటించకపోయిన లేదా ఎలాంటి అవాంచనీయ సంఘటనలు జరిగినా అనుమతి కోరిన అర్జీదారులు, ఉత్సవకమిటీ సభ్యులే పూర్తి బాధ్యత వహించాలి. ఈ కార్యక్రమం హనుమాన్ జంక్షన్ సిఐ సత్యనారాయణ వీరవల్లి ఎస్ఐ శ్రీనివాస్, హనుమాన్ జంక్షన్ ఎస్సై సురేష్ కుమార్, ఆత్కూరు ఎస్సై సురేష్, ట్రైనింగ్ ఎస్సై ప్రశాంతి, పలు గ్రామాల నుండి గుడి నిర్వాహకులు, కమిటీ పెద్దలు మరియు ప్రజలు పాల్గొన్నారు..

## బుడమేరు పరిశీలించిన మున్సిపల్ చైర్మన్



**ఇబ్రహీంపట్నం, ఆగస్టు 21(వార్తా ప్రభ ప్రతినిధి):** కొండపల్లి శాంతినగర్ వద్ద బుడమేరు కట్ట రిటైనింగ్ వాల్ ను పరిశీలించారు కొండపల్లి మున్సిపల్ చైర్మన్ చెన్నుబోయిన చిట్టిబాబు. గురువారం స్థానిక నాయకులు మరియు అధికారులతో కలిసి బుడమేర కట్టను పరిశీలించారు. రిటైనింగ్ వాల్,గతంలో పూడ్చిన గళ్ళు, వరద ముప్పుపై అధికారులను ఆరా తీశారు. ప్రస్తుతం ముడమేరు కట్ట వలన ఎలాంటి ప్రమాదం, వరద వచ్చే పరిస్థితి కూడా లేదని అధికారులు ఆయనకు వివరించారు. అప్రమత్తంగా ఉండాలని ఎప్పటికప్పుడు, వరద పై సమీక్షించాలని అధికారులకు సూచించారు చైర్మన్. ఈ కార్యక్రమంలో వైస్ చైర్మన్ చుట్టుకుదురు శ్రీనివాస్, స్థానిక టిడిపి నాయకులు పాల్గొన్నారు.

## నగరాల కార్పొరేషన్ చైర్మన్ ను అభినందించిన ఎమ్మెల్యే కార్యాలయ కార్యదర్శి ప్రత్తిపాటి శ్రీధర్





**విజయవాడ పశ్చిమ ఆగస్టు 21 :(వార్తా ప్రభ ప్రతినిధి)** కూటమి నేతలు నగరాల అభివృద్ధి కార్పొరేషన్ చైర్మన్ గా నియమితులైన మరుపిళ్ళ తిరుమలేశ్వర రావు ను ఎమ్మెల్యే కార్యాలయ కార్యదర్శి ప్రత్తిపాటి శ్రీధర్, బీజేపీ కార్పొరేటర్ బుల్లా విజయ్ కుమార్, మాజీ కార్పొరేటర్ యేదుపాటి రామయ్య, టీడీపీ సీనియర్ నాయకులు మైలవరపు కృష్ణ , పలువురు కూటమి నేతలు అభినందించారు. మరుపిళ్ళ తిరుమలేశ్వరరావు ఇటీవల నగరాల కార్పొరేషన్ చైర్మన్ గా నియమితులయ్యారు. గురువారం ఎన్డీఏ కార్యాలయనికి విచ్చేసిన ఆయనను పశ్చిమ ఎమ్మెల్యే కార్యాలయ కార్యదర్శి ప్రత్తిపాటి శ్రీధర్, కార్పొరేటర్లు కూటమి నేతలతో కలిసి అభినందించి శాలువాతో సత్కరించారు . ఈ సందర్భంగా మరుపిళ్ళ తిరుమలేష్ మాట్లాడుతూ అధిష్టానం తనపై ఉంచిన నమ్మకాన్ని వమ్ము చేయకుండా పనిచేస్తానని తెలిపారు.. సుజనా మిత్రా కోఆర్డినేటర్లు తిరుమలేష్ కు శుభాకాంక్షలు తెలిపారు..

## టోల్ ప్లాజాల వద్ద ద్విచక్ర వాహనదారుల నుంచి రుసుము వసూలు..?

### నకిలీ వార్తలపై కేంద్రం స్పష్టీకరణ




**న్యూ ఢిల్లీ (పి.టి.ఐ.),** జాతీయ రహదారులపైనున్న టోల్ ప్లాజాల వద్ద ద్విచక్ర వాహనదారుల నుంచి టోల్ ఫీజు వసూలుకు సంబంధించి సోషల్ మీడియాలో ప్రచారమవుతున్న తప్పుడు వార్తలపై కేంద్రం స్పందించింది. ద్విచక్ర వాహనదారుల నుంచి ఎలాంటి రుసుము వసూలు చేయడం లేదని జాతీయ రహదారుల అధికార సంస్థ(ఎన్హెచ్ఏఐ) స్పష్టం చేసింది. జాతీయ రహదారి రుసుము (ధరలు, వసూలు నిర్ణయం) నియమాలు-2008 చట్టం ప్రకారం జాతీయ రహదారులపై వినియోగదారుల రుసుము వసూలు చేస్తారని తెలిపింది. అయితే ద్విచక్ర వాహనదారుల నుంచి టోల్ రుసుము వసూలు చేసే ప్రతిపాదనేది లేదని పేర్కొంది. నిబంధనల ప్రకారం, టోల్ ప్లాజాల మీదుగా వెళ్తున్న నాలుగు లేదా అంతకంటే ఎక్కువ చక్రాల వాహనాల నుంచి మాత్రమే వినియోగదారు రుసుము వసూలు చేస్తారని తెలిపింది. వీటిలో కారు, జీప్, వ్యాన్, తేలికపాటి మోటర్ వాహనాలు లేదా తక్కువ బరువు సరుకులను తీసుకెళ్లే వాహనాలు, మినీ బస్సు లేదా ట్రక్కు, నిర్మాణ పనుల కోసం ఉపయోగించే భారీ వాహనాలు, భూమిని తవ్వడం, తరలించడానికి ఉపయోగించే వాహనాలు, మూడు నుంచి ఆరు టైర్లు కలిగిన వాహనాలు, అతి భారీ వాహనాలు (ఏడు లేదా అంతకంటే ఎక్కువ టైర్లు) వంటివి ఉన్నాయి.

## తెలుగు భాషా సంఘానికి మండలి కృష్ణారావు పేరు ఆమోదించటం పై కూటమి శ్రేణులు హర్షం



**కోడూరు, ఆగస్టు 21 (వార్తా ప్రభ) :**రాష్ట్ర అధికారిక భాష కమిషన్ పేరును మండలి వెంకటకృష్ణారావు అధికారిక భాష కమిషన్ గా మార్చేందుకు మంత్రివర్గం ఆమోదం తెలపడంపై కోడూరు మండల కూటమి శ్రేణులు హర్షం వ్యక్తం చేశారు. గురువారం కోడూరు ప్రధాన సెంటర్లోని మండలి వెంకట కృష్ణారావు విగ్రహానికి పూలమాలలు వేసి ఘన నివాళులర్పించారు. ఉమ్మడి రాష్ట్ర మాజీ మంత్రి, దివిసీమ పునర్నిర్మాత, దివిసీమ గాంధీ, తెలుగు జాతిరత్నం, ప్రపంచ తెలుగు మహాసభల నిర్వాహుకులు మండలి వెంకట కృష్ణారావు తగిన ఖ్యాతిని ఇనుప దింప చేసిన రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబు, ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ కు ప్రత్యేక కృతజ్ఞతలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో పెద్ద ఎత్తున కోడూరు మండల కూటమి నేతలు పాల్గొన్నారు.

## విజనరీ సీఎం చంద్రబాబు నాయకత్వంలో..

# డిజిటలైజేషన్లో దూసుకుపోతున్న ఏ.పీ : ఎమ్మెల్యే రాము

● విశాఖలో సైబర్ సెక్యూరిటీ సమ్మిట్ లో పాల్గొని ప్రసంగించిన ఎమ్మెల్యే వెనిగండ్ల రాము.. ● లోకేష్ నాయకత్వంలో అభివృద్ధి పథాన ఐటీ రంగం.. ● డిజిటల్ పీపుల్ సర్వీసులో తొలి స్థానంలో ఏపీ.. ● డిజిటల్ యుగంలో సైబర్ సెక్యూరిటీ అత్యంత కీలకం..







**విశాఖపట్నం/గుడివాడ,ఆగష్టు 21 (వార్తాప్రభ) :** విజనరీ సీఎం చంద్రబాబు నాయకత్వం, మంత్రి నారా లోకేష్ ఆధ్వర్యంలో ఆంధ్రప్రదేశ్ డిజిటలైజేషన్, ఐటీ రంగాల్లో దూసుకుపోతుందనీ ఎమ్మెల్యే వెనిగండ్ల రాము అన్నారు. డిజిటల్ పీపుల్ సర్వీసులో ఇప్పటికే ఏపీ దేశంలోనే తొలి స్థానంలో ఉందన్నారు. విశాఖపట్నంలోని ఫెయిర్ ఫీల్డ్ బై మారియట్ హోటల్లో సైబర్ సెక్యూర్ ఆంధ్ర – 2025 సమ్మిట్ గురువారం ఉదయం జరిగింది. కాన్ఫడరేషన్ ఆఫ్ ఇండియన్ ఇండస్ట్రీ (సి.ఐ.ఐ) ఆధ్వర్యంలో జరిగిన సమ్మిట్ లో విశాఖపట్నం కలెక్టర్ హరేంద్ర ప్రసాద్, కమిషనర్ ఆఫ్ పోలీస్ విశాఖపట్నం బాచి, సైబర్ సెక్యూరిటీ నిపుణులతో కలిసి ఎమ్మెల్యే రాము పాల్గొన్నారు. ఈ సమ్మిట్లో సెక్యూరింగ్ ఆంధ్ర డిజిటల్ బ్యాక్ బోన్, ఇంజనీరింగ్ ట్రస్ట్ ఇండియన్ ఏజ్ ఆఫ్ సైబరిష్ తదితర సైబర్ సెక్యూరిటీ అంశాలపై చర్చ జరిగింది. ఎమ్మెల్యే రాముతో పాటుగా, నిపుణులు, అంతర్జాతీయ సంస్థల ప్రతినిధులు పలు అంశాలపై చర్చించుకొని ప్రజలు సైబర్ దాడుల బారిన పడకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలపై ప్రసంగించారు. కాన్ఫరెన్స్ లో ఎమ్మెల్యే వెనిగండ్ల రాము మాట్లాడారు. సిఐఐ ఆధ్వర్యంలో జరుగుతున్న సైబర్ సెక్యూరిటీ కాన్ఫరెన్స్ లో, పలు నిష్టాత కంపెనీల ప్రతినిధులతో కలిసి పాల్గొనడం సంతోషకరమన్నారు. ఆంధ్రప్రదేశ్ డిజిటలైజేషన్లో దూసుకుపోతున్న తరుణాన.. సైబర్ సెక్యూరిటీ అనేది ప్రధానమైన విభాగమన్నారు. సీఎం చంద్రబాబు, మంత్రి లోకేష్ నాయకత్వాన డిజిటలైజేషన్, ఐటీ రంగాల్లో ఆంధ్రప్రదేశ్ అగ్ర పదాన నిలుస్తుందన్నారు. ఇప్పటికే ఆంధ్రప్రదేశ్లో కూటమి ప్రభుత్వం వాట్సాప్ గవర్నెన్స్ పేరుతో 700 పైగా సేవలను అందిస్తూ.. పీపుల్ సర్వీస్లో తొలి స్థానంలో ఉందన్నారు. డిజిటల్ సేవలను ముందుకు తీసుకెళ్తూ.. పేపర్ లెస్ పాలన అందించేలా కూటమి ప్రభుత్వం చర్యలు తీసుకుంటుందన్నారు. ఇలాంటి సమయంలో సైబర్ సెక్యూరిటీ అనేది అత్యంత కీలకమైన విభాగమన్నారు. సైబర్ డేటా తప్పుడు వ్యక్తుల చేతుల్లోకి వెళితే జరిగే నష్టాన్ని కొన్ని రోజులుగా చూస్తున్నట్లు ఎమ్మెల్యే రాము పేర్కొన్నారు. నేడు దేశంలో సాధారణ ప్రజల నుండి గ్లోబల్ కంపెనీల వరకు సైబర్ దాడుల బారిన పడుతున్నాయని, ఓటిపి, ఈ కేవైసీ పేర్లతో జరిగే మోసాలను అరికట్టేందుకె గ్లోబల్ సంస్థలను ఒకచోటకు చేర్చి పరిష్కార మార్గాలపై చర్చించినట్లు పేర్కొన్నారు. సైబర్ నిపుణులతో పాటుగా, కాంటం వ్యాలీ, ఐబీఎం, రుద్ర, ఇన్ఫోసిస్, అనేక గ్లోబల్ సంస్థల సైబర్ సెక్యూరిటీ ప్రతినిధులు పాల్గొన్న సమావేశంలో అనేక విషయాలను నేర్చుకున్నట్లు ఎమ్మెల్యే రాము తెలిపారు. ఈ కాన్ఫరెన్స్ లో ఐబీమ్, డిలైట్, ఇన్ఫోసిస్, అనేక జాతీయ అంతర్జాతీయ సంస్థల ప్రతినిధులు, సైబర్ సెక్యూరిటీ నిపుణులు, తదితరులు పాల్గొన్నారు.

## అద్భుతమైన విశాఖ నగరంలో మరో అద్భుతమైన వేడుకగా గణేష్ నవరాత్రులు

● లక్ష చీరలతో వినాయక ప్రతిరూపాన్ని ఏర్పాటు చేసి గణపతి ఉత్సవాలు చేయడం అద్భుతం.. ఎమ్మెల్యే వెనిగండ్ల

గాజువాకలో ఎస్వీ ఎంటర్టైన్మెంట్స్ ఆధ్వర్యంలో జరుగుతున్న గణేష్ మండపనిర్మాణ ఏర్పాట్లు సందర్శించిన ఎమ్మెల్యే రాము..

**విశాఖపట్నం/గుడివాడ,ఆగష్టు 21 (వార్తాప్రభ) :** విశాఖ జిల్లా గాజువాక లంక మైదానంలో ఏర్పాటు చేసిన శ్రీ సుందర వస్త్ర గణపతి మండపాన్ని గుడివాడ శాసనసభ్యులు వెనిగండ్ల రాము సందర్శించారు. మండపం ప్రాంగణానికి విచ్చేసిన ఎమ్మెల్యే రాముకు ఎస్వి ఎంటర్టైన్మెంట్స్ నిర్వాహకులు గణేష్, టిడిపి నాయకులు చట్టి గోపి, బలగం బాలు నాయుడు, ఘన స్వాగతం పలికారు. అనంతరం శాసనసభ్యులు రాము మాట్లాడుతూ లక్ష చీరలతో మహాగణపతిని ఏర్పాటు చేయటం అద్భుతం అంటూ కొనియాడారు. 21 రోజుల పూజ అనంతరం ఆ చీరలను భక్తులకు అందజేయడం మంచి ఆలోచన అంటూ నిర్వాహకులు ఎస్వీ ఎంటర్టైన్మెంట్స్ వారిని అభినందించారు. మహాగణపతి ఉత్సవాలలో ప్రతి ఒక్కరు తప్పకుండా కుటుంబ సమేతంగా విచ్చేసి స్వామివారిని దర్శించుకోవాలని కోరారు. మా సోదరుడు గాజువాక శాసనసభ్యులు పల్ల శ్రీనివాస్ నియోజకవర్గంలో ఇంతటి అద్భుతంగా గణేష్ నవరాత్రి వేడుకలు నిర్వహించడం సంతోషాన్ని కలిగిస్తుంది.

## గుడివాడ ఇంజనీరింగ్ కళాశాలలో యాంటీ డ్రగ్స్ యాంటీ ర్యాగింగ్లపై అవగాహన సదస్సు..

**గుడివాడ,ఆగష్టు 21 (వార్తాప్రభ) :** స్థానిక వీ.కే.ఆర్, వీ.యన్.బి. అండ్ ఏ.జీ.కె కాలేజ్ ఆఫ్ ఇంజనీరింగ్ లో గురువారం బీ.టెక్ విద్యార్థులకు గుడివాడ పోలీసు శాఖ వారు ర్యాగింగ్ పై అవగాహనా సదస్సును నిర్వహించారు. ముఖ్య అతిధి మరియు వక్తగా విచ్చేసిన గుడివాడ డీ.ఎస్.పి వి.ధీరజ్ వినీల్ విద్యార్థులకు ర్యాగింగ్ యొక్క అనర్థాలను గూర్చి వివరించారు. కళాశాలలో ర్యాగింగ్ పేరిట తోటి విద్యార్థులను మానసికంగా లేక శారీరకంగా వేధించడం జరిగితే అట్టి విద్యార్థులు చట్టరీత్యా శిక్షకు పాత్రులగుదురని అన్నారు. విద్యార్థులు మాదక ద్రవ్యాలకు బానిసలు కాగూడదన్నారు. సర్కిల్ ఇన్స్పెక్టర్ కె.శ్రీనివాస్ మాట్లాడుతూ ప్రతి విద్యార్థి తమ బంగారు భవిష్యత్ ను దృష్టిలో ఉంచుకుని అనైతికమైన ర్యాగింగ్ కు దూరంగా వుండాలని ఉద్బోధించారు. కళాశాల సెక్రటరీ మరియు కరస్పాండెంట్ వేములపల్లి కోదండ రామయ్య తమ కళాశాలలో ర్యాగింగ్ పూర్తిగా నిషిద్ధమని తెలిపారు. ప్రిన్సిపాల్ డా. ఎస్.హెచ్.వి.ప్రసాద రావు మాట్లాడుతూ తమ కళాశాల లోని యాంటీ–ర్యాగింగ్ కమిటీ ద్వారా విశ్వవిద్యాలయ నిభందనల మేరకు పోలీసు శాఖ వారితో అవగాహనా సదస్సులను తరచూ



ఏర్పాటు చేస్తూ క్యాంపస్ లో "నో–ర్యాగింగ్" మరియు "సే 'నో' టు డ్రగ్స్" సైన్ బోర్డ్ లను ఏర్పాటు చెయ్యడం జరిగిందన్నారు. కార్యక్రమంలో అకడమిక్ డైరెక్టర్ మరియు డీన్ బి.కళ్యాణ్ కుమార్, వివిధ విభాగాధిపతులు, ఎన్.ఎస్.ఎస్ ప్రోగ్రామ్ ఆఫీసర్ డి.దిలీప్, ఎన్.ఎస్.ఎస్. వాలంటీర్లు, అధ్యాపకులు మరియు విద్యార్థులు పాల్గొన్నారు.

## ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో విద్యార్థుల నిరసన ప్రదర్శన




**గుడివాడ,ఆగష్టు 21 (వార్తాప్రభ) :** రాష్ట్ర ప్రభుత్వం విద్యార్థుల సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో విద్యార్థులు గుడివాడ ఆర్డిఓ కార్యాలయం వద్ద నిరసన నిర్వహించారు. అనంతరం ఆర్డిఓ బాలసుబ్రమణ్యం కు వినతి పత్రం అందించారు. ప్రభుత్వం విద్యార్థులకు అందిస్తున్న మెస్ చార్జీలు పెంచాలని, గత ప్రభుత్వం బకాయి పడ్డ 6,400 కోట్ల రూపాయలను విద్యార్థులకు అందించాలని, సంక్షేమ హాస్టల్స్ కు సంత భవనాలు కేటాయించాలని ఈ సందర్భంగా ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి సమరం డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ మండల కార్యదర్శి నాగేంద్ర, పలువురు ఎస్ఎఫ్ఐ నాయకులు మరియు విద్యార్థులు పాల్గొన్నారు.




గుడివాడ నియోజకవర్గం బొమ్మలూరు గ్రామంలో పెలికాన్ హాస్పిటల్ వారి ఉచిత మెడికల్ క్యాంపు నిర్వహిస్తున్న దృశ్యం.. తొలుత ముఖ్య అతిథిగా ఎక్స్ పి సి చైర్మన్ గుత్తా శివరామకృష్ణ (చంటి) పాల్గొని కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో బొమ్మలూరు పరిసర ప్రాంత గ్రామ ప్రజలు అందరూ పాల్గొని మెడికల్ క్యాంపుని సద్వినియోగం చేసుకున్నారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ జి భార్గవి డాక్టర్ సుమన్త డాక్టర్ కొండలమ్మ డాక్టర్ వాణి వీఆర్వో కొలుసు నాగరాజు మేనేజర్ రాజు తదితరులు పాల్గొన్నారు.
–గుడివాడ,ఆగష్టు 21 (వార్తాప్రభ) :

## నూతన ఎక్సైజ్ బార్ పాలసీకి దరఖాస్తుల స్వీకరణ

-ఆన్లైన్ ఆఫ్లైన్ లేదా హైబ్రిడ్ మోడల్ లో దరఖాస్తు..



**గుడివాడ,ఆగష్టు 21 (వార్తాప్రభ) :** ప్రోహిబిషన్ అండ్ ఎక్సైజ్ స్టేషన్ నందు విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో ప్రోహిబిషన్ & ఎక్సైజ్ సర్కిల్ ఇన్స్పెక్టర్ పి. వెంకటరమణ మాట్లాడుతూ.. ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ నూతన ఎక్సైజ్ బార్ పాలసీలో భాగంగా 2025 –28 సంవత్సరాలకు గాను ఉత్తర్వులు జారీ చేసింది. ఇందులో భాగంగా గుడివాడ ఎక్సైజ్ స్టేషన్ పరిధిలోని గుడివాడ టౌన్ మున్సిపాలిటీ లోని 10, బార్లు మరియు 01, బార్ గౌడ కులస్తులకు కేటాయించడంతో మొత్తం 11 బార్లకు గెజిట్ నోటిఫికేషన్ ఇవ్వడం జరిగింది. దరఖాస్తుదారులు ఆన్లైన్ ఆఫ్లైన్ లేదా హైబ్రిడ్ మోడల్ లో దరఖాస్తు చేసుకోవచ్చును. ప్రతి దరఖాస్తుకు నాన్ రిఫండెబుల్ రుసుము క్రింద 5, లక్షలు మరియు అప్లికేషన్ ఫీజు 10,000 చెల్లించాలి. ఒక బార్ కి 4 అప్లికేషన్ తప్పనిసరిగా వస్తేనే డ్రా తీయడం జరుగుతుందని దరఖాస్తుల స్వీకరణ ఈనెల 18వ తేదీ నుండి 28వ తేదీ వరకు 10 బార్లకు మాత్రమే స్వీకరిస్తారు. మరియు గౌడ కులస్తులకు చెందిన బార్ ఈనెల 29వ తేదీ వరకు స్వీకరించి 30వ తేదీన డ్రా తీసి బార్ లు కేటాయిస్తారని బార్ల సమయం ఉదయం 10 గంటల నుండి రాత్రి 12 గంటల వరకు తీసి ఉంచబడును కావున ఆసక్తి గల అర్హుల నుండి దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు వెంకటరమణ పేర్కొన్నారు.

## అనధికార లేఔట్ల క్రమబద్ధీకరణకు మరో అవకాశం



**నందిగామ,ఆగష్టు 21 (వార్తాప్రభ) :** అనధికార లేఔట్లకు ప్లాట్లకు చట్టబద్ధత గుర్తింపు పొందేటందుకు రాష్ట్ర ప్రభుత్వం కల్పించిన అవకాశాన్ని ప్లాట్ల యజమానులు,అభివృద్ధి దారులు వినియోగించుకోవలసినదిగా మున్సిపల్ కమిషనర్ జి లోవరాజు ఓ ప్రకటనలో కోరారు. గురువారం మున్సిపల్ కార్యాలయం నుండి విడుదలైన ప్రకటనలో జీవో నెంబర్ 134 కొన్ని సవరణలతో మళ్లీ అమలులోకి వచ్చిందని పేర్కొన్నారు. ఈ అవకాశాన్ని ఉపయోగించుకొని 14% పెనాల్టీ చార్జీలలో 50% వరకు రాయితీని పొందగలరని ఆయన ప్రకటనల ద్వారా తెలిపారు. అనధికార లేఔట్లకు ఏ విధమైనటువంటి మునిసిపల్ ప్రభుత్వ సేవలు ఉండవని ఈ సందర్భంగా కమిషనర్ ప్రకటనలో స్పష్టం చేశారు.

## సివిల్ సర్వీసెస్‌లో విజయం సాధించేందుకు క్రమశిక్షణ, పట్టుదల అత్యవసరం

–విశాఖ పోలీస్ కమిషనర్ డా. శంక బ్రత బాగ్చీ




**విశాఖపట్నం,ఆగష్టు 21 (వార్తాప్రభ) :** సివిల్ సర్వీసెస్‌లో విజయానికి క్రమశిక్షణ, పట్టుదల, నిరంతర కృషి నిజమైన మూల సూత్రాలని విశాఖపట్నం పోలీస్ కమిషనర్ డాక్టర్ శంక బ్రత బాగ్చీ అన్నారు. డాక్టర్ ఎల్. బుల్లయ్య కళాశాలలో "డిగ్రీ విత్ ఐఏఎస్ ప్రోగ్రాం" ను గురువారం కమీషనర్ ప్రారంభించారు. తక్షశిల ఐఏఎస్ అకాడమీ సహకారంతో రూపుదిద్దుకున్న ఈ కార్యక్రమం ద్వారా డిగ్రీ చదువుతోపాటు ఐఏఎస్ కోచింగ్ పొందే అవకాశం విద్యార్థులకు లభించనుంది. డా. బాగ్చీ మాట్లాడుతూ విద్యార్థులు ఉన్నత లక్ష్యాలను ఏర్పరుచుకొని నిజాయితీతో కృషి చేయాలని సూచించారు. జీవితంలో ఎదురయ్యే సవాళ్లను అవకాశాలుగా మలుచుకోవాలని, దేశ పురోగతిలో సివిల్ సర్వెంట్లు కీలక పాత్ర పోషిస్తారని ఆయన పేర్కొన్నారు. తక్షశిల ఐఏఎస్ అకాడమీ ఈ దిశగా చేస్తున్న కృషి అభినందనీయమన్నారు. ఎల్. బి. కళాశాల కార్యదర్శి డాక్టర్ జి. మధు కుమార్ మాట్లాడుతూ, కళాశాల ఎల్లప్పుడూ వినూత్న విద్యా కార్యక్రమాలను ముందుకు తెచ్చిందని తెలిపారు. తక్షశిలతో ఈ కొత్త భాగస్వామ్యం కళాశాల ప్రతిష్టను మరింత పెంపొందించడమే కాకుండా విద్యార్థులకు సాంప్రదాయ మార్గాలను మించి సరికొత్త అవకాశాల వైపుకు ప్రోత్సహిస్తుందన్నారు. తక్షశిల ఏఎస్ అకాడమీ మేనేజింగ్ డైరెక్టర్ బి.ఎస్.ఎన్. దుర్గాప్రసాద్ మాట్లాడుతూ, అనేకమంది విద్యార్థులకు ఐఏఎస్, ఐపీఎస్ అవ్వడం ఓ కలగా మారిందని, దీనిని అధిగమించే ప్రయత్నమే డిగ్రీ విత్ ఐఏఎస్ కార్యక్రమమని తెలిపారు. పాఠ్యక్రమం ద్వారా డిగ్రీ చదువుతోపాటు యూపీఎస్సీకి సన్నద్ధమవ్వొచ్చని చెప్పారు. దీని వల్ల సమయం ఆదా అవటమే కాక, మంచి విషయ పరిజ్ఞానం అలవడుతుందన్నారు, విశ్లేషణా నైపుణ్యాలు అభివృద్ధి చెందుతాయని, ఈ విధానం ద్వారా మూడు సంవత్సరాల్లోనే సివిల్ సర్వీసెస్ పరీక్షలో విజయం సాధించే అవకాశాలను మెరుగవుతాయన్నారు . మరోవైపు, మరో వందకు పైగా పోటీ పరీక్షల్లో కూడా రాణించేందుకు విద్యార్థులను తీర్చిదిద్దుతుందని తక్షశిల ఏఎస్ అకాడమీ మేనేజింగ్ డైరెక్టర్ బి.ఎస్.ఎన్. దుర్గాప్రసాద్ వివరించారు. తక్షశిల అకాడమీ చీఫ్ మెంటార్ డా. వరుణ్ దేవ్ మాట్లాడుతూ, ఈ కార్యక్రమం విద్యా రంగంలో ఒక మైలురాయిగా నిలుస్తుందన్నారు. సరైన శిక్షణ, మార్గదర్శకత్వం, పోటీ స్ఫూర్తి ద్వారా యువతను తీర్చిదిద్దడం అకాడమీ లక్ష్యమన్నారు. విద్యార్థులు, అధ్యాపకులు ఉత్సాహంగా పాల్గొన్న ఈ కార్యక్రమం, విశాఖ విద్యా వ్యవస్థలో ఒక ముఖ్యమైన మైలురాయిగా నిలిచింది. కార్యక్రమంలో తక్షశిల అకాడమీ డైరెక్టర్ జి. సాయి రామ్ తదితరులు పాల్గొన్నారు.

# సూపర్ సిక్స్ లో ఆడబిడ్డ నిధి అటకెక్కించారు..

● కూటమి ప్రభుత్వం వైఖరిని మహిళలు ప్రశ్నించండి ● గన్నవరం జెడ్పీటీసీ అన్నవరపు ఎలిజబెత్ రాణి.



**గన్నవరం,ఆగష్టు 21 (వార్తాప్రభ) :** సూపర్ సిక్స్‌లో భాగంగా ఆడబిడ్డ నిధి పేరుతో 18 ఏళ్లు నిండిన ప్రతి మహిళకు నెలకు రూ.1500 చొప్పున ఇస్తామని చెప్పి అధికారంలోకి వచ్చారు. 14 నెలలు గడిచినా ఈ హామీని అమలు చేయకుండా అటకెక్కించారు.ఈ ఒక్క పథకం ద్వారానే ఏకంగా 2 కోట్ల మంది మహిళలను కూటమి ప్రభుత్వం దారుణంగా నయా వంచన చేసిందని రాష్ట్రం లోని మహిళలందరూ కూటమి ప్రభుత్వాన్ని ప్రశ్నించండని గన్నవరం జెడ్పీటీసీ అన్నవరపు ఎలిజబెత్ రాణి పిలుపు నిచ్చారు.ఆమె మాట్లాడుతూ ఎన్నికల ముందు సూపర్‌సిక్స్‌లో ఆర్భాటంగా ప్రచారం చేసి ఇప్పుడు ఆ ఊసే ఎత్తకుండా ఉన్నా కూటమి ప్రభుత్వం రాష్ట్ర మహిళలను వంచన చేయటం కదా అని ఆమె ప్రశ్నించారు.కూటమి నాయకులు గత ఎన్నికలలో ప్రతి ఇంటికి వెళ్ళి మహిళ కనపడితే చాలు నీకు నెలకు రూ,1500 లు అని ప్రచారం చేశారా..? లేదా..? అని అడుగుతున్నాను అని అన్నారు.ఎప్పుడూ ఇస్తారో కూడా ఇప్పుడైనా చెప్పాలని డిమాండ్ చేశారు.మహిళలకు మీరు ఏ సమాదానం చెపుతారో చెప్పాలని ప్రశ్నిస్తున్నాని అన్నారు.అలాగే మహిళలకు ఉచిత బస్సు ప్రయాణంలో కూడా జిల్లాకే పరిమితం చేయటం కుట్రా కాదా,మహిళలు రాష్ట్రం లో ఎక్కడ నుండైనా బస్సులో తిరగవచ్చు అన్నారు.మరి విజయవాడ నుండి తిరుపతి అన్నవరం శ్రీశైలం,కనీసం దేవుళ్ళను దర్శించటానికి ఉచిత బస్ సౌకర్యం లేదన్నారు.నిరుద్యోగ భృతి వంటి హామీలు ఏడాది గడిచినా ఇప్పటికీ అమలు చేయలేదు. మూడు గ్యాస్ సిలిండర్ల హామీని ఒక్క సిలిండర్‌కే పరిమితం చేశారు.అమ్మవడి పథకం నేటికి సంపూర్ణంగా అందటం లేదని రోజు బాధితుల ఆవేదన చూస్తున్నామన్నారు.దివ్యాంగులు వృద్ధులుకు గతంలో వచ్చే పెన్షన్ చాలామందివి తీసి వేసారనీ, ఇది నిజంకాదా,ఇంకా మ్యానిఫెస్టోలో ప్రకటించిన 143 హామీల్లో ఒక్కటి కూడా అమలు చేయలేదు.ఇది నిజం కదా అన్నారు.అధికారంలోకి వచ్చాం కాబట్టి ప్రజలతో తమకిక పని లేదన్నట్లు దోసుకు తినటం మొదలు పెట్టారనీ, వీటిని ప్రజలతో ప్రశ్నిస్తారని వైఎస్సార్ సి పి నాయకులు, కార్యకర్తలపై అక్రమ కేసులు పెట్టి జైలుకు పంపుతున్నారని ఆమె అన్నారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చినప్పటి నుండి మహిళల మీద దాడులు అత్యాచారాలు జరగని రోజు అంటూ లేదనీ, అధికార పార్టీ యం ఎల్ ఏ లు కొందరు వేదింపులు వలన రక్షణ లేకుండాపోయిందన్నారు. హోంమంత్రి మహిళ అయిన కంట్రోలు చేసే పరిస్థితి కనపడటం లేదనీ,ఇప్పటి వరకు సంపద సృష్టించలేదన్నారు. ఉద్యోగాలుకల్పించలేదనీ,ప్రజలను మోసపు మాటలు, వాగ్దానాలతో అధికారంలోకి వచ్చారన్నారు.ప్రజలందరూ రాజకీయాలతో సంబంధం లేకుండా కూటమి నాయకులను ప్రశ్నించాలని ఆమే విజ్ఞప్తి చేశారు.

## రైతులకు నడకదారి ఏర్పాటుచేసిన లంక లితీష్





**మైలవరం,ఆగష్టు 21 (వార్తాప్రభ) :** స్థానిక శాసనసభ్యులు వసంత వెంకట కృష్ణ ప్రసాదు సూచనల మేరకు తెలుగు యువత అధ్యక్షుడు లంక లితీష్ మైలవరం గ్రామంలోని నారాయణ నగర్ నందు రైతులు వ్యవసాయ పనులు నిమిత్తం వాగుజాలు నుంచి నడిచేందుకు వీలుగా దారి ఏర్పాటు చేశారు.గత కొన్ని రోజులు గా కురుస్తున్న వర్షాలకు నారాయణ నగర్ లోని వాగజాలు కొట్టుకుపోవడంతో పొలాలు వెళ్లేందుకు రైతులు పడుతున్న ఇబ్బందులు చూసి లితీష్ నడకదారి ఏర్పాటు చేశారు.ఈ వాగుజాలు నుంచి వ్యవసాయ పనుల నిమిత్తం ద్విచక్ర వాహనాలు, ట్రాక్టర్లపై పొలాలకు వెళ్లి రావాలంటే ఇబ్బందిగా ఉంటుందని శాశ్వత మార్గం కింద వంతెన ఏర్పాటు చేయాలని రైతులు ఎమ్మెల్యే ని కోరుతున్నారు.అలాగే వాగజాలుపై నడకదారి ఏర్పాటు చేసిన లంక లితీష్ కి రైతులు కృతజ్ఞతలు తెలిపారు.

## జాతీయ స్థాయి కరాటే పోటీలలో డా॥ కె.కె.ఆర్స్ గౌతమ్ స్కూల్ విద్యార్థుల ప్రతిభ




**గుడివాడ,ఆగష్టు 21 (వార్తాప్రభ) :** ఈనెల 17వ తేది ఆదివారం పర్వతరెడ్డి ఆనంద్ మినీ స్టేడియం, ఒంగోలు ఆంధ్రప్రదేశ్ నందు సికోకాయ్ కరాటే ఆంధ్రప్రదేశ్, స్పోర్ట్స్ కరాటే అసోసియేషన్ ఆఫ్ ప్రకాశం జిల్లా వారి అనుబంధ సంస్థ అయిన సిద్దార్థ కరాటే డో – అకాడమి వారిచే నిర్వహింపబడిన ఆల్ ఇండియా ఓపెన్ కరాటే ఛాంపియన్ షిప్ – 2025 నందు వివిధ రాష్ట్రాల నుండి సుమారు 500 మంది విద్యార్థులు పాల్గొన్నారు. అందులో గుడివాడకు చెందిన డా॥ కె. కె. ఆర్స్ గౌతమ్ స్కూల్ విద్యార్థులు ఘనమైన ప్రతిభ చాటారని డా॥ కె.కె. ఆర్ట్స్ గౌతమ్ స్కూల్ ప్రిన్సిపాల్ పి. లక్ష్మీప్రసాద్ తెలిపారు. 14 సంవత్సరముల లోపు బాలికల వ్యక్తిగత కటా విభాగములో 8వ తరగతి విద్యార్థి బి. చాతుర్య ప్రథమ స్థానం సాధించి గోల్డ్ మెడల్, మరియు 5వ తరగతి విద్యార్థి కె. ధాత్రిక ప్రథమ స్థానం సాధించి గోల్డ్ మెడల్, మరియు 5వ తరగతి విద్యార్థి ఎన్.రిషిత ద్వితీయ స్థానం సాధించి సిల్వర్ మెడల్, 6వ తరగతి విద్యార్థి ఎన్.కారుణ్య తృతీయ స్థానం సాధించి బ్రాంజ్ మెడల్ సాధించారు. గెలుపొందిన విద్యార్థులను, కోచ్ ఎన్.వెంకటేశ్వరరావు లను పాఠశాల ఆవరణలో జరిగిన సభలో ప్రిన్సిపల్స్ సత్యారామ్, లక్ష్మీప్రసాద్, జ్యోతి, ప్రశాంతి లు అభినందించారు.

## నేలకొరిగిన నేషనల్ స్టార్ వార్రే అంజిబాబు



**హనుమాన్ జంక్షన్,ఆగష్టు 21 (వార్తాప్రభ) :** హనుమాన్ జంక్షన్ లో ఒక ఆణిముత్యం రాలిపోయింది. గత 35 సంవత్సరాల జీవితగమనంలో వేలాదిమంది విద్యార్థులే అతని ఆస్తి. అతనే మాస్టర్ వర్రె అంజిబాబు, పవర్ కిక్ బాక్సింగ్ మార్షల్ ఆర్ట్స్ అకాడమీ ని స్థాపించి అహర్నిశలు కృషి చేసి జాతీయ స్థాయిలో అనేక అవార్డులు సాధించారు. అనుకోని సంఘటన అనారోగ్యంగా ఉన్న భార్య ను బుదవారం స్వగ్రామం హనుమాన్ జంక్షన్ సమీపంలోని రామన్నగూడెం తీసుకువెళ్లారు. గురువారం ఉదయం కరాటే ప్రాక్టీస్ చేస్తుండగానే ఆకస్మికంగా గుండె పోటు వచ్చింది. అది ఒక కుగ్రామం వైద్యం అందేపరిస్తితి లేదు .మరణమే శరణ్యం అయ్యింది. హనుమాన్ జంక్షన్ ప్రాంత పాటశాలల్లో అనేకమంది విద్యార్థులకు కరాటేలో కిక్ బాక్సింగ్ లో తర్ఫీదు ఇచ్చారు. జాతీయ స్థాయిలో అనేక అవార్డులు అందుకున్న అంజిబాబు మరణం ఈ ప్రాంత యువతకు తీరనిలోటు. ఆయనకు భార్య ఒక కుమారుడు కుమార్తె ఉన్నారు.సినీ నటుడు సుమన్ తన సంతాప సందేశం పంపించారు.రామన్నగూడెం లో అంత్యక్రియలు నిర్వహించారు.

## 25, 26 తేదీలలో ఎన్టీఆర్ స్టేడియం ఆధ్వర్యంలో అథెటిక్స్ క్రీడా పోటీలు..



**గుడివాడ,ఆగష్టు 21 (వార్తాప్రభ) :** ఎన్.టి.ఆర్. స్టేడియం క్రీడా క్యాలెండర్లో భాగంగా ఆగష్టు 25 మరియు 26వ తేదీలలో గుడివాడ.నియోజకవర్గంలో ఉన్న గవర్నమెంట్ మరియు ప్రైవేట్ స్కూల్సోని అండర్–14 మరియు అండర్–16 విద్యార్థిని, విద్యార్థులకు విడివిడిగా అథ్లెటిక్స్ క్రీడా పోటీలు నిర్వహించనున్నట్లు స్టేడియం కమిటీ సంయుక్త కార్యదర్శి కిలారపు రంగప్రసాద్ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ పోటీలు 100 మీటర్లు, 200 మీటర్లు, 400 మీటర్లు, 800 మీటర్లు, లాంగ్ జంప్, షాట్పుట్ మరియు డిస్కస్ త్రో క్రీడలలో నిర్వహించబడును. ఈ పోటీలలో ఒక స్కూల్ నుండి ఒక్కొక్క ఏజ్ క్యాటగిరీలో ముగ్గురిని మాత్రమే అనుమతించబడును. ఆసక్తి గల క్రీడాకారులు సంబంధిత ప్రధానోపాధ్యాయులు వారిచే స్కూల్ నుండి స్టడీ సర్టిఫికెట్ లేదా ఆధార్ జిరాక్స్ కాపీ వయసు నిర్ధారణ కొరకు సమర్పించి ఒక రోజు ముందుగా మీ పేరును నమోదు చేసుకొనవలెను. ఈ క్రీడలలో గెలుపొందిన విద్యార్థినీ, విద్యార్థులకు బహుమతి ప్రధానోత్సవం ది.29-08-2025వ తేదీన మేజర్ ధ్యాన్ చంద్ గారి జయంతి సందర్భంగా ఇవ్వబడును. పై పోటీలలో పాల్గొనదలచిన వారు మీ పేర్లను తేది 23-08-2025 సాయంత్రం 5.00 గంటలలోపు స్టేడియం ఆఫీసు నందు నమోదు చేసుకొనవలెను. ఈ పోటీలలో పాల్గొను క్రీడాకారులు 25వ తేది ఉదయం 09.00 గం॥లకు రిపోర్టు చేయవలయును. పోటీలు ఉదయం 10.00 గం॥లకు ప్రారంభమగును. ఇతర వివరముల కొరకు నెం. 7032077735 ను సంప్రదించాలనీ కోరారు.

# ఆరుపదుల వయస్సు...అయినా తగ్గేదేలే....!

**● చెట్టు ఎక్కగలను...చిగురు కోయగలను ● సీజన్లో చింతచిగురు కోసి విక్రయిస్తూ జీవనం సాగిస్తున్న ● ఒంట్లో ఓపిక ఉన్నంత కాలం శ్రమిస్తూనే ఉంటా ● వృద్ధురాలు సుఖభోగి రాజమ్మ ఆత్మస్థైర్యం చూసి మెచ్చుకోవాల్సిందే....!**



**ఆరుపదుల వయస్సు...అయినా తగ్గేదేలే... చెట్టులెక్కగలను..చిటారు కొమ్మల చిగురు కోయగలనని ఓ 60 ఏళ్ల వృద్ధురాలు ఆత్మస్థైర్యం చూస్తే ఔరా అనిపిస్తుంది.జి.కొండూరు మండల పరిధిలోని ఆత్కూరు గ్రామ శివారులో 60 సంవత్సరాల వయస్సు ఉన్న వృద్ధురాలు అలవోకగా చింతచెట్టు ఎక్కి చిగురు కోస్తూ ప్రతి ఒక్కరినీ అబ్బురపరుస్తోంది.యువకులే ఎక్కడానికి భయపడేలా ఉన్న చింతచెట్లను సైతం ఎటువంటి సాయం లేకుండా సులభంగా ఎక్కేస్తూ నేటి తరానికి ఆ వృద్ధురాలు సవాలు విసురుతుంది.ఒంట్లో ఓపిక ఉన్నంత కాలం తన పొట్ట కూటి కోసం తానే శ్రమిస్తానంటూ,సీజన్లో చింతచిగురు కోసి విక్రయిస్తూ జీవనం సాగిస్తున్న వృద్ధురాలు సుఖభోగి రాజమ్మ ఆత్మస్థైర్యాన్ని నేటి యువతరానికి ఆదర్శంగా నిలిపే ప్రయత్నంలో వార్తా ప్రభ భాగమైంది. వివరాలలోకి వెళ్తే....**

**జి.కొండూరు,ఆగష్టు 21 (వార్తాప్రభ) :** ఎన్టీఆర్ జిల్లా, జి.కొండూరు మండల పరిధిలోని కందులపాడు గ్రామానికి చెందిన సుఖభోగి రాజమ్మ(60)కు భర్త అనారోగ్యంతో రెండేళ క్రితం మృతి చెందాడు. ఈమెకు ఇదరు కుమారులు రాజమ్మ తన ఒంట్లో ఓపిక ఉన్నంత కాలం తన స్వశక్తితోనే జీవనం సాగించాలనే పట్టుదలతో తన ఇద్దరు కుమారులపై ఆధార పడకుండా తనకు వచ్చే పింఛన్తోతో పాటు సీజన్ లో పనులు చేసుకుంటూ జీవనం సాగిస్తూ ఉంటుంది.అయితే తొలకరి వర్షాలు ప్రారంభం నుంచి రాజమ్మ చింతచెట్ల నుంచి చిగురును సేకరించి విక్రయించడం జీవనోపాధిగా ఎంచుకుంది.ఇరవై ఏళ్లుగా తాను ఈ విధంగా చింత చెట్ల నుంచి చిగురును కోసి విక్రయిస్తున్నా నని రాజమ్మ చెబుతున్నారు. ప్రస్తుతం ఆరవై ఏళ్ల వయస్సులోనూ ఎంత పెద్ద చింత చెట్టు అయినా చింతచిగురును సేకరించేందుకు నిచ్చెన కానీ, ఎటువంటి తాడు సాయం కానీ లేకుండా చెట్టు ఎక్కేస్తుంది. చెట్టుపై ఒక కొమ్మ మీద నుంచి మరో కొమ్మ మీదకు సైతం వేగంగా వెళ్లడం చూస్తే కింద ఉన్న వారికి చెమటలు పట్టాల్సిందే. తనకు ఉన్న అనుభవం. తన ఒంటో ఉన్న శక్తి ఆపైన ఆ దేవుడు ఆశీస్సుల వల్లనే ఈ వయస్సులో కూడా తన కాళ్లమీద తాను నిలబడి బతకగలుగుతున్నా నని రాజమ్మ చెబుతున్న మాటలు ప్రతి ఒక్కరికీ ఆదర్శనీయం.



# స్త్రీ శక్తి ఉచిత బస్సు ప్రయాణం సూపర్ హిట్ - ఎమ్మెల్యే కాగిత కృష్ణ ప్రసాద్....





**కృత్తివెన్ను,ఆగష్టు 21 (వార్తాప్రభ) :** స్థానిక మండల పరిధిలోని కృత్తివెన్ను గ్రామంలోని టిడిపి ఆఫీసు నందు స్త్రీ శక్తి ఉచిత బస్సు ప్రయాణ కార్యక్రమంలో నియోజకవర్గ శాసనసభ్యులు కాగిత కృష్ణ ప్రసాద్ పాల్గొని ప్రసంగించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు మహిళల పక్షపాతి అని మహిళలకు ఇచ్చిన వాగ్దానాన్ని నిలబెట్టుకున్నారన్నారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వెంటనే ఈ పథకాన్ని అమలు చేయడం పట్ల ప్రజలు సంతోషం వ్యక్తం చేస్తున్నారని ఆయన తెలిపారు. ఈ పథకం రోజువారీ కూలీ పనులు, వ్యాపారాలకు వెళ్లే మహిళలకు ఎంతో ఉపయోగపడుతుందని, వారికి ఒక గొప్ప ఆర్థిక భరోసా కల్పిస్తుందని ఎమ్మెల్యే పేర్కొన్నారు. ఈ పథకం అమలుతో ప్రభుత్వానికి సుమారు 1942 కోట్ల రూపాయల అదనపు భారం పడనుందని ఆయన తెలిపారు. గత పాలనలో ప్రజల సంక్షేమాన్ని విస్మరించి, స్వార్థ రాజకీయాలకు ప్రాధాన్యత ఇచ్చారని ఆయన విమర్శించారు. ప్రస్తుతం కూటమి ప్రభుత్వం అభివృద్ధి మరియు సంక్షేమం రెండింటినీ సమానంగా దృష్టిలో ఉంచుకుని రాష్ట్రాన్ని ముందుకు నడిపిస్తుందని స్పష్టం చేశారు. నియోజకవర్గ మహిళల తరపున కూటమి ప్రభుత్వానికి కృతజ్ఞతలు తెలిపారు. ప్రజలకు ప్రభుత్వం ఎల్లప్పుడూ అండగా ఉంటుందని, వారి అభివృద్ధికి వెన్నంటి నిలబడి సహాయం చేస్తుందని ఆయన భరోసా ఇచ్చారు. ఈ పథకం ద్వారా 5 రకాల పల్లె వెలుగు, అల్ట్రా పల్లె వెలుగు, సిటీ ఆర్డినరీ, మెట్రో ఎక్స్ప్రెస్, అల్ట్రా ఎక్స్ప్రెస్ ఆర్టీసీ బస్సులలో వారు ఉచితంగా ప్రయాణించవచ్చు అన్నారు. ఈ పథకం మహిళలు, ట్రాన్స్ జెండర్ల ఆర్థిక భారాన్ని తగ్గించి, వారికి సామాజికంగా, ఆర్థికంగా ప్రోత్సాహం అందించాలనే లక్ష్యంతో ప్రారంభించబడింది. ప్రయాణ సమయంలో చూపించవలసిన గుర్తింపు కార్డులు ఆధార్ కార్డు, రేషన్ కార్డు, ఓటర్ కార్డు, పాన్ కార్డు ఏదైనా ఒకటి చూపించి మీరు ఆర్టీసీ బస్సులలో ఉచితంగా ప్రయాణం చేయవచ్చు అని ఎమ్మెల్యే కాగిత కృష్ణ ప్రసాద్ తెలిపారు. ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర పేద ప్రజలకు సూపర్ 6 లో భాగంగా సంక్షేమ పథకాలు అందిస్తున్నాము. ఉచిత గ్యాస్ సిలిండర్ పథకం అందించాము. తల్లికి వందనం పేరుతో ఇంటిలో ఎంతమంది చదువుకునే పిల్లలు ఉన్నా అంతమందికి కూడా ఒక్కొక్కరికి రూ. 13 వేలు తల్లుల ఖాతాలకు జమ చేశాము. పాఠశాలలో మెరుగైన సదుపాయాల కోసం రూ. 2 వేలు ఉపయోగిస్తున్నాము. రైతులకు ఆదుకునేందుకు కేంద్ర ప్రభుత్వ సహకారంతో అన్నదాత సుఖీభవ పథకం కింద ఆర్థిక సహాయం అందించాం. పేద ప్రజల ఆకలి తీర్చడానికి ఐదు రూపాయలకే అన్న క్యాంటీన్ ప్రారంభించాం అని ఎమ్మెల్యే కాగిత కృష్ణ ప్రసాద్ తెలియజేశారు. ఈ కార్యక్రమంలో కూటమి నాయకులు, కార్యకర్తలు, అధికారులు, భారీ సంఖ్యలో మహిళలు, గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.

## గుడిమెట్ల గ్రామాన్ని పర్యాటక కేంద్రంగా అభివృద్ధి చేయండి

**● పర్యాటక శాఖ మాత్యులు కందుల దుర్గేష్ కు వినతి**

**● ప్రభుత్వ విప్,ఎమ్మెల్యే తంగిరాల సౌమ్య**



**నందిగామ,ఆగష్టు 21 (వార్తాప్రభ) :** ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో పర్యాటక రంగాన్ని మరింత అభివృద్ధి చేసే దిశగా ప్రభుత్వం చర్యలు తీసుకుంటున్న నేపథ్యంలో ప్రభుత్వ విప్,నియోజకవర్గ ఎమ్మెల్యే తంగిరాల సౌమ్య రాష్ట్ర పర్యాటక శాఖ మంత్రి కందుల దుర్గేష్ ని కలిసి ప్రత్యేక అభ్యర్థన చేశారు. చందర్లపాడు మండలంలోని గుడిమెట్ల గ్రామాన్ని పర్యాటక కేంద్రంగా తీర్చిదిద్దేందుకు నిధులు కేటాయించాలని కోరుతూ గురువారం సచివాలయం 2వ బ్లాక్లో జరిగిన ఈ సమావేశంలో తన సిఫార్సు లేఖను మంత్రి కి అందజేశారు.గుడిమెట్ల గ్రామం చారిత్రాత్మకంగా ఎంతో విశేషతలు కలిగిన ప్రాంతమని ఎమ్మెల్యే సౌమ్య వివరించారు. ముఖ్యంగా, ద్వారక వెంకటేశ్వర స్వామి దేవాలయం నది పరివాహక ప్రాంతంలో కొండపై ఉండటం వల్ల ఇది ప్రకృతి సౌందర్యంతోపాటు ఆధ్యాత్మిక ప్రాధాన్యతను కలిగి ఉందని తెలిపారు. గ్రామంలో ఇతర చారిత్రక దేవాలయాలు కూడా ఉండటం వల్ల ఇది పర్యాటకులను ఆకర్షించే సామర్థ్యం కలిగి ఉందని పేర్కొన్నారు. “గుడిమెట్ల గ్రామాన్ని పర్యాటక కేంద్రంగా అభివృద్ధి చేయడం ద్వారా స్థానికులకు ఉపాధి అవకాశాలు పెరుగుతాయి. అలాగే రాష్ట్ర పర్యాటక రంగానికి కొత్త ఊపిరి లభిస్తుంది” అని ఎమ్మెల్యే సౌమ్య అభిప్రాయపడ్డారు. మంత్రి దుర్గేష్ ఈ అభ్యర్థనపై సానుకూలంగా స్పందిస్తూ, తగిన చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు.ఈ సమావేశం రాష్ట్రంలోని గ్రామీణ ప్రాంతాల్లో పర్యాటక అభివృద్ధిని ప్రోత్సహించే దిశగా మరో అడుగుగా చూడవచ్చు. ప్రభుత్వం ఇప్పటికే పలు చారిత్రక స్థలాలను పర్యాటక కేంద్రాలుగా మార్చేందుకు కృషి చేస్తోంది. గుడిమెట్ల గ్రామ అభివృద్ధి ప్రాజెక్టు కూడా ఇందులో భాగమవుతుందని ఆశించవచ్చు అన్నారు.

# బాబు షూరిటీ మోసం

**-గ్యారంటీ చంద్రబాబు ప్రజలకు ఇచ్చిన హామీలను నెరవేర్చలేదు**



**తిరువూరు,ఆగష్టు 21 (వార్తాప్రభ) :** తిరువూరు పట్టణం లోని 15వార్డు లో బాబు ష్యూరిటీ మోసం గ్యారంటీ కార్యక్రమం లో వార్డు కౌన్సిలర్ మోదుగు ప్రసాద్ మాట్లాడుతూ.. కూటమి ప్రభుత్వం అధికారంలోకి రావటానికి చంద్రబాబు నాయుడు సూపర్ సిక్స్ పథకాలు ప్రకటించాడు వాటిని ప్రజలకు అందిస్తాం అని చెప్పి సూపర్ సిక్స్ పథకాలు ప్రజలకు అమలు చేయకుండా ప్రజలను మోసం చేశాడు అందుకే జగన్మోహన్ రెడ్డి పిలుపుమేరకు బాబు షూరిటీ మోసం గ్యారంటీ అనే కార్యక్రమం చేపట్టి చంద్రబాబు బాబు చేసిన మోసాన్ని ప్రజల వివరించాలి ముఖ్యంగా కూటమి ప్రభుత్వంలో భాగస్వాములైన జనసేన బిజెపి పార్టీలు ఎన్నికల్లో ప్రకటించిన సూపర్ సిక్స్ పథకాల అమలు చేసే బాధ్యత మేము తీసుకుంటాం అని చెప్పి ఈరోజు కూటమి భాగస్వామ్యులైన రెండు పార్టీల నాయకులు నోరు మెదపడం లేదు తిరువూరు అభివృద్ధి ఎక్కడ కనపడటం లేదు కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి సంవత్సరం నరకాలం గడిచిపోయిన పట్టణంలో ఎక్కడ డ్రైనేజీ నిర్మించకపోవడంతో డ్రైనేజీ లేక ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు మండలంలో ఉన్న ఆయాగ్రామాలకు ప్రజలు తిరువూరురావాల్సి వస్తే రోడ్లు లేక నరకయాతన పడుతున్న మండల ప్రజలు నియోజకవర్గ హెడ్ క్వార్టర్ తిరువూరు పట్టణం మీద ఆధారపడి చుట్టూ ప్రక్కల గ్రామాల ప్రజలు పనులకు వచ్చి పని ముగించుకొని రాత్రి వేళలో వారి గ్రామాలకు వెళ్లాలంటే రోడ్లు లేక ఎప్పుడు ఎక్కడ ప్రమాదం జరిగిందో దేవుడికి తెలుసు రోడ్డుమీద పడి పెద్ద పెద్ద గోతులైన ఈ కోటను ప్రభుత్వం మరమ్మతులు చేయించలేకపోవడం ప్రజలకు శాపంగా మారింది మాటలు తప్ప అభివృద్ధి చేయడం ప్రభుత్వానికి శుద్ధ శుద్ధి లేదని మోదు ప్రసాద్ విమర్శించారు

# పోలీస్ స్టేషన్ పరిధిలో వినాయక చవితి ఉత్సవాలు నిర్వహించే కమిటీలకు సూచనలు - ఎస్ ఐ అర్జున్



**పెనుగంచిప్రోలు,ఆగష్టు 21 (వార్తాప్రభ) :** పెనుగంచిపోలు పోలీస్ స్టేషన్ల పరిధిలోని వివిధ పట్టణ/ గ్రామాలలో గణేష్ నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా ఆయా ప్రాంతాల్లో విగ్రహాలు ఏర్పాటు చేసుకుని ఉత్సవాలు నిర్వహించదలచిన వారు ముందస్తుగా కమిటీని ఏర్పాటు చేసుకోవాలి. 2)ఆ కమిటీ వారిదే పూర్తి బాధ్యత అని గుర్తించాలి. 3)పబ్లిక్ ప్రదేశా లలో విగ్రహాలు ఏర్పాటు చేయువారు సంబంధిత మున్సిపాలిటీ/ పంచాయితీ వారి అనుమతి తీసుకోవాలి. 4)సొంత స్థలాలలో గణేష్ విగ్రహాలు ఏర్పాటు చేసేవాళ్లు అట్టి స్థలానికి సంబంధించిన యజమాని అనుమతి తప్పనిసరిగా పొందవలెను. 5) విగ్రహాలు ఏర్పాటు చేయు ప్రదేశాలలో ప్రజలకు గాని ట్రాఫిక్ గాని ఎటువంటి ఆటంకాలు కలగజే యరాదు. 6)పోలీస్ స్టేషన్ ద్వారా డీఎస్పీ వద్ద అనుమతి తీసుకుని మాత్రమే మైకులు సౌండ్ బాక్స్ లు వంటివి పెట్టుకోవాలి. ప్రజలు ఎవరు ఇబ్బంది పడకుండా సౌండ్ పెట్టాలి. డీజే లు వంటి వాటికి అను మతి ఉండదనీ గమనించాలి. 7)రాత్రి 10 గంటల తర్వాత ఎటువంటి కార్యక్రమాలు నిర్వహించకూడదు. 8) మండపంలో హుండీలు విలువైన వస్తువులు పెట్టుకున్న ఎడల వాటి పూర్తి బాధ్యత కమిటీ వారే తీసుకోవాలి. విద్యుత్ కనెక్షన్ నిమిత్తం విద్యుత్ అధికారులు నుండి అనుమతులు తప్పనిసరిగా పొందాలి ఎటువంటి షార్ట్ సర్క్యూటలకు తావు ఇవ్వకుండా లైటింగ్ వంటివి పెట్టుకోవాలి. 9) ఇతర మతాల వారికి గాని ప్రార్థన మందిరాలకు గాని ఇబ్బంది కలగకుండా చూసుకోవాలి. 10)విభేదాలకు చోటు ఇవ్వకుండా శాంతి కమిటీలు ఏర్పాటు చేసుకోవాలి. 11) సాంస్కృతిక కార్యక్రమాలు పేరిట అశ్లీల నృత్యాలు రికార్డింగ్ డాన్సులు, కొజ్జా మేళములు వంటివి జరిపినట్లయితే తగిన చట్టమైన చర్యలు తీసుకొనబడును. 12) బలవంతంగా ఎవరినైనా చందాలు వసూలు చేస్తే చట్ట ప్రకారం కేసు నమోదు చేసి చర్యలు తీసుకున్న బడును. 13) మండపానికి వచ్చే భక్తులు ఇబ్బంది పడకుండా క్యూ లైన్లు బారికేళ్ళు వంటివి ముందుగానే పెట్టుకోవాలి. 14)ఎటువంటి అగ్ని ప్రమాదాలు జరగకుండా జాగ్రత్తలు తీసుకోవాలి. 15) ఊరేగింపు సమయంలో నిమజ్జనం చేయడానికి వెళ్ళు సమయంలో మద్యం వంటివి సేవించకుండా శాంతిభద్రతలు కి భంగం కలిగించడం వంటివి చేయరాదు. అటువంటివారిని గుర్తించి వారిపై తగు చర్యలు తీసుకొనబడును. 16)ఊరేగింపు తేదీ మరియు ఊరేగింపులో పెట్టదలిచిన కార్యక్రమాలు వివరాలు ముందుగానే పోలీస్ వారికి తెలియజేసి ఊరేగింపులో ఉపయోగించే వాహనాలు డ్రైవర్ల రికార్డులు ఆధార్ కాపీలు పోలీసు వారికి ఇవ్వవలెను అని పెనుగంచిప్రోలు ఎస్ ఐ అర్జున్ తెలిపారు..

## వినాయక విగ్రహాలకు అనుమతులు తప్పనిసరి : సిఐ యువకుమార్, ఎస్ ఐ శ్రీనివాస్.



**అవనిగడ్డ,ఆగష్టు 21 (వార్తాప్రభ) :** వినాయక చవితి సందర్భంగా వినాయక మండపాల ఏర్పాటుకు విగ్రహాలు ఏర్పాటు చేసే గ్రామస్తులు వినాయక కమిటీలు ప్రతి ఒక్కరూ తప్పనిసరిగా పోలీసుల అనుమతులు తీసుకోవాలని అవనిగడ్డ సీఐ జి.యువకుమార్, అవనిగడ్డ ఎస్ ఐ కె.శ్రీనివాస్ స్పష్టం చేశారు. అవనిగడ్డ పోలీస్ స్టేషన్ ఆవరణలో గురువారం జరిగిన గ్రామస్తులు, మండపాల కమిటీ నిర్వాహకులతో నిర్వహించిన సమావేశంలో వారు వినాయక విగ్రహాల ఏర్పాటుపై పలు సూచనలను ఇచ్చారు. వినాయక విగ్రహాలు ఏర్పాటు చేసే ఆయా కమిటీలు గ్రామస్తులు తప్పనిసరిగా పోలీసుల అనుమతి తీసుకోవడం వల్ల ప్రతి విగ్రహం ఏర్పాటుకు ఆన్లైన్ లో నంబర్ క్యూ ఆర్ కోడ్ ఇవ్వడం జరుగుతుందని ఆయన తెలిపారు. విగ్రహాలను ప్రభుత్వ స్థలాల్లో ఏర్పాటుచేసినయెడల గ్రామ పంచాయతీ అనుమతులు తీసుకోవాలని, ప్రవేటు స్థలాల్లో ఏర్పాటుచేస్తే సంబంధిత స్థలం యజమాని నుండి లెటర్ తీసుకోవాలని తెలిపారు. వినాయక విగ్రహాల ఏర్పాటు సమయంలో అవసరమైన భద్రతా ఏర్పాట్లను కూడా ఏర్పాటు చేసుకోవాలని ఆయా కమిటీలకు ఆయన సూచించారు. విగ్రహాల ఏర్పాటు సమయంలో విద్యుత్ వైర్లకు దగ్గరగా లేకుండా విశాలమైన ప్రదేశాలలో విగ్రహాలు ఏర్పాటు చేసుకోవాలని, కరెంటు స్తంభాల నుండి జంపర్ వేసి కరెంటును వినియోగించకూడదని, ఈ విషయంలో విద్యుత్ శాఖ ఏఈ నుండి లెటర్ తీసుకోవాలని సూచించారు. వినాయక చవితి సంబరాలలో ఎలాంటి పరిస్థితుల్లోనూ డీజేకి అనుమతి లేదని ఆయన స్పష్టం చేశారు. అదేవిధంగా మండపాలలో దేవుడి పాటలు తప్ప సినిమా పాటలను పెట్టకూడదని, డీజే లను అనుమతి లేకుండా ఏర్పాటు చేసుకున్న ఇతర డాన్స్ కార్యక్రమాలు ఏర్పాటు చేసిన ఆయా కమిటీలపై తప్పనిసరిగా చర్యలు తీసుకోనున్నట్లు ఆయన వివరించారు. రాత్రి సమయాలలో మండపాలలో బంగారం, నగదు వంటి విలువైన వస్తువులు ఉంచరాదని, కమిటీ నిర్వాహకులలో ఒకరు రాత్రి సమయాలలో ఖచ్చితంగా నిద్రించాలని తెలిపారు. దీంతోపాటు ఊరేగింపు తేదీ, సమయం కచ్చితంగా పోలీసులకు తెలియపరచడం వల్ల అవసరమైన బందోబస్తు ఏర్పాటు చేయడం జరుగుతుందని ఆయన తెలిపారు. వినాయక చవితి పేరుతో చందాలు నిర్బంధంగా వసూలు చేయడం గాని మరి ఏదైనా అల్లర్లకు పాల్పటడడం గానీ చేసినట్లు తమ దృష్టికి వస్తే ఖచ్చితంగా చర్యలు ఉంటాయని ఆయన హెచ్చరించారు. వినాయక విగ్రహాల ఏర్పాటు నుంచి నిమజ్జనం వరకు పోలీసుల పర్యవేక్షణలోని ప్రతీ కార్యక్రమం నిర్వహించడం వల్ల శాంతిభద్రతలకు ఎలాంటి విఘాతం కలగదని ఇందుకు ప్రతి పౌరుడు ప్రతి కమిటీ సహకరించాలని సిఐ జి.యువకుమార్ తెలిపారు. ప్రతి ఒక్కరు కూడా వినాయక చవితిని ఆనందోత్సాహాల మధ్య ఆధ్యాత్మిక భావంతో పండుగ సంబరాలు జరుపుకోవాలని ఆయన ఆకాంక్షించారు. ఈ సమావేశంలో అవనిగడ్డ సిఐ జి.యువకుమార్, ఎస్ ఐ కె.శ్రీనివాస్, పోలీస్ సిబ్బంది, విగ్రహ కమిటీ నిర్వాహకులు పాల్గొన్నారు.చల్లపల్లి సర్కిల్ పరిధిలో ఇప్పటికే చవితి పందిళ్ళ నిర్వాహకులకు నిబంధనపై అవగాహన కల్పించారు.

## స్వామిత్వా సర్వే వేగవంతం చేయండి - డి ఎల్ పి వో రాఘవన్

**● రోజు కి 50 ఇళ్లు కొలత వేసి ఆన్లైన్ చెయ్యాలి**

**● జి.కొండూరు, పినపాక గ్రామాలలో ఇంటి కొలతల ప్రక్రియ ను పరిశీలించిన డి ఎల్ పి వో**





**జి.కొండూరు,ఆగష్టు 21 (వార్తాప్రభ) :** స్వామిత్వా సర్వే ప్రక్రియ ను వేగవంతం చేయాలని విజయవాడ డి ఎల్ పి వొ రాఘవన్ అధికారులను ఆదేశించారు.స్వామిత్వా సర్వేలో భాగంగా ఆయన మండల కేంద్రమైన జి.కొండూరు, పినపాక గ్రామాలలో గురువారం పర్యటించి ఇంటి కొలతల ప్రక్రియ ను పరిశీలించా రు.రోజు కి 50 ఇళ్లు కొలత వేసి ఆన్లైన్ చెయ్యాల ని గ్రామ సచివాలయం సిబ్బందికి సూచించారు. అలాగే గ్రామాలలో పారిశుధ్యం పట్ల ప్రత్యేక దృష్టిసారి ంచాలని అన్నారు.వర్షాకాలం కావడంతో సీజనల్ వ్యాధులు బారిన పడకుండా ప్రజలకు పరిశుద్ధం పట్ల అవగాహన కల్పించాలన్నారు. ఈ కార్యక్రమంలో గ్రామ పంచాయతీ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

## రాష్ట్ర అధికార భాషా సంఘానికి మండలి వెంకట కృష్ణారావు పేరు ఖరారు పట్ల బుద్ధప్రసాద్ హర్షం

**-చంద్రబాబు, పవన్ కళ్యాణ్, మంత్రివర్గానికి కృతజ్ఞతలు.**

**అవనిగడ్డ,ఆగష్టు 21 (వార్తాప్రభ) :** రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడుకు అవనిగడ్డ ఎమ్మెల్యే మండలి బుద్ధప్రసాద్ గురువారం ఒక ప్రకటనలో ధన్యవాదములు తెలిపారు. తన తండ్రి మండలి వెంకట కృష్ణారావు పేరును రాష్ట్ర అధికార భాషా సంఘానికి పెట్టినందుకు సీఎంకు కృతజ్ఞతలు తెలిపారు. ఇటీవల విజయవాడలో నిర్వహించిన శత జయంతి సభలో ప్రకటించిన వెనువెంటనే మంత్రి మండలి సమావేశంలో ఆమోదించిన సీఎం చంద్రబాబుకు, ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణుకు, మంత్రి మండలి సభ్యులందరికీ కృతజ్ఞతలు తెలిపారు.

# కార్పొరేషన్ చైర్మన్ కుటుంబంతో వస్తేనే శ్రీవారి దర్శనం

**● ఎమ్మెల్యేలు 15 రోజులకి ఒకసారి వస్తేనే దర్శనం ● టీటీడీపై, కూటమి ప్రభుత్వంపై వైసిపి నాయకులు దుష్ప్రచారం : ఎమ్మెల్యే పులివర్తి నాని**



**చంద్రగిరి,ఆగష్టు 21 (వార్తాప్రభ) :** కూటమి ప్రభుత్వం వచ్చిన తర్వాత ఏ విధంగా రాష్ట్రంలో గాని, జిల్లాలో గాని అభివృద్ధి ఏ విధంగా ముందు పోతుంది రాష్ట్రంలోని ప్రజలందరికీ తెలుసునని కూటమి ప్రభుత్వం దుష్ప్రచారాలను ఎవరు నమ్మరని చంద్రగిరి ఎమ్మెల్యే పులివర్తినాని తెలిపారు. ఈ సందర్భంగా గురువారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం పైన ఏదో విధంగా నిందలు మోపుతూ వైసీపీ ప్రచారం చేస్తాఉంది.గవర్నమెంట్ వచ్చిన రెండో నెల నుంచే హిందువులకి పవిత్రమైనటువంటి తిరుమల, కనకదుర్గమ్మ , శ్రీశైలం , సింహాచలం గుడి పైన ఏ విధంగా వైసిపి నాయకులు దాడి చేయడం మన ప్రత్యక్షంగా చూస్తున్నామని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. ముఖ్యంగా పవిత్ర పుణ్యక్షేత్రం తిరుమలకు సంబంధించి, టిడిడి మాజీ చైర్మన్ భూమన కరుణాకర రెడ్డి ఏ విధంగా టిడిడి పైన దుష్ప్రచారం చేస్తున్నారు ఆయన ఆవేదన వ్యక్తం చేశారు.గతంలో ఎన్నడూ లేని విధంగా విఐపి బ్రేక్ లు ఎమ్మెల్యేలకు సంబంధించి సిఫార్సు లేఖలు కూడా తగ్గించడం, అదేవిధంగా కార్పొరేషన్ చైర్మన్ కి కూడా వాళ్ళ కుటుంబం వస్తేనే దర్శనాలు, ఎమ్మెల్యేలు కూడా 15 రోజులకి ఒకసారి వస్తే దర్శనం కూటమి ప్రభుత్వం ప్రస్తుతం కల్పిస్తుందని ఆయన తెలిపారు. సొంతంగా వస్తే ఏ ప్రజా ప్రతినిధి అయినా సిఫార్సు లేఖకి బోర్డ్ మీటింగ్ లో పెట్టి నిర్ణయం తీసుకున్న తర్వాతే దర్శనాలు కల్పిస్తున్నదని ఆయన అన్నారు.కానీ గత పాలనలో ఒక ఎమ్మెల్యే స్థాయి ఉండొచ్చు, మంత్రుల స్థాయి ఉండొచ్చు, టిడిడి చైర్మన్ స్థాయి ఉండొచ్చు, రోజుకి ఎన్ని సార్లు దర్శనాలకు పోయినారో మీరు చూస్తుంటార తెలిపారు.కానీ ఏమి లేకపోయినా టిడిడి చైర్మన్, టీవీ 5 బి ఆర్ నాయుడు పైన దుష్ప్రచారం చేస్తున్నారు అంటే, ఒక తెలుగుదేశం పార్టీకి చెడ్డ పేరు తేవాలనే ఉద్దేశంతో భూమన కరుణాకర రెడ్డి చేస్తున్నారని మండిపడ్డారు. భూమన కరుణాకర రెడ్డి అనుచరుడు నాగరాజు అనే వ్యక్తి తిరుమలలో ఏ విధంగా గందరగోళం చేశారో మనం ప్రత్యక్షంగా చూస్తున్నామని ఆవేదన చేశారు.భూమన కరుణాకర రెడ్డికి సంబంధించిన వ్యక్తులు సుమారు 15 హొటల్స్ ఉంటే, ఈరోజు ఆన్లైన్ టెండర్ ద్వారా అందరికీ వర్తించే విధంగా చేయడం, భూమన కరుణాకర రెడ్డికి సంబంధించిన వ్యక్తులు ఈరోజు బహిరంగంగా తట్టల వ్యాపారం బ్లాక్ మెయిల్ చేస్తుంటే కట్ చేసి అందరికి వచ్చే విధంగా ఈరోజు టిడిడి చేస్తా ఉందన్నారు. గతంలో టీటీడీ ఈవో గా ఉన్న ధర్మారెడ్డి టీటీడీ ని అడ్డం పెట్టుకొని ఢిల్లీ స్థాయిలో పైరవీలు చేస్తూ వైసీపీ అక్రమాల పైన ఏ విచారణ లేకుండా మేనేజ్ చేశారని ఆయన మండిపడ్డారు. గోశాలలో హరినాథ్ రెడ్డి చేసిన ఒక దుష్ట పాలన వల్ల గోవులు చనిపోతే, ఆరోజు పెద్ద విషయం చేశారు. వైకుంఠ ఏకాదశి రోజు తిరుపతిలో తొక్కిసలాట జరిగితే దాన్ని తిరుమల తిరుపతి దేవస్థానం, దాన్ని కూడా నింద మోపి రాష్ట్రం కాదు, దేశవ్యాప్తంగా కూడా చేశాడు. ఎక్కడే నడిచేటప్పుడు చిన్న చిన్న జంతువుల వల్ల ఇబ్బంది కలిగితే దాన్ని కూడా పెద్ద చేయాలనుకున్నాడు. ఇదే భూమన కరుణాకర రెడ్డి, ఆయన హయాంలో పులులు దాడి చేస్తే కర్రలు కొనిచ్చినాడు. చంద్రగిరి నియోజకవర్గంలో మీ శిష్యుడు చెప్పుకుంటున్నా, చెవిరెడ్డి భాస్కర్ రెడ్డి ఆరోజు లోకల్ బాడీ ఎలక్షన్ లో, పౌర సరఫరాల శాఖకి సంబంధించిన వాన్ లో తిరుమల కళ్యాణం లడ్డులు, వడలు పంచిపెట్టి టీటీడీ నీ భ్రష్టు పట్టించాలని ఎమ్మెల్యే నాని ఆవేదన వ్యక్తం చేశారు. ఎన్ డి ఏ కూటమి అధికారంలో వచ్చిన తర్వాత తిరుమల పవిత్రతను కాపాడుతూ భక్తులకి శ్రీవారి దర్శనం కల్పిస్తూ విఐపి దర్శనాల్లో సైతం చాలా వరకు తగ్గించి సామాన్య భక్తులు స్వామివారి దర్శించుకునే విధంగా ఏర్పాటు చేయడం జరిగిందని ఆయన అన్నారు. ఈ కార్యక్రమంలో నియోజకవర్గంలోని అన్ని మండలాల పార్టీ అధ్యక్షులు యూనిట్ ఇన్చార్జిలు, క్లస్టర్ ఇంచార్జిలు, టిడిపి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

Printer Publisher and owned by V. Sree Ram Yadav. Printed at Arunodaya Notebook Mfrs Pvt Ltd #33-5-9, Papaiah Street, Seetharampuram, Vijayawada .krishna Dist. AP. and Published from # 34-2-74, Bellapu Shobhanadri Street, Kasthuribaipeta, Vijayawada. Krishna Dt. AP Editor V. Sree Ram Yadav, RNI No. 12176/2004 E-mail: varthaprabhatelugudaily@gmail.com. Cell: 9347993188